thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 29 | కరీంనగర్ బుధవారం, 9 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

న్యూఢిల్లీ : వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికి దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు.




# డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్....

# ప్రక్షాళన షురూ!

## 10 నుంచి కొత్త విధానం

హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సమర్థవంతంగా సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా మరింత మెరుగైన సేవలను అందించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురాబోతున్నామన్నారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను మొదటి దశలో ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి వస్తుందని ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, రంగారెడ్డి జిల్లా శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట్, పెద్దపల్లి జిల్లా రామగుండం, ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం, మేడ్చల్, మహబూబ్ నగర్ , జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, నాగర్ కర్నూల్ కార్యాలయాల్లో ప్రారంభిస్తున్నామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే రోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వల్ల జరిగే జాప్యాన్ని నివారించడానికి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ రోజు వారి పని వేళలను 48 స్లాట్లుగా విభజించినట్లు చెప్పారు.

ప్రజలు నేరుగా registration.telangana.gov.in వెబ్-సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్ధేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చన్నారు.

స్లాట్ బుక్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారని, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారని తెలిపారు.

**అదనపు సిబ్బంది నియామకం...** పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి మరియు 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని మంత్రి శ్రీనివాస్?రెడ్డి తెలిపారు. ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు మరియు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. దీంతో కుత్బుల్లాపూర్ కార్యాలయంలో 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయన్నారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేస్తున్నామని, ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పని భారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విధానాన్ని ముందుగా రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట - సరూర్ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేస్తామన్నారు.

**సొంతంగా డాక్యుమెంట్లు...** రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్ సైట్ లో ఒక మాడ్యూల్ ని ప్రవేశ పెట్టామని మంత్రి ప్రకటించారు. మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం ఉంటుందన్నారు. ఇది కూడా ఐచ్ఛికమేనన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజు పైన అమ్మినవాళ్ళు, కొన్నవాళ్లు, సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా/భౌతికంగా సంతకాలు చేయడానికి చాలా సమయం పట్టడం వల్ల దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతుంది. దీని వల్ల ప్రజల సమయం వృథా అవడం ద్వారా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని నివారించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామని ఈ నెల చివరిలోగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

**డబుల్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ...** ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మా ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఫిర్యాదులు ప్రజల నుండి ఎక్కువగా వస్తున్నాయని, డబుల్ రిజిస్ట్రేషన్ లను నివారించడానికి చట్టాన్ని సవరించబోతున్నామని మంత్రి తెలిపారు. డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివిధ రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలను సవరించుకున్నాయని, అదే విధంగా తెలంగాణలో కూడా చట్టసవరణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22 కి సవరణ చేస్తూ సెక్షన్ 22-బి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.




అక్కడ బాంబులు పెట్టాం ఎవరూ రావొద్దు.. ఇలాంటి హెచ్చరికలు సినిమాలోనో లేదంటే.. ఏ టెర్రరిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లోనో వినబడుతుంటాయి. తెలంగాణలోని ములుగు జిల్లాకు ఇలాంటి వార్నింగ్ ఇచ్చారు మావోయిస్టులు. ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం కర్రీగుట్ట చుట్టూ బాంబులు పెట్టమంటూ మంగళవారం ( ఏప్రిల్ 8 ) సంచలన లేఖ విడుదల చేశారు మావోయిస్టులు. మావోయిస్టుల లేఖతో ములుగు జిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు.

ఇందుకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం కర్రీగుట్ట చుట్టూ బాంబులు అమర్చామని.. కర్రీగుట్ట పరిసరాలకు ఎవరూ రావద్దని.. లేఖ విడుదల చేశారు మావోయిస్టులు. వాజేడు - వెంకటాపురం ఏరియా కమిటీ శాంత పేరుతో లేఖ విడుదల చేశారు మావోయిస్టులు. ఆపరేషన్ కగార్ దాడి నుంచి రక్షణ కోసమే కర్రీగుట్టపై బాంబులు అమర్చామని లేఖలో పేర్కొన్నారు మావోయిస్టులు. వేట కోసం, షికారు కోసం కర్రీగుట్ట దగ్గరకు వచ్చి ప్రాణాలు కోల్పోవద్దని హెచ్చరించారు. మావోయిస్టుల రక్షణ కోసం అమర్చిన బాంబులు తొక్కి అమాయక ప్రజలు చనిపోతున్నారని .. మరికొంతమంది గాయపడుతున్నారని.. పోలీసులు ప్రజలకు డబ్బులు ఇస్తూ.. మాయమాటలు చెప్పి ఇన్ఫార్మర్లుగా మార్చుకుంటున్నారని అన్నారు. పోలీసుల మాయమాటలు వలలో పడి కర్రీగుట్ట పైకి ప్రజలు ఎవరు రావద్దని లేఖలో పేర్కొన్నారు మావోయిస్టులు.

## అమలులోకి వచ్చిన వక్ఫ్ సవరణ చట్టం.. నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం




దేశంలో వక్ఫ్ సవరణ చట్టం నేటి నుంచి అమలులోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గతవారం పార్లమెంట్ ఉభయసభలు సవరణ చట్టాన్ని ఆమోదించి.. రాష్ట్రపతికి పంపిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం ఆమోదించగా.. ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందన్న విషయం ప్రకటించలేదు. అయితే, నేటి నుంచి (ఏప్రిల్ 8) నుంచి వక్ఫ్ చట్టం అమలులోకి వచ్చిందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కేంద్రం పంపిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఏప్రిల్ 8న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బిల్లును ఆమోదించారు. బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్ బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. రెండు బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారని న్యాయ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఏప్రిల్ 4న రాజ్యసభ బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లు రాగా, లోక్‌సభ సుదీర్ఘ చర్చ తర్వాత ఏప్రిల్ 3న బిల్లుకు ఆమోదం తెలిపింది. లోక్‌సబలో 288 మంది ఎంపీలు అనుకూలంగా, 232 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే, 1995 చట్టం ప్రకారం.. వక్ఫ్ అనేది ముస్లిం చట్టం కింద ఓ వ్యక్తి తన ఆస్తిని మతపరమైన, దాతృత్వ ఉద్దేశాల కోసం శాశ్వతంగా అంకితం చేయడం. ఒకటి ప్రకటన ద్వారా, దీర్ఘకాల వినియోగం ఆధారంగా (వక్ఫ్ బై యూజర్), వారసత్వం అంతరించినప్పుడు (వక్ఫ్-అలల్-ఔలాద్) ఏర్పడుతుంది. ఈ చట్టం కింద వక్ఫ్ బోర్డులకు ఆస్తులను నిర్వహించే, వాటిని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉంటుంది. సర్వే కమిషనర్ ఆస్తుల సర్వే చేస్తారు. వివాదాలను వక్ఫ్ ట్రిబ్యునల్స్ పరిష్కరిస్తాయి. వాటి నిర్ణయాలు అంతిమంగా పరిగణిస్తారు. చట్టం ప్రకారం, వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలు మాత్రమే కావాల్సి ఉంటుంది. ఆస్తులపై బోర్డుకు పూర్తి నియంత్రణ ఉంటుంది. ఈ విధానంలో పారదర్శకత లేకపోవడం, ఆస్తుల దుర్వినియోగం తదితర సమస్యలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వక్ఫ్ బోర్డులు ప్రభుత్వ ఆస్తులను సైతం వక్ఫ్‌గా ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. కొత్త తీసుకువచ్చిన చట్టం ప్రకారం.. ఎవరైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించాలంటే ఆ వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాం ఆచరించి ఉండాలి. ఆస్తి అతనికి మాత్రమే సొంతమై ఉండాలి. సవరణ చట్టంలో 'వక్ఫ్ బై యూజర్' నిబంధన తొలగించారు. వక్ఫ్-అలల్-ఔలాద్‌లో స్త్రీలతో సహా వారసుల హక్కులు కాపాడబడతాయి. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్‌కు ఇచ్చారు. వక్ఫ్ ఆస్తుల వివరాలు ఆరు నెలల్లో కేంద్రీయ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరు స్త్రీలతో పాటు ఇద్దరు ముస్లిం కాని సభ్యులను సైతం చేర్చాల్సి ఉంటుంది. ట్రిబ్యునల్ నిర్ణయా మాత్రమే అంతిమం కాదు. 90 రోజుల్లో హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇకపై వక్ఫ్ బోర్డులకు ఏకపక్షంగా ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉండబోదు.

# హైకోర్టులో ఎదురు దెబ్బ..

## సుప్రీంకోర్టుకు దిల్‌సుఖ్ నగర్ జంట పేలుళ్ల కేసు నిందితులు




హైదరాబాద్: దిల్‌సుఖ్ నగర్ జంట పేలుళ్ల కేసులో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. పేలుళ్లకు పాల్పడ్డ ఐదుగురు నిందితులకు ఉరిశిక్ష సరైనదేనని తీర్పు వెల్లడించింది. NIA ట్రయల్ కోర్టు విధించిన తీర్పును హైకోర్టు సమర్థించింది. కాగా, దిల్‌సుఖ్ నగర్లో మారణహోమం సృష్టించిన నిందితులకు 2016 డిసెంబర్ 13న ఎన్ఐఏ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఎన్ఏఐ కోర్టు తీర్పును నిందితులు తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. ఉరిశిక్ష విధిస్తూ ఎన్ఏఐ కోర్టు జారీ చేసిన ఆదేశాలను కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్?పై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు 2025, ఏప్రిల్ 8న తుది తీర్పు వెలువరించింది. నిందితులకు ఉరి శిక్ష విధిస్తూ ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. దీంతో నిందితులు కీలక నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టులో ఎదురు దెబ్బ తగలడంతో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు?లో సవాల్ చేస్తామని నిందితుల తరుపు న్యాయవాదులు తెలిపారు. నెల రోజుల్లో సుప్రీంకోర్టులో ఛాలెంజ్ పిటిషన్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు. దీంతో దేశ సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ సమీపంలో కొద్ది నిమిషాల గ్యాప్‌లోనే రెండు పేలుళ్లు జరిగాయి. మొదట బస్టాండ్ ఎదురుగా ఒక బాంబ్ పేలిన కొద్దిసేపటికే.. 150 మీటర్ల దూరంలోనే మరో బ్లాస్ట్ సంభవించింది. టిఫిన్ బాక్సులో బాంబు పెట్టి.. టెర్రరిస్టులు ఈ దాడికి పాల్పడ్డారు. పేలుళ్ల ధాటికి 17 మంది మరణించగా, దాదాపు 130 మందికిపైగా గాయపడ్డారు.బ్లాస్ట్ కేసును NIA దర్యాప్తు చేసింది. ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రసంస్థ సహ వ్యవస్థాపకుడు యాసిన్ భత్కల్, అసదుల్లా అక్తర్ (యూపీ), జియా-ఉర్-రెహమాన్ (పాకిస్థాన్), తెహసీన్ అక్తర్ (బీహార్), అజాజ్ షేక్ (మహారాష్ట్ర) కలిసి ఈ దాడికి పాల్పడినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ప్రధాన నిందితుడు మహమ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ భత్కల్ పరారీలో ఉండగా, మిగిలిన అసదుల్లా అక్తర్ అలియాస్ హద్దీ, జియా ఉర్ రహమాన్ అలియాస్ వఘాస్, మహమ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్, మహమ్మద్ అహ్మద్ సిద్ధిబప అలియాస్ యాసిన్ భత్కల్, అజాజ్ షేక్ అలియాస్ సమర్ అర్మాన్ తుండె అయిదుగురికి ఎన్ఐఏ కోర్టు ఉరిశిక్ష విధించింది.



# ముగిసిన సీడబ్ల్యూసీ మీటింగ్, కాంగ్రెస్ 7 తీర్మానాలు.. అవి ఏంటంటే..

అహ్మదాబాద్ వేదికగా కాంగ్రెస్ కీలక సమావేశం జరుగుతోంది. ఆరు దశాబ్దాల తర్వాతా గుజరాత్‌లో ఏఐసీసీ అత్యున్న సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్న 2000 మంది వరకు ప్రముఖ నేతలకు ఆహ్వానం అందింది. మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశంలో 7 కీలక తీర్మానాలు చేసింది. 1) రైతుల హక్కుల కోసం పోరాటం చేయడం. నల్లచట్టాలు, MSP పెంపు లాంటి అంశాలపై రైతులకు అండగా సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తి తో పోరాటం. బీజేపీ క్రూరమైన బ్రిటిష్ విధానాలను అవలంబిస్తుందని విమర్శలు. 2) దేశంలో విద్వేష రాజకీయాలపై పోరాటం చేయాలని నిర్ణయించింది. బీజేపీ దేశంలో ఐక్యత స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తోంది. ప్రాంతీయ విద్వేషాలు, మతాల మధ్య చిచ్చు పెడుతోంది. సర్దార్ పటేల్ బలమైన నాయకత్వం, జవహర్ లాల్ నెహ్రూ దూరదృష్టితో దేశంలో 560కి పైగా సంస్థానాలు విలీనమై ప్రజాస్వామ్య పునాది పడింది. దీనిని బీజేపీ దెబ్బతీసే ప్రయత్నం చేస్తుంది. దేశంలో విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని తీర్మానం చేసింది.

3) కార్మికులు, కర్షకుల హక్కుల కోసం పోరాటం. 4) సామాజిక న్యాయం కోసం పోరాటం. 5) సమాజంలో అసమానతలు, అంతరాలపై తీర్మానం. బ్రిటీష్ వారు దేశ వనరులు దోచుకున్నారు, ఇప్పుడు బీజేపీ కూడా ఇక్కడి సంపదను దోచుకుంటోంది. క్రోనీ క్యాపిటలిస్టులకు దేశ ఖజానాను ఉపయోగిస్తోంది. ఇది సమాజంలో అసమానతలను, అంతరాలను పెంచుతోంది. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని తీర్మానం చేశారు. 6) హింసా, మతతత్వానికి వ్యతిరేకంగా తీర్మానం. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఫిబ్రవరి 4, 1948లో ఆర్ఎస్ఎస్‌ని నిషేధించారు. తన లేఖలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని గురించి ప్రస్తావించారు. కానీ నేను హింస, మతతత్వం యొక్క భావజాలం దేశాన్ని అగాధంలోకి నెట్టివేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సర్దార్ పటేల్ నిశ్చయతను అనుసరించాలని తీర్మానం చేసింది. 7) గాంధీ-నెహ్రూ-పటేల్ యొక్క విడదీయరాని నాయకత్వం, దీనిపై ప్రస్తుతం దాడి జరుగుతుంది. శత్రుత్వం, విభజన శక్తుల్ని ఎదుర్కోవాలని తీర్మానం.



# చైనా టారిఫ్‌లపై వెనక్కి తగ్గితే మేలు..!

అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ముదిరిపోతోంది. ఈక్రమంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ' (డోజ్) శాఖ సారథి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చైనా టారిఫ్‌లపై వెనక్కి తగ్గాలని అధ్యక్షుడు ట్రంప్‌నకు సూచించినట్లు తెలుస్తోంది. ఈమేరకు పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వెల్లడిస్తున్నాయి. కథనాల ప్రకారం.. ట్రంప్‌తో మస్క్ నేరుగా చర్చలు జరిపారు. ఈసందర్భంగా చైనాపై టారిఫ్ విషయంలో పునఃపరిశీలించాలని మస్క్ సూచించారు. అయితే, అవి విఫలమైనట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఇదిలాఉండగా.. ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లపై మస్క్ ఇప్పటివరకు తన అభిప్రాయాన్ని పంచుకోలేదు. అయితే, ఇటీవల ఆయన ఎక్స్ వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. ఆ వీడియోలో ఆర్థికవేత్త మిల్టన్ ఫ్రిడ్‌మాన్ అంతర్జాతీయ వాణిజ్య సహకారం కారణంగా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. దీంతో ప్రపంచ వాణిజ్య సహకారానికి సుంకాలు చెడ్డవనేది మస్క్ అభిప్రాయంగా కన్పిస్తోంది.

**చమురు ధరలపై ట్రంప్ టారిఫ్ దెబ్బ.. ఆందోళనలో రష్యా...** ఇక, పరస్పర సుంకాల నేపథ్యంలో చైనా దిగుమతులపై అమెరికా 34 శాతం సుంకం విధించింది. దీనికి డ్రాగన్ సైతం దీటుగా స్పందించింది. రెండువిధాలా వాడుకునేందుకు అవకాశం ఉన్న వస్తువులను అమెరికాకు చెందిన 16 సంస్థలకు ఎగుమతి చేయడంపై నిషేధం విధించాలని నిర్ణయించింది.

అమెరికాలోని రక్షణ, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ల పరిశ్రమలను దెబ్బతీసే రీతిలో కొన్ని రకాల అరుదైన ఖనిజాల ఎగుమతులపై నియంత్రణలు ప్రకటించింది. దీంతోపాటు ప్రతీకార సుంకాలపై 'ప్రపంచ వాణిజ్య సంస్థ' (డబ్ల్యూటీవో)లో వ్యాజ్యం దాఖలు చేసింది. బీజింగ్ తీరును ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. ఏప్రిల్ 8లోగా డ్రాగన్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. లేదంటే ఏప్రిల్ 9 నుంచే 50 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. దీంతో చర్చలు కూడా నిలిచిపోతాయని తేల్చి చెప్పేశారు. ఈ సందర్భంగా తాను హెచ్చరించినప్పటికీ.. అదనపు సుంకాలతో అమెరికాపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఏ దేశమైనా ప్రయత్నిస్తే వెంటనే మరిన్ని టారిఫ్‌లు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# తెలంగాణలో నెగెటివ్ పాలసీలు.. నెగెటివ్ పాలిటిక్స్: కేటీఆర్



హైదరాబాద్: తెదేపా తర్వాత భారాస విజయవంతంగా పాతికేళ్లు పూర్తిచేసుకుంటోందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస రజతోత్సవ సభకు అనుమతివ్వాలని డీజీపీని కోరామని చెప్పారు. 3 వేల ఆర్టీసీ బస్సులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "భారాస చరిత్రలో రజతోత్సవ సభ అతి పెద్దది అవుతుంది. డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేపడతాం. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుంది. ప్రతి నెలా వివిధ జిల్లాల్లో కార్యక్రమాలు చేపడతాం. జూన్, జులైలో స్థానిక సంస్థల ఎన్నికలు రావచ్చంటున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల ప్రభావం రాష్ట్రంలోని ఫార్మా, ఐటీ ఎగుమతులపై ఉంటుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తెలంగాణ వృద్ధిరేటు పడిపోయింది. మద్యంపై వచ్చే ఆదాయం తప్ప మిగిలినదంతా తగ్గింది.

**సీఎంగా రేవంత్ విఫలమైనందునే హైకమాండ్ జోక్యం...** రాష్ట్రంలో నెగెటివ్ పాలసీలు.. నెగెటివ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. మాజీ సర్పంచ్ నుంచి మాజీ సీఎం స్థాయి వ్యక్తులపై కేసులెలా పెట్టాలా? అని చూస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ఉద్దేశం మాకు లేదు. హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కేసుల ఉపసంహరణ సరిపోదు.. జంతువధ కారకులపై కేసులు పెట్టాలి. ఏఐ వీడియోల పేరుతో తప్పించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. 'ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్' అని మేం అనవచ్చు. రెండు జాతీయ పార్టీల జుట్టు దిల్లీ చేతుల్లోనే ఉంది. 16, 17 నెలలైనా మంత్రివర్గాన్ని విస్తరించుకునే పరిస్థితి లేదు. ఇన్నిసార్లు దిల్లీ వెళ్లినా ఒక్క రూపాయి కూడా రాలేదు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షలు చేస్తున్నారు. సీఎంగా రేవంత్ విఫలమైనందునే కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకుంటోంది. కంచ గచ్చిబౌలి భూముల వెనుక రూ.వేలకోట్ల బాగోతం ఉంది. దీనిలో భాజపా ఎంపీ హస్తం కూడా ఉంది. ఆ వివరాలు 2, 3 రోజుల్లో చెబుతా.

రేవంత్.. కాంగ్రెస్, భాజపా ఉమ్మడి ముఖ్యమంత్రి. గోదావరి, కృష్ణా జలాల్లో విచ్చలవిడి జలదోపిడీ జరుగుతోంది. భూకంపం, భారీ వరద వచ్చినా మేడిగడ్డ చెక్కుచెదరలేదు. కేసీఆర్‌పై కోపంతో నీళ్లు వదిలేశారు.. పంటలు ఎండుతున్నాయి. ఆదిత్యనాథ్‌దాస్‌ను సలహాదారుగా పెట్టుకున్నారు. ఆయన గతంలో ఏపీ తరఫున వాదించారు. ఆదిత్యనాథ్‌దాస్ నియామకం ఏపీ ప్రయోజనాల కోసమా? భారీగా ఖర్చు చేసి టూల్ కిట్ సాయంతో సోషల్ మీడియాలో మాపై ఎదురుదాడి చేయిస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.



# ప్రముఖ కంపెనీల్లో తప్పుడు ఐడీలతో ఉత్తరకొరియా ఉద్యోగులు..!

ప్రముఖ కంపెనీల్లో వేల మంది ఉత్తరకొరియా వాసులు.. అమెరికా వారిలా నటిస్తూ ఉద్యోగాలు చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. వీరు దొంగిలించిన లేదా తప్పుడు ఐడీలతో ఈ ఉద్యోగాలు సంపాదించినట్లు గుర్తించారు. వీరి జీతం సొమ్ములో చాలా వరకు ప్రభుత్వ ఆయుధ తయారీకి వెళుతున్నట్లు అనుమానిస్తున్నారు. 2018 నుంచి వేల మంది ఈ రకంగా ఉద్యోగాల్లో చేరినట్లు అమెరికా విదేశాంగశాఖ, ట్రెజరీ విభాగం, ఎఫ్‌బీఐ సంయుక్తంగా అంచనా వేస్తున్నాయని ఫార్చ్యూన్ పత్రిక కథనంలో పేర్కొంది. తన సంస్థలో ఉద్యోగాల కోసం ప్రకటన ఇస్తే.. ఉత్తర కొరియా ఇంజినీర్లు.. అమెరికన్లమని చెప్పుకొంటూ దరఖాస్తు చేస్తున్నట్లు %స్త్ర8నివవజూ% అనే క్రిప్టో స్టార్టప్‌కు చెందిన హారిసన్ లెగియో వెల్లడించారు. ఐరాస అంచనాల ప్రకారం ఉత్తర కొరియా ఐటీ వర్కర్స్ స్కామ్ రూపంలో 2018 నుంచి ఏటా ఆ దేశానికి 250 నుంచి 600 మిలియన్ డాలర్ల వరకు చేరుతున్నట్లు తేలింది. ముఖ్యంగా ఏఐ వినియోగంలోకి వచ్చాక ఉత్తరకొరియా వాసుల స్కామ్‌లు పెరిగిపోయినట్లు పేర్కొంది. కొందరు ఏకకాలంలో పలు ఉద్యోగాలు చేస్తున్నట్లు గుర్తించారు. గూగుల్ క్లౌడ్‌లో ఇంటెలిజెన్స్ లీడర్‌గా పనిచేసే మిషెల్ బార్న్‌హార్ట్ కొన్నేళ్లుగా ఉత్తరకొరియా నుంచి వచ్చే ముప్పులను అధ్యయనం చేస్తున్నాడు. అతడు ఈ స్కామ్ ఎలా జరుగుతోందో వివరించాడు. ఈ ఇంజినీర్లను చైనా, రష్యాలో ఉంచి ఏఐ సాయంతో ఓ మంచి కంపెనీలో అనుభవం ఉన్నట్లు బయో తయారు చేస్తారు. అప్పటికే దొంగతనం చేసి సిద్ధంగా ఉంచిన అమెరికన్ ఐడీలతో ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తారు. వీరికి అమెరికాలో లేదా ఇతర ప్రాంతాల్లోని ఫెసిలిటేటర్లు సాయం చేస్తారు. కొందరు ఏకంగా డమ్మీ ఐటీ కంపెనీలు, వెబ్‌డిజైన్ ఏజెన్సీలను తెరుస్తారు. ఇవి నిజమైనవే అని నమ్మి ఫార్చ్యూన్ 500 కంపెనీలు కూడా వారిని నియమించుకొంటున్నట్లు బార్న్‌హార్ట్ వెల్లడించారు.

**2024లో 300పైగా ఘటనలు..** ఐడెంటీ వెరిఫికేషన్ సంస్థ హైపర్ సైతం ఇలాంటి పరిస్థితి ఎదుర్కొందని దాని సీఈవో బోజన్ సిమిక్ వెల్లడించారు. ఓ సందర్భంలో తాము ఉద్యోగం కోసం ఒక వ్యక్తిని ఇంటర్వ్యూ చేశామని చెప్పారు. అతడు ప్రదర్శన అద్భుతంగా ఉండటంతో నియమించుకొన్నట్లు పేర్కొన్నారు. కానీ, విధుల్లో మాత్రం వేరే వ్యక్తి చేరినట్లు గుర్తించామన్నారు. అతడు పోలాండ్‌లో ఉంటున్నట్లు చెప్పగా.. కానీ, జియో లొకేషన్ మాత్రం స్పెయిన్‌లో చూపిస్తోందన్నారు. ఇక సైబర్ సెక్యూరిటీ కంపెనీ క్రౌడ్‌స్ట్రైక్ 2024లో ఇలాంటి 304 ఘటనలను గుర్తించింది. వీటన్నింటి వెనుక ఉత్తరకొరియాకు చెందిన ఫేమస్ చోలిమా అనే గ్రూపు ఉన్నట్లు గుర్తించింది. దీని కార్యకలాపాలు 2025లోకూడా కొనసాగవచ్చని అంచనావేసింది. ఈ గ్రూపులో రెండు విభాగాలు ఉంటాయని.. వాటిల్లో ఒకటి మాల్వేర్ ఆపరేషన్ల సాయంతో క్రిప్టో చోరీలకు పాల్పడుతుంది. మరొకటి ఐటీ వర్కర్స్ స్కామ్ నిర్వహిస్తుంది. ఉ.కొరియా వ్యక్తులను ఇతర దేశాల్లో ఉద్యోగాల్లోకి చొప్పించి.. వారి జీతం సొమ్ములో కొంత భాగాన్ని అణుకార్యక్రమాలకు మళ్లిస్తోంది.

# మోదీ ప్రభుత్వంలో దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యం




హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల ఘటనపై తెలంగాణ హైకోర్టు తీర్పుపై కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పందించారు. దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల ఘటనపై తెలంగాణ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. మారణహోమాన్ని సృష్టించిన ఉగ్రవాదులకు ఉరే సరైన శిక్ష అని తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం పేర్కొనడం ప్రజాస్వామ్యంలో హింస, ఉగ్రవాదానికి చోటు లేదని మరోసారి స్పష్టమైందని చెప్పారు. 12 ఏళ్లుగా ఓ పీడకలలా వెంటాడుతున్న బాధితుల కుటుంబాలకు సరైన న్యాయం జరిగిందని భావిస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని కిషన్ రెడ్డి మాటిచ్చారు. ఎన్ఐఏ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు సమర్థించడం పట్ల బీజేపీ పార్టీ పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నాని కిషన్ రెడ్డి అన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు జీరో టోలెరెన్స్ విధానంతో మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. గత 11 ఏళ్ల బీజేపీ పాలనలో ఇలాంటి ఘటనలకు తావు లేదని తేల్చిచెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తుచేశారు. ఉగ్రవాదాన్ని సంపూర్ణంగా నిర్మూలించే దిశగా మోదీ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో బుజ్జగింపు రాజకీయాలు ఏ మాత్రం ప్రోత్సహించకూడదని.. ఈ విషయాన్ని అన్ని రాజకీయపార్టీలు గుర్తుంచుకోవాలని సూచించారు. జాతీయ దర్యాప్తు సంస్థ సమగ్ర విచారణ చేసి, నిందితులను శిక్షించడంలో కీలకపాత్ర వహించిందని చెప్పారు. ఈ పేలుళ్ల సంఘటన దర్యాప్తు చేసిన పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. దేశ భద్రత కోసం అత్యంత ప్రాధాన్యం ఇస్తూ మరింత కఠిన చర్యలు ప్రభుత్వాలు అవలంబించాలని కిషన్‌రెడ్డి కోరారు.

# దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో తీర్పుపై రాజాసింగ్ ఏమన్నారంటే



హైదరాబాద్, ఏప్రిల్ 8: దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో దోషులకు తెలంగాణ హైకోర్టు ఉరిశిక్ష విధించడంపై ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... దిల్‌సుఖ్‌నగర్ బాంబ్ బ్లాస్ట్ కేసులో 12 ఏళ్ల తరువాత తీర్పు రావడం సంతోషకరమన్నారు. ఎన్ఐఏ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఆ బాంబ్ బ్లాస్ట్ కేసులో చనిపోయిన వారంతా పేద ప్రజలని తెలిపారు. ఒక మతానికి చెందిన వారంతా ఈ బ్లాస్ట్‌లకు పాల్పడ్డారని మండిపడ్డారు. చనిపోయిన వారిలో అన్ని మతాల వారు ఉన్నారన్నారు. జిహాద్ అంటే అమాయకులను చంపడమేనా అని ప్రశ్నించారు. ఈ కేసులో ఏ1గా ఉన్న యాసిన్ బాత్కాల్ ఇంకా దొరక లేదన్నారు. ఉరిశిక్ష కాకుండా ప్రజా కోర్టులో ఎన్‌కౌంటర్ చేయాలని ఎన్ఐఏ వారిని కోరుతున్నానని.. ఈ మేరకు వారు అనుమతి తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. కాగా.. 2013, ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లో వరుస బాంబు పేలుళ్ల ఘటనలో దాదాపు 17 మంది మృతి చెందగా.. 150 మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసుపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ఎన్ఐఏ... 2016లో ఐదుగురు నిందితులను దోషులుగా గుర్తించి ఉరిశిక్ష విధించింది. ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో నిందితులు సవాల్ చేయగా.. విచారణ జరిపిన న్యాయస్థానం ఆ ఐదుగురిని దోషులుగా గుర్తిస్తూ ఉరిశిక్ష విధించింది.

**రియాజ్‌ను అందుకే పట్టుకోలేకపోతున్నారు: ఎన్ఐఏ స్పెషల్ పీపీ...** హైకోర్టు తీర్పుపై ఎన్ఐఏ స్పెషల్ పీపీ విష్ణువర్ధన్ రెడ్డి ఏబీఎన్‌తో మాట్లాడుతూ... దిల్‌సేఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కేసులో ఐదు మంది నిందితులను దోషులుగా గుర్తిస్తూ ఎన్ఐఏ కోర్ట్ ఉరిశిక్ష విధించిందని తెలిపారు. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించిందన్నారు. కేసులో 150 మంది సాక్షులను న్యాయస్థానంలో స్టేట్‌మెంట్లు ఇప్పించామని.. ఇందులో టెక్నికల్ ఎవిడెన్స్ , సాక్షుల స్టేట్మెంట్‌లను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. దీంతో ఐదు మందికి ఎన్ఐఏ కోర్ట్ ఉరిశిక్ష ఖరారు చేసిందన్నారు. ట్రయల్ కోర్ట్ ఇచ్చిన తీర్పుపై నిందితులు వేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసిందన్నారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయడానికి 90 రోజులు ఉంటుందని.. ఈ 90 రోజుల్లో అప్పీల్‌కు వెళ్ళక పోతే డెత్ సెంటెన్స్‌ను అమలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రియాజ్ భత్కల్ అలియాస్ మహమ్మద్ రియాజ్ పాకిస్థాన్‌లో తలదాచుకున్నాడని తెలిపారు. శత్రుదేశం పాకిస్థాన్‌లో ఉండడం వలన రియాజ్ భత్కల్‌ను పట్టుకోవడం కష్టం అవుతోందన్నారు. ఎన్ఐఏ సమర్థవంతంగా విచారణ చేసి ఆధారాలు న్యాయస్థానం ముందు పెట్టామన్నారు. నిందితులు దిల్‌సుఖ్‌నగర్ బాంబ్ బ్లాస్ట్ కంటే ముందే హయత్ నగర్‌లో ట్రయల్ బ్లాస్ట్ చేశారని తెలిపారు. తమ వాదనలకు ఏకీభవించి ఐదు మంది దోషులు వేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసిందని విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు.

# కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది రేవంతే: బండి సంజయ్



హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది సీఎం రేవంత్‌రెడ్డేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. "నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై చెన్నైలో జరిగిన సమావేశానికి కేటీఆర్, రేవంత్ రెడ్డి కలిసే వెళ్లారు. హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే సమావేశానికీ ఇద్దరూ కలిసే ప్లాన్ చేస్తున్నారు. ఆ ఇద్దరూ కలిసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, భారాస ఎంపీలతో ఓటు వేయించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసే మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధమయ్యారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రేవంత్‌ను కాపాడేందుకే కేటీఆర్ భారాస అభ్యర్థిని బరిలోకి దింపలేదు. తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ బుద్ధి మారలేదు. కేటీఆర్, రేవంత్ ఏకమై భాజపాను దెబ్బతీసేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారు. హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా? భూదందా, అవినీతిపరులపై ఉక్కుపాదం మోపే మోదీ సర్కార్ కేంద్రంలో ఉంది" అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా: కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్: తనపై వచ్చిన భూకబ్జా ఆరోపణలను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఖండించారు. దేవునూరు గుట్టలను ఆక్రమిస్తున్నారంటూ భారాస నేతలు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. దీనిపై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. "నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు. 2వేల ఎకరాలు కబ్జా చేశానంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. బినామీలకు భూములు అప్పగించేందుకు యత్నిస్తున్నానంటూ నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. నేను కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్య ఇంట్లో గులాంగా పనిచేస్తా. ఆరోపణలు నిరూపించలేకపోతే వారు నాకు గులాంగా ఉంటారా? తప్పుడు ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటా" అని కడియం శ్రీహరి అన్నారు.

# విచారణకు సహకరించాలి.. క్రిశాంక్‌కు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్: భారాస నేత మన్నె క్రిశాంక్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల ఘటనలో నకిలీ వీడియోలు వైరల్ చేశారని పోలీసుల ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. విచారణకు సహకరించాలని ఆయన్ను ఆదేశించింది. కొణతం దిలీప్‌నకు నోటీసులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించి.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఒకే ఘటనపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసులు పెట్టారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కంచ గచ్చిబౌలి భూముల ఘటనపై AI వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేసి వైరల్ చేశారని.. సీఎంపై అనుచిత పోస్టులు పెట్టారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

చురకలు



# పోరాట యోధుడు నర్రా రాఘవరెడ్డి

## – ఏప్రిల్ 9...నర్రా రాఘవ రెడ్డి వర్ధంతి




ఆయన కష్ట జీవుల రాజ్య స్థాపనకు అహర్నిశలు పోరాడిన ఒక రాజీలేని పోరాట యోధుడు. అలుపెరుగని కమ్యూనిస్టు ధీరుడు. కమ్యూనిస్టు ప్రమాణాలను ప్రాణంగా భావించిన ఆదర్శమూర్తి. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా జీవించిన ప్రజల మనిషి. అణగారిన వర్గాల పక్షపాతిగా, కష్ట జీవుల రాజ్య స్థాపనకు అహర్నిశలు పోరాడిన నేత. ఆరు సార్లు చట్టసభకు ఎన్నికైన మచ్చలేని ప్రజాప్రతినిధి. కమ్యూనిస్టుగా రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆ ఆదర్శ నేతనే నర్రా రాఘవరెడ్డి. నర్రా రాఘవ రెడ్డి ప్రజా జీవితం అత్యంత పారదర్శకం. ఆయన అతి సాధారణ జీవితం రాజకీయ నేతలకు ఆదర్శం. నర్రా రాఘవరెడ్డి ఆదర్శ కమ్యూనిస్టు. కదు బీదరికంలో పుట్టి, అంతంత మాత్రం చదువుతో జీవ నం కోసం వలసవెళ్లి మిల్లు కార్మికునిగా జీవితం ఆరంభించిన రాఘవరెడ్డి, కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా, కార్యకర్తగా, నేతగా ఎదిగారు. నిరంతరం ప్రజల మధ్య మసలుతూ, వారి సమస్యలను ఆకళింపు చేసుకొని, ఆ అధికా రులు పాలకుల వద్దకు నిర్భయంగా తీసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తుండే చిత్తశుద్ధి కలిగిన రాజకీయ నాయకుడు. సిపిఎం శాసనసభా పక్ష నేతగా పనిచేసిన నర్రా రాఘవరెడ్డి నాల్గవ తరగతి వరకు మాత్రమే విద్యా భ్యాసం చేసినా, బాల్యం నుండే విప్లవ భావజాలాన్ని ఒంటబట్టించు కున్నారు. 1945 ప్రాంతంలో మజ్దూర్ యూనియన్ కమ్యూ నిస్టులో చేరిన నర్రా ఇల్లు విడిచి ముంబయికి వెళ్లి అక్కడ కూలీగా పనిచేస్తు కార్మిక హక్కుల కోసం పోరాడి కార్మిక నేతగా గుర్తింపు సాధించారు. తల్లి మరణంతో తిరిగి ఏనిమిదేళ్లకు స్వగ్రామానికి చేరుకున్న నర్రా 1950లో సిపిఐ పార్టీ సభ్యుడిగా చేరారు. కళాకారుడిగా, జానపద సంభాషణలు, చతురోక్తులు, సామెతలు, పిట్టకథలతో అనర్గళంగా మాట్లాడే నర్రా మాటలకు గ్రామీణులు ఆకర్షితులై ఆయనను అనుసరించారు. 1950లో సిపిఐ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పనిచేసిన నర్రా 1959లో వచ్చిన పంచాయతీ ఎన్నికల్లో చిట్యాల మండలం శివనేనిగూడెం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1964 ఎన్నికల్లో తిరిగి సర్పంచ్‌గా గెలిచిన నర్రా మరోసారి జడ్పీలో ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 1967లో జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా నకిరేకల్ శాసన సభ నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేసిన నర్రా రాఘవరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.కమలమ్మపై గెలిచి తొలిసారి శాసన సభలో అడుగుపెట్టారు. 1972లో జరిగిన ఎన్నికల్లో నకిరేకల్ స్థానం నుండి పోటీచేసిన నర్రా కాంగ్రెస్ అభ్యర్థి ఎం.కమలమ్మ చేతిలో ఓటమి పాలయి, 1978, 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా ఐదు సార్లు నకిరేకల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నర్రా రాఘవరెడ్డి 1924 సంవత్స రంలో చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా కమలమ్మ – రాంరెడ్డిలకు దంపతు లకు జన్మించారు. చిరు ప్రాయం లోనే తల్లి కమలమ్మ మరణించడం, తండ్రి పెంపకానికి దూరమై, పెద నాయన నర్రా వెంకటరామిరెడ్డి వద్ద పెరగడం, వెంకట రామిరెడ్డి చనిపోయాక మళ్లీ కన్న తండ్రి రాంరెడ్డి దగ్గరే ఉండాల్సి రావడం, పరిస్థితుల ప్రభావం వల్ల బతుకు దెరువునేతుకుంటూ ఊరొదిలి బొంబాయికి వలస వెళ్లారు. బొంబాయిలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని, బట్టల మిల్లులో కార్మికుడుగా చేరారు. కార్మికులకు కనీస హక్కులేని కాలమది. కంపెనీ యాజమాన్యం కార్మికుల కష్టాలు ఆలకించని పరిస్థితులుండేవి. కార్మికుల బాధలు తీర్చడానికి కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా 'లాల్‌బావుటా' బలమైన కార్మిక సంఘంగా పనిచేసేది. అందులో సభ్యుడిగా చేరిన నర్రా చురుకైన పాత్ర పోషించారు. కంపెనీలు మూతపడడం... 8 ఏళ్ల తర్వాత నర్రా తిరిగి సొంత ఊరొచ్చారు. బొంబాయిలో లాల్‌బావుటాలో పనిచేస్తున్న రోజుల్లోనే కమ్యూనిస్టు సిద్ధాంత పరిజ్ఞానాన్ని జీర్ణించుకున్న నర్రా జిల్లాకు వచ్చాక కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. 1949లో వట్టిమర్తి గ్రామంలో యువజన సంఘం స్థాపించి అధ్యక్షులుగా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ కొరియర్‌గా పనిచేశారు. 1950లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొంది గ్రామ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత తాలూకా కమిటీ సభ్యునిగా ఎన్నికై ప్రజల, కార్యకర్తలతో సత్సంబంధాలు ఏర్పరుచుకున్నారు. జిల్లాకు వచ్చాక గ్రామంలో క్షేత్ర స్థాయి కార్యకర్తగా పనిచేశారు. క్రమశిక్షణ, పట్టుదల, కార్యదక్షత కలిగిన నర్రా సిపిఎంలో అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సర్పంచ్ మొదలుకుని శాసన సభసభ్యుని వరకు అనేక పర్యాయాలు గెలుపొంది ప్రజల వాణిని చట్ట సభల్లో వినిపించారు. ప్రజా ఉద్యమ నిర్మాతగా, ప్రజా ప్రతినిధిగా,పాలక వర్గాలకు జంకు పుట్టించారు. శాసనాల రూపకల్పన, వాటి అమలులో జరుగుతోన్న తప్పిదాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వ ప్రతినిధులకు, అధికారు లకు దిశా దశ నిర్దేశించిన సందర్భాలనేకం ఉన్నాయి. నర్రా రాఘవరెడ్డి యాభై ఏళ్ల ప్రజా జీవితంలో ప్రజలకు బహుముఖ సేవల్ని అందించారు. 1950 నుంచి సిపిఐ పార్టీ సభ్యునిగా కార్యకర్తగా, కళాకారుడుగా సువరిచితుడే. అంతరంగిక సమస్యలతో పాటు సైద్ధాంతిక విభేదాలతో కమ్యూనిస్టు పార్టీ చీలిన తర్వాత సిపిఎం విధానాలను ముందుకు తీసుకు పోవాలని నర్రా పార్టీలో క్రియా శీలకంగా పనిచేశారు. మళ్లీ 1968లో మొదలైన ఉగ్రవాద చీలికను సైతం ఎదుర్కోవడంలో నర్రా ఎంతో కృషి చేశారు. ఉగ్రవాదం వైపు వెళ్లిన కార్యకర్తల్ని మళ్లీ పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రభావంతోనే 1972లో పార్టీ ఓటమి పాలైనా నిరాశకు గురికాలేదు. 1973లో బీబీనగర్–నడికుడి రైలు మార్గం విస్తరణకు కృషి చేశారు. ఎమర్జెన్సీ తర్వాత ఎమ్మెల్యేగా 1977లో గెలుపొందిన నర్రా శాసన సభలో ప్రజల, పార్టీ వాణిని వినిపించారు. సిపిఎం శాసన సభా పక్ష నేతగా, ఉప నేతగా పలు పర్యాయాలు పనిచేశారు. టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరుపై అనేక విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్ర అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రాజెక్టుల, పథకాల రూపకల్పనలో ప్రభుత్వానికి నర్రా పలు సలహాలు, సూచనలు చేసి ప్రజా సంక్షేమానికి పాటుబడ్డారు. పార్టీ నిర్మాణంలో కృషి చేస్తునే శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సాధన కోసం అనేక పోరాటాలు చేశారు. ప్రజా ప్రతినిధిగా పార్టీ నాయకునిగా పనిచేయడంతో పాటు ప్రజా సంఘాల నిర్మాణానికి పాటు పట్టారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా నర్రా ఎన్నికై ఎక్సైజ్ విధానానికి, కాంట్రాక్టు పద్ధతికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి గుర్తింపు తెచ్చారు. గ్రామ సేవకుల సంఘాన్ని జిల్లాలో ఏర్పాటు చేసి రాష్ట్ర ఉద్యమంగా తీర్చిదిద్దడంలో నర్రా పాత్ర ఎంతో ఉంది. చేనేత కార్మికులసమస్యలపై కూడా అనేక పోరాటాలు సాగాయి. వాటికి నర్రా నాయకత్వం వహించి సంఘాన్ని గుర్తింపులోకి తీసుకొ చ్చేందుకు కృషి చేశారు. పార్టీ జిల్లా, నకిరేకల్ కార్యాలయాల నిర్మాణా నికి కృషి చేశారు. గొల్లసుద్దుల – పిట్టల దొర ఇలా అనేక కళారూపాలు ప్రదర్శించి ప్రజల ఆదరణ పొందారు. సులభతరమైన సామెతలు– పొడుపు కథలు చెప్పి ప్రజల్ని అలరింప జేసేవారు. అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స పొందుతూ ఏప్రిల్ 9, 2015 న మృతి చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలంగాణ ధీరుడు ఆలె నరేంద్ర

## – ఏప్రిల్ 9...ఆలె నరేంద్ర వర్ధంతి




తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దశాబ్దాలుగా సాగిన ఉద్యమంలో, ఎన్నో గొంతులు ఆవిరై పోయాయి. కొన్ని మాత్రం ప్రజల గుండెల్లో నిలిచి పోయాయి. అలాంటి మహాను భావుల్లో ప్రముఖ నాయకుడు ఆలె నరేంద్ర ఒకరు. రాజకీయాలు ఆయనకు ఒక అధికార మార్గంగా కాకుండా, ఉద్యమ సాధనగా ఉండేవి. తెలంగాణ సాధనకు తన జీవితాన్ని అంకిత మిచ్చిన ఆయన, నిజంగా "తెలంగాణ యోధుడు" అనే బిరుదుకు అర్హులు. ఆలె నరేంద్ర 1946 ఆగస్టు 21న జన్మించారు. నాంపల్లి పరిసరాల్లో పుట్టి పెరిగిన ఆయన విద్యాభ్యాసం పూర్తి చేసి, చిన్ననాటి నుండే దేశ రాజకీయాలపై ఆసక్తితో ఎదిగారు. విద్యార్థి దశ నుండే ఆయన్ని ఆకర్షించిన భావజాలం – ప్రజల కోసం పనిచేయాలనే తపన. ఆయనను అభిమానులు ముద్దుగా 'టైగర్' నరేంద్ర అని పిలుచుకునేవారు. స్వాభిమానాన్ని కలిగించే నేతగా ఎదగాలన్న కల ఆయనను రాజకీయాల్లోకి నడిపించింది. పద్మశాలి కుటుంబంలోపుష్పవతి, రామలింగం దంపతులకు జన్మించారు. తమ్ముడు ఆలె శ్యామ్ కూడా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో ప్రచారక్‌గా ఉన్నారు. ఆలె నరేంద్ర భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆయన 1983, 1988, 1992లో హిమాయత్ నగర్ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజల మనిషిగా ఆయనకు మంచి గుర్తింపు ఉండేది. 1999 మరియు 2004లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుండి రెండుసార్లు పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ నగరం స్థూలంగా మజ్లిస్ పార్టీ ఆధిపత్యంలో ఉండగా, బీజేపీ అభ్యర్థిగా ఆయన విజయం సాధించడం ఒక చారిత్రక ఘట్టంగా మారింది. ఆయన నియోజకవర్గంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. బీజేపీ కేంద్రంగా పనిచేసినా, ఆలె నరేంద్ర ఎప్పుడూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేశారు. అయితే పార్టీ ఆ దిశగా స్పష్టమైన ప్రకటన ఇవ్వక పోవడం ఆయనలో అసంతృప్తి కలిగించింది. రాజకీయ లబ్ధి కన్నా ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని నమ్మిన ఆయన, 2004లో బీజేపీకి రాజీనామా చేసి "తెలంగాణ సాధన సమితి" అనే కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ఇది ఆ సమయంలో పెద్ద సంచలనమే. ఆయన నిర్ణయం చాలామందికి స్ఫూర్తిదాయకంగా మారింది. రాజకీయ భవిష్యత్తుపై శ్రద్ధ చూపకుండా, తాను నమ్మిన ఉద్యమం కోసం రాజకీయంగా మలుపు తిరగడం అన్నదే ఆయన ధైర్యాన్ని, అంకితాన్ని సూచిస్తుంది. ఆలె నరేంద్ర రాజకీయ వ్యవహార శైలి స్పష్టత, నిజాయితీ, మరియు ప్రజల పట్ల ఉన్న ప్రామాణికతకు పరిమితమై ఉండేది. ఆయన సభలు, మాట్లాడే తీరు, మాట్లాడే అంశాలు యువతలో చైతన్యం కలిగించేవి. తెలంగాణ యాసలో మాట్లాడి, ఉద్యమాన్ని ప్రజల మనసులోకి తీసుకెళ్ళారు. ఉద్యమంలో ఆయనకు ఉన్న స్థానం ఎంతో ప్రత్యేకం. 2006లో ఆలె నరేంద్ర తీవ్రమైన అనారోగ్యంతో హఠాత్తుగా మృతిచెందారు. ఆయన మరణం తెలంగాణ ఉద్యమానికి, ముఖ్యంగా ఉద్యమంలో ఉన్న స్ఫూర్తికి పెద్ద నష్టంగా పరిగణించ బడింది. ఉద్యమ దశలో తన వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రజల కోసమే బలంగా పోరాడిన ఆయన లాంటి నేతల మరణం ఉద్యమాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆయన పేరు మళ్ళీ మళ్లీ ప్రస్తావించ బడుతోంది. ఆయన తీసుకున్న నిర్ణయాలు, ప్రజల పక్షంగా నిలబడిన ధైర్యం, పార్టీ వ్యతిరేకంగానైనా ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన తత్వం నేటి రాజకీయ నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఒక అధికార స్థానం కోసం కాకుండా, ఒక ప్రజా రాష్ట్రం కోసం జీవించిన నేతగా చరిత్రలో ఆలె నరేంద్ర గారు నిలిచి పోతారు. ఆలె నరేంద్ర ఒక నేత మాత్రమే కాదు %–% ఒక ఉద్యమ స్వరూపం. తెలంగాణ కోసం తపించిన మనిషి. తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలవడం ఖాయం. ఆయన చూపిన మార్గం, పోరాట పంథా యువతకు స్ఫూర్తి. తెలంగాణ మనుగడకు పునాదులు వేసిన నేతలలో ఆయన పాత్ర కూడా చిరకాలం గుర్తుండి పోతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494.**

# ట్విస్టు: మేరఠ్ మర్డర్ కేసులో జైల్లో ఉన్న ముస్కాన్ ప్రెగ్నెంట్



దేశ వ్యాప్తంగా సంచలనంగా మారిన మర్చంట్ నేవీ అధికారి మర్డర్ కేసు మరో మలుపు తిరిగింది. ప్రేమించి పెళ్లాడిన భర్తను.. ప్రియుడి కోసం అత్యంత దారుణంగా హతమార్చిన వైనం షాకింగ్ గానే కాదు.. సరికొత్త ఆందోళనకు గురి చేసేలా చేసింది. మర్చంట్ నేవీ అధికారిగా ఉన్న భర్త సౌరభ్ రాజ్ ఫుత్ ను మాటల్లో చెప్పలేనంత దారుణంగా హతమార్చిన వైనం తెలిసిందే. ప్రస్తుతం జైల్లో ఉన్న ఆమె.. గర్భవతిగా అధికారులు గుర్తించారు. దీంతో.. ఇప్పుడేం చేయాలన్న దానిపై జైల్ మాన్యువల్స్ ను చెక్ చేస్తున్నారు. అంతేకాదు.. ముస్కాన్ కు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతూ జైలు అధికారులు ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ఇటీవల ప్రెగ్నెన్సీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించగా.. పాజిటివ్ గా తేలినట్లుగా డాక్టర్లు వెల్లడించిన విషయాన్ని సదరు లేఖలో పేర్కొన్నారు. 29 ఏళ్ల సౌరభ్ రాజ్ పుత్.. 27 ఏళ్ల ముస్కాన్ రస్తోగీ 2016లో లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. సౌరభ్ మర్చంట్ నేవీలో అధికారిగా వ్యవహరించేవారు. వారికి 2019లో కుమార్తె జన్మించింది. ఆ తరవాత పాతికేళ్ల సాహిల్ తో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. భార్యకు మర్చంట్ నేవీ అధికారిగా పని చేయటం ఇష్టం లేదని తెలియటంతో జాబ్ మానేశారు. అయినప్పటికి ఆమె తీరులో మార్పు రాకపోవటం.. ఆమెక సాహిల్ తో ఉన్న రిలేషన్ నుంచి బయటకు రాలేదు. ఈ క్రమంలో సౌరభ్ లండన్ కు వెళ్లిపోయి.. అక్కడే జాబ్ చేస్తున్నాడు. ఇదిలా ఉండగా..కుమార్తె పుట్టిన రోజు కోసం భారత్ కు వచ్చాడు. అతను ఇంటికి రావటం నచ్చని ముస్కాన్.. ప్రియుడి సాయంతో సౌరభ్ ను 15 ముక్కలుగా నరికేసి.. శరీర భాగాల్ని ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో ఉంచేసి.. దానిపై సిమెంట్ తో కప్పి పెట్టారు. పక్కాగా ప్లానింగ్ తో చేసిన ఈ దారుణం సౌరభ్ కుటుంబ సభ్యులు పోలీసులకు చేసిన కంప్లైంట్ కారణంగా.. ఈ మొత్తం మర్డర్ వ్యవహారం వెలుగు చూసింది. అంతేకాదు.. భర్తను దారుణంగా హత్య చేసిన తర్వాత.. అతడి దగ్గర ఉన్న డబ్బులతో సాహిల్ చేత బెట్టింగులు ఆడించి.. ఆ డబ్బులతో విహార యాత్రలకు వెళ్లినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో వారిద్దరిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ ఉదంతం ఉత్తరప్రదేశ్ తో పాటు దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. నిందితుల్ని జైలుకు తరలించిన తర్వాత.. వీరి వ్యవహారశైలి వార్తల్లోకి వచ్చింది. దీనికి కారణం.. జైల్లో పెట్టిన ఆహారాన్ని తినకుండా డ్రగ్స్ కావాలని గొడవ చేస్తున్నట్లుగా పోలీసులు వెల్లడించారు. ఇలాంటి వేళ ముస్కాన్ గర్భం దాల్చిన వైనంతో ఇప్పుడేం జరుగుతుందన్నది ప్రశ్నగా మారింది.

# కోహినూర్ వజ్రం నిజమైన యజమాని ఎవరు?

కోహినూర్ వజ్రం.. ప్రపంచానికి పరిచయం చేయాల్సిన పని లేని అరుదైన రత్నం. దీని విలువ 20 బిలియన్ డాలర్లు. భారతీయ కరెన్సీలో 1.7 లక్షల కోట్లు. అయితే ఇంతటి విలువైన రత్నాన్ని కొట్టేసింది ఎవరు? అసలు ఈ వజ్రానికి నిజమైన యజమాని ఎవరు? అన్నది ఎప్పుడూ చర్చగానే ఉంది. ప్రపంచంలోని అత్యంత అమూల్యమైన రత్నాలలో ఒకటైన కోహినూర్ వజ్రం శతాబ్దాలుగా గొప్ప చరిత్రను కలిగి ఉంది. ఈ వజ్రం చాలామంది పాలకుల చేతులు మారింది. ఎన్నో సామ్రాజ్యాల చరిత్రను చూసింది. దాని ప్రకాశం చరిత్ర అంతటా ప్రజలను నిరంతరం ఆకర్షిస్తూనే ఉంది. అయితే ఈ వజ్రాన్ని మొట్టమొదట కనిపెట్టింది ఆంధ్రప్రదేశ్‌లో. సుమారు 800 సంవత్సరాల క్రితం కోహినూర్ వజ్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని గోల్కొండ గనుల నుండి తవ్వారు. ఆ సమయంలో అప్పటివరకు కనుగొన్న అతిపెద్ద వజ్రం ఇదే. దీని బరువు సుమారు 186 క్యారెట్లు. ఈ విలువైన రత్నాన్ని కనిపెట్టింది కాకతీయుల జమానాలో కాబట్టి. కాకతీయ రాజవంశం పాలకులే యజమానులు అయ్యారు. వారు



దానిని తమ దేవత భద్రకాళి విగ్రహం ఎడమ కంటిలో ఉంచారు. 14వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తాన్ అలావుద్దీన్ ఖిల్జీ కాకతీయ సామ్రాజ్యంపై దండెత్తి కోహినూర్ వజ్రాన్ని స్వాధీనం చేసుకున్నాడు. సంవత్సరాలుగా ఇది మొఘల్ చక్రవర్తి బాబర్‌ను చేరుకోవడానికి ముందు చాలామంది రాజులు, పాలకుల మధ్య చేతులు మారింది. 1739లో పర్షియన్ పాలకుడు నాదిర్ షా మొఘల్ చక్రవర్తి ముహమ్మద్ షాను ఓడించి, ఢిల్లీని స్వాధీనం చేసుకుని, కోహినూర్ వజ్రాన్ని తనతో తీసుకెళ్లాడు. కోహినూర్ వజ్రం చివరికి పంజాబ్ మహారాజా రంజిత్ సింగ్ ఖజానాలోకి ప్రవేశించింది. అయితే 1849లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పంజాబ్‌ను తన ఆధీనంలోకి తీసుకున్న తర్వాత, ఆ వజ్రాన్ని బ్రిటన్ రాణి విక్టోరియాకు సమర్పించారు. నేడు కోహినూర్ వజ్రం బ్రిటిష్ రాజ కిరీటంలో భాగం. లండన్ టవర్‌లో ఉంచారు. గోల్కొండ నుంచి లండన్ టవర్ వరకూ ప్రయాణించిన ఈ ఒక్క వజ్రం విలువ లక్ష కోట్లు పై మాటే. ఇది నిజంగా వేల ఎపిసోడ్ల సిరీస్ కి, ఫ్రాంఛైజీ సినిమా కథలకు ఎంతమాత్రం తీసిపోని చరిత్రను కలిగి ఉంది. కేవలం కోహినూర్ కథతో పాన్ ఇండియన్ సినిమాలు తీస్తే లక్షల కోట్లు ఖజానాకు జమ అయ్యి ఉండేవేమో!

# 19 ఏళ్ల యువతిపై 23 మంది 6 రోజుల అత్యాచార కాండ.. మోడీ ఇలాకాలో

దారుణ ఉదంతం ఒకటి వెలుగు చూసింది. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో ఈ అరాచక అత్యాచార కాండ చోటు చేసుకుంది. 19 ఏళ్ల యువతిపై 23 మంది కీచకులు ఆరు రోజుల పాటు సాగించిన దారుణం గురించి తెలిస్తే రక్తం మరిగిపోవాల్సిందే. ఆమెకు మత్తు మందు ఇచ్చి.. పలు హోటళ్లు తిప్పుతూ అఘాయిత్యానికి పాల్పడ్డారు. సంచలనంగా మారిన ఈ ఉదంతంలోకి వెళితే.. మార్చి 29న బాధితురాలు తన స్నేహితుల ఇంటికి వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో రాజ్ విశ్వకర్మ అనే యువకుడ్ని కలిసింది. అతను తన కేఫ్ కు తీసుకెళ్లాడు. ఆమెపై అక్కడ అత్యాచారం జరిగింది. విశ్వకర్మ.. రాజ్.. అతడి స్నేహితుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాతి రోజు ఆ యువతిని సమీర్ అనే వ్యక్తి కలిశాడు. తన స్నేహితులతో కలిసి ఆమెను బైక్ మీద కూర్చొబెట్టుకొని నేషనల్ హైవే మీదకు తీసుకెళ్లి.. అక్కడ అత్యాచారం చేసి.. నదేసర్ ప్రాంతంలో వదిలి వెళ్లాడు. మార్చి 31న ఆయుష్ అనే యువకుడు తన ఐదుగురు స్నేహితులతో కలిసి సిగ్రాలోని కాంటినెంటల్ కేఫ్ కు ఆమెను తసుకెళ్లి.. వారంతా అత్యాచారానికి పాల్పడ్డారు. మత్తు మందు ఇచ్చి,. ఈ దారుణానికి ఒడికట్టారు. ఈ నెల ఒకటిన తన స్నేహితుడితో కలిసి సాజిద్ అనే



నిందితుడు ఆమెను హోటల్ కు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరు.. ముగ్గురు కలిసి ఆమెను అత్యాచారం చేశారు. అందులో ఒకడు ఆమెను బయటకు పంపేశాడు. అక్కడి నుంచి బయలుదేరిన ఆమె ఇమ్రాన్ అనే యువకుడ్ని కలవటం.. అతనూ ఆమెను హోటల్ కు తీసుకెళ్లి మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. రెండో తేదీన రాజ్ ఖాన్ అనే నిందితుడు ఆమెను హుకుల్ గంజ్ లోని తనకు ఇంటికి తీసుకెళ్లాడు. మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేయబోగా.. గట్టిగా కేకలు వేసింది.

దీంతో ఆమెను అక్కడి నుంచి స్నేహితులతో కలిసి అస్సీ ఘాట్ కు తీసుకెళ్లాడు. అక్కడ మత్తు మందు ఇచ్చారు. మూడో తేదీన డానిష్ అనే నిందితుడు ఆమెను తన స్నేహితుడి గదికి తీసుకెళ్లి.. సోహైల్.. షోయబ్ తో కలిసి అత్యాచారానికి పాల్పడ్డారు. తమ కుమార్తె కనిపించటం లేదని బాధితరాలు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆమెను కనిపెట్టేలోపు.. ఈ నెల నాలుగున ఆమె ఇంటికి చేరుకుంది. కాస్త తేరుకున్న తర్వాత తనపై జరిగిన సామూహిక అత్యాచార కాండ గురించి చెప్పటంతో.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఈ ఉదంతం వెలుగు చూసింది.


చురకలు

## సంపాదకీయం

## మోడీతో స్టాలిన్ : స్ట్రాటజీ కరెక్టేనా?

రాజకీయం వేరు. రాజ్యాంగబద్ధ విధానం వేరు. రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసి పదవులు తీసుకున్న వారు రాజ్యాంగం ప్రకారమే వ్యవహరించాలి. అయితే దురదృష్టవశాత్తు జరుగుతున్నది వేరేగా ఉంది. చివరికి ఇదొక దుస్సాంప్రదాయంగా మారుతోందా అన్న చర్చ సాగుతోంది. దేశానికి ప్రధాని అయినా రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు అయిన్నా మనకు ఉన్న పార్టీల విధానం బట్టి వాటి ద్వారానే ఎన్నిక అవుతారు. అయితే వారిని దేశానికి రాష్ట్రాలకు ప్రతినిధులుగా చూస్తారు తప్ప పార్టీల పరంగా కాదు. గతంలో దేశంలో అలాగే జరిగేది. అయితే గడచిన కొంతకాలంగా మాత్రమే ఈ విషయంలో మార్పు వస్తోంది. దేశానికి ప్రధానిగా ఉన్న వారు తమ సొంత రాష్ట్రానికి వస్తే వారిని కలసి స్వాగతించడం, వేదికలు పంచుకోవడం, రాష్ట్ర సమస్యలు వీలైతే చర్చించడం ఇదంతా ఒక అనవాయితీగా వస్తోంది. కేంద్రంలో ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ ప్రధానులుగా ఉండేటప్పుడు ఉమ్మడి ఏపీకి ఎన్టీఆర్ సీఎం గా వ్యవహరించేవారు. అయితే ఏపీకి వారు వచ్చినపుడు సీఎం హెూదాలో ఆయన పక్కనే ఉంటూ వారికి వెల్ కం చెప్పేవారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. రాజకీయంగా చూస్తే టీడీపీ వర్సెస్ కాంగ్రెస్ అని ఉన్నా కూడా అధికారిక కార్యక్రమాలలో దానిని ఎక్కడా రానిచ్చేవారు కాదు. కానీ ఇపుడు ఆ స్ఫూర్తి అయితే కనిపించడం లేదు అన్నదే చర్చగా ఉంది. నిన్నటికి నిన్న తమిళనాడుకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చారు. అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రామేశ్వరంలో సభ జరిగింది. అయితే తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అయితే ఎక్కడా కనిపించలేదు. ఆయన ప్రధానితో కలసి వేదిక పంచుకోకూడదు అని భావించారో ఏమో తెలియదు కానీ గైర్ హాజరు అయ్యారు. ఇక వేదిక మీద నుంచి ప్రధాని ఇండైరెక్ట్ గా స్టాలిన్ మీద సెటైర్లు వేశారు. కొందరు ఎపుడూ ఏడుస్తూనే ఉంటారని విమర్శించారు. తమిళనాడుకు తాము ఎంతో చేశామని చెప్పుకున్నారు. గతంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వాల కంటే అధికంగా నిధులు ఇచ్చామని లెక్కలు చూపించారు. ఇలా ప్రధాని మోడీ స్టాలిన్ ని విమర్శిస్తూ తాము చేసిన పనులు చెప్పుకున్నారు. అదే వేదిక మీద స్టాలిన్ ఉంటే కనుక తమిళనాడుకు కేంద్రం ఏమి ఇవ్వలేదో చెప్పి ఉండేవారు కదా. లేదా ఫలానా సమస్యలు ఉన్నాయి పెండింగులో పెట్టారు, వాటిని క్లియర్ చేయండి అని ప్రజల తరఫున అడిగే వీలు ఉండేది కదా. వేదిక అధికారికం అయినపుడు బీజేపీ ప్రధాని అని రాజకీయ కోణంలో నుంచి చూసి గైర్ హాజర్ కావడం ద్వారా స్టాలిన్ చేసినది కరెక్టేనా అన్న చర్చ వస్తోంది. ఈ దేశంలో ఏది జరిగినా రాజ్యాంగబద్ధంగా జరగాలి. కేంద్రం పెద్దన్నగా ఉంటోంది. రాష్ట్రాలకు నిధులు కావాల్సి వస్తే కేంద్రాన్నే అడగాలి. మరి ఆ కేంద్ర అధినాయకత్వం మీద ఎందుకు వ్యతిరేకత అన్న చర్చ వస్తోంది. పైగా రాజ్యాంగబద్ధంగా హక్కులు ఉంటాయి. వాటిని డిమాండ్ చేసి సాధించుకోవాలి. కేవలం వేరే పార్టీ అని ముఖం చూపించకుండా ఉండడం వల్ల ఒరిగేది ఏమిటి అన్న చర్చ అయితే ఉంది. గతంలో కేసీఆర్ కూడా మోడీ వస్తే స్వాగతం పలికేవారు కాదు, వేదిక పంచుకునేవారు కాదు, చివరికి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడింది అని బీజేపీ నేతలు గుర్తు చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కూడా మోడీతో వేదిక పంచుకోరని చెబుతారు. ఈ విధంగా చేయడం రాజకీయ వ్యూహమైతే కావచ్చు. కానీ దాని ఫలితాలు చేదుగానే ఉంటున్నాయని తెలిసి కూడా అదే స్ట్రాటజీ అమలు చేస్తున్నారు అని అంటున్నారు. తమ రాష్ట్రానికి వస్తే కలవని ముఖ్యమంత్రులు తిరిగి అదే ప్రధాని అపాయింట్మెంట్ కోరుతారు. మరి అపుడు రాజ్యాంగబద్ధమైనది ఇపుడు ఎందుకు కాదు అన్నది కూడా మరో ప్రశ్నగా ఉంది. రాజకీయాలు పక్కన పెట్టి కేంద్రం రాష్ట్రాలు పనిచేయాలి. అలాంటి సామరస్యం అటూ ఇటూ కూడా కోరుకోవాలి. తమిళనాడులో ప్రధాని టూర్ లో స్టాలిన్ కనిపించకపోవడం రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. చూడాలి మరి దీని ఫలితాలు ఏలా ఉంటాయో.

## అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు చండ్ర రాజేశ్వరరావు - ఏప్రిల్ 9... చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి



నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఏళ్ళతరబడి ఉద్యమాల్లో, అజ్ఞాత వాసంలో గడిపిన అలుపెరుగని కమ్యూనిస్టు నిస్వార్థ పోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీకి ఆరున్నర దశాబ్దాల పాటు వివిధ హెూదాల్లో సేవలందించిన నిబద్ధత కలిగిన మహా నేత రాజేశ్వరరావు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం నేతృత్వం వహించిన రాజేశ్వరరావు జీవితం సైద్ధాంతిక నిబద్ధతకు, నిజాయితీకీ నిలువుటద్దం. చండ్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం అగ్రనాయకుల్లో ఒకరు. పేరుకు తగినట్టుగానే ప్రత్యర్థులపై చండ్ర ప్రచండత్వం ప్రదర్శించేవారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులతో మమేకమైన కమ్యూనిస్టు ఆయన. ఎంతటి వారితో నైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించేవారు. నెహ్రూ, ఇందిరాగాంధీలు తీసుకున్న నిర్ణయాల్లో ప్రజోపయోకరాలను సమర్థించినా, నిరంకుశ చర్యలను వ్యతిరేకించిన నిష్పక్షపాతి ఆయన. పీడిత, తాడిత జనోద్ధరణ కోసం ఎంతో ఉజ్వలమైన భవిష్యత్‌ను వదులు కుని కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన పేదల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, తదితర పార్టీ అగ్రనాయకులతో కలిసి, దశాబ్దాల పాటు రాష్ట్రంలోనే కాక, దేశంలోని పలు ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని మంగళాపురం గ్రామంలో 1914 జూన్ ఆరవ తేదీన పెద్ద భూస్వాముల కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరువాత ఆ భూస్వాములకు వ్యతిరేకంగా, భూమి లేని నిరుపేదల తరఫున దశాబ్దాలపాటు పోరాటం జరిపారు. రాజేశ్వరరావు ప్రాథమిక విద్యాభ్యాసం మంగళాపురంలో, సెకండరీ విద్య చల్లపల్లిలోనూ సాగింది. బందరు హిందూ స్కూలులో ఎస్సెస్సెల్సీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే రాజేశ్వరరావు క్రీడాకారునిగా, పేదల పాలిట ఆత్మీయునిగా పేరొందారు. మహాత్మా గాంధీ పిలుపుపై సాగిన ఉప్పు సత్యాగ్రహంలో వలంటీర్‌గా పని చేశారు. యుక్తవయసులోనే విప్లవ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్మాగాంధీ ఉద్యమాల్లో పనిచేస్తున్నా, విప్లవ కిశోరాలైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వంటివారి పట్ల ఆరాధనా భావాన్ని పెంచుకున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన హిందూ, ముస్లిం ఐక్యత కోసం ఎంతోకృషి చేశారు. కమ్యూనిస్టు నాయకులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్ర కేసులో ఇరికించి జైళ్ళలో పెట్టినప్పుడు వారు విడుదల చేసిన ప్రకటన రాజేశ్వరావును ఉత్తేజపర్చింది. వామపక్ష భావాలున్న విద్యార్థులందరినీ ఐక్యపర్చి సాటి విద్యార్థులతో కలిసి ఒక స్టడీ సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. తరువాత అది 'యంగ్ కమ్యూనిస్టు లీగ్'గా అవతరించింది. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే మతవాద, మితవాద వర్గాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి రాజేశ్వరరావు. తరచుగా ఘర్షణలకు దిగడం, కమ్యూనిస్టు వర్గానికి నాయకత్వం వహించడంతో బిఎస్సీ పూర్తి కాకముందే ఆయన యూనివర్శిటీ నుంచి టీసీ తీసుకుని బయటికి వచ్చారు. బెనారస్‌లో ఉండగానే ఆయన లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యా సందర్శించి వచ్చిన తరువాత సోషలిజం, స్వాతంత్ర్య పోరాటంలో కార్మిక, కర్షక పాత్ర, వర్గ సంఘాలు, వర్గ పోరాటాల పేరిట రాసిన వ్యాసాలు రాజేశ్వరరావును విశేషంగా ఆకర్షించాయి.అదే సందర్భంలో ఆయన మహాత్మా గాంధీని కలిసిన విద్యార్థి బృందంలో ఉన్నారు. తరువాత ఆయన విశాఖలో మెడిసిన్‌లో చేరినా, ఆయన కమ్యూనిస్టు భావాల ప్రచారానికి నిడమర్తి ఉమారాజేశ్వరరావు ప్రభృతులతో కలిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం వల్ల ఆయన చదువు బెనారస్‌లోనూ, విశాఖలోనూ సవ్యంగా సాగలేదు. తండ్రి అభిమతానికి వ్యతిరేకంగా ఆయన సావిత్రమ్మతో వివాహాన్ని అతి నిరాడంబరంగా దండల మార్పుతో చేసుకున్నారు. వారి వివాహానికి ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య పెళ్ళిపెద్దగా వ్యవహించారు. సావిత్రమ్మ కూడా భర్త మార్గంలోనే కమ్యూనిస్టు ఉద్యమం ప్రచారం కోసం జీవితాంతం కృషిచేశారు. వివాహానికి గుర్తుగా మెడలో వేసుకున్న గొలుసు రాయిని తీయించి ఎర్ర నక్షత్రాన్ని వేసుకోవడం ఆమె నిబద్ధతకు నిదర్శనం. పార్టీ నిర్ణయం మేరకు పూర్తి కాల కార్యకర్తగా పనిచేయడం కోసం ఆమె శాంతినికేతన్‌లో చదువు కోవాలనే ఆకాంక్షను బలవంతంగా అణగ దొక్కుకున్నారు. కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ విస్తరణకు రాజేశ్వరరావు దంపతులు విశేషంగా కృషిచేశారు. కార్మిక, కర్షక సంఘాలను ఏర్పాటు చేసి, మంగళాపురం కూలీల పోరాటానికి, చల్లపల్లి జమిందారు అక్రమాలపై ఉద్యమానికి నేతృత్వం వహించారు. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలో నైజాం సరిహద్దున ఉన్న తునికిపాడుకు వచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రభృతులు నైజాంలో పరిస్థితి గురించి వివరించారు. ఆ క్రమంలోనే రాజేశ్వరరావుకు... ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనరసయ్య ప్రభృతులు కూడా రావడంతో వారందరితో రాజేశ్వరరావుకు పరిచయాలు ఏర్పడ్డాయి. క్రమంగా తెలంగాణాలో అనేకసార్లు పర్యటించి తెలంగాణలో పార్టీ నిర్మాణానికీ, భువనగిరి ఆంధ్ర మహాసభ నిర్వహణకు తోడ్పడ్డారు. తెలంగాణా కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులను సమన్వయ పర్చడంలో,సాయుధ పోరాటంలో కీలకపాత్ర వహించారు. భారత విప్లవోద్యమం గురించి స్టాలిన్‌తో చర్చించేందుకు అజయ్ ఘోష్, ఎస్ఏ డాంగే, బసవ పున్నయ్యలతో పాటు రాజేశ్వరరావు మాస్కో వెళ్ళారు. రాజేశ్వరరావు ఎంత పెద్ద నాయకుడైనా ఏమాత్రం అభిజాత్యాన్ని ప్రదర్శించకుండా, నిరంతరం ఏదో తెలుసు కోవాలనే తపనతో ఉండేవారు. పుచ్చలపల్లి సుందరయ్య పట్ల ఎంతో గౌరవం ఉన్నా, అవిభక్త కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు ఆయన భారత కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించారు. రాజేశ్వరరావు సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడలేదు. ఇందిర ప్రభుత్వం తీసుకున్న ప్రగతి శీల చర్యలకు మద్దతు ఇస్తూనే, ఆమె నిరంకుశ పోకడలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. 1970వ దశకంలో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో సాగిన భూ ఆక్రమణ ఉద్యమం పార్టీ ప్రతిష్ఠను పెంచి, అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ ఉద్యమం విజయవంతం కావడంలో రాజేశ్వరరావు పాత్ర గణనీయం. ఆయన పిత్రార్జిత ఆస్తిలో తన వాటాను పూర్తిగా పార్టీకోసం వెచ్చించారు. పార్టీకి ఆయన విరాళంగా ఇచ్చిన లక్షలాది రూపాయిలతో ఆరోజుల్లో వందలాది ఎకరాలను కొనగలిగి ఉండేవారనేది వాస్తవం. ఆయన ఢిల్లీ వెళ్ళినా,ఎక్కడికి వెళ్ళినా పార్టీ కార్యాలయాల్లోనే బస చేయడం, తన బట్టలను తానే ఉతు క్కోవడం నిరాడంబర జీవితంతానికి ప్రబల నిదర్శనాలు. అక్టోబర్ విప్లవం 60వ వార్షికోత్సవాల సందర్భంగా భటిండాలో జరిగిన పార్టీ మహాసభలో ఆమోదించిన తీర్మానం చరిత్రాత్మకమైనది. రాజేశ్వరరావు సోవియట్ యూనియన్‌లో గోర్బాచెవ్ ప్రవేశపెట్టిన సహకార వ్యవసాయం, కాంట్రాక్ట్ సేద్య విధానాలను రాజేశ్వరరావు సమర్థించారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత సంభవించిన పరిణామాల పట్ల ఆయన చివరి రోజుల్లో ఎంతో కలత చెందారు. ప్రపంచంలో ఎక్కడ ప్రగతి శీల పోరాటాలు జరిగినా వాటికి ఆయన మద్దతు ప్రకటించేవారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అనేక సమస్యలపై ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నప్పటికీ, సిపిఎం వ్యతిరేక ధోరణి వల్ల ఉభయ కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణ ప్రక్రియ ఆలస్యమవుతోందని ఆవేదన చెందేవారు. ఆయన ఎన్నో పురస్కారాలను పొందినా,1994 లో పొందిన సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్ పురస్కారం అత్యంత ప్రతిష్ఠాకరమైనది. సుదీర్ఘకాలం పార్టీకోసం అహర్నిశలు కృషిచేసిన రాజేశ్వరరావు 80వ ఏట 1994 ఏప్రిల్ 9వ తేదీన హైదరాబాద్‌లో కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## అలనాటి మేటి గాయకులు ఏ. ఎం.రాజా - ఏప్రిల్ 9... ఏ.యం.రాజా వర్ధంతి



ఏ.ఎం.రాజా పేరు ఈ తరానికి అంతగా తెలియక పోవచ్చు. ఒకనాడు దక్షిణ భారత సినీ నేపథ్య గాయకుడుగా, అలనాటి కథానాయకులకు అందరికి తన మధురమైన గొంతును అందిం చారు. కేవలం పాటలతో సినిమాల విజయవంతానికి చేయూత అందించారు. హిందీలో మొట్ట మొదట ప్లేబాక్ పాడిన దక్షిణ దేశ గాయకుడైన ఘనత ఎ.ఎం. రాజాదే. బహుత్ దిన్ హుయె (1952)లో పాడారు. తమిళ, తెలుగు సినిమా రంగాలలో విశిష్టమైన నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు, నటుడు, ఏ.యం.రాజా 1950వ దశకంలో తమిళ, తెలుగు సినిమా రంగాలలో విశిష్టమైన నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు, నటులు. రాజా కంఠస్వరం ప్రత్యేకమైనది. ఎక్కడ వినబడినా గుర్తించడం కష్టం కాదు. కాని అనుకరించడం మాత్రం సులభం కాదు. రాజా గళంలో ఒక వినూత్నమయిన సౌకుమార్యం, మార్దవం, మాధు ర్యం ఉండేది. ఆ ప్రత్యేకత వల్లనే సినిమారంగంలో రాజా మెల్లమెల్ల గా పైకెదిగారు. ఆయన సంగీత దర్శకత్వంలో ప్రాధాన్యత మెలడీకే ఇచ్చే వారు. రాసిలో తక్కువైనా వాసిలో ఏమాత్రమూ తక్కువ కానివి రాజా పాటలు. ఏ. ఎం. రాజాగా సుప్రసిద్ధులైన ఏమల మన్మథరాజు రాజా 1929 సంవత్సరం జూలై 1వ తేదీన చిత్తూరు జిల్లాలోని రామచంద్ర పురంలో మన్మథరాజు - లక్ష్మమ్మ దంపతులకు పుట్టారు. పచ్చయప్ప కళాశాల నుండి 1951లో బీ. ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. కళాశాలలో చదివేటప్పుడే ఎన్నో పాటల పోటీలలో పాల్గొని బహుమతులను పొందారు. మాస్టర్ నటరాజన్ వద్ద సంగీతా భ్యాసం పొందారు. రాజా స్వంతగా రాసి స్వరపరచిన రెండు పాటలను హెచ్.ఎం.వీ రికార్డు చేశారు. ఈ పాటలు ఆకాశవాణి 1951లో తరచూ ప్రసారం చేసేది. ఆయన పాడిన మొదటి రికార్డు 'ఎంత దూర మీ పయనం'. ఈ పాటలను విన్న జెమినీ స్టూడియో అధినేత వాసన్ తాను తమిళంలో నిర్మిస్తున్న సంసారం చిత్రంలో రాజాను పాడమన్నారు. తమిళంలో సుసర్ల దక్షిణామూర్తి దర్శకత్వంలో సంసారం, సంసారం అనే పాట (తెలుగులో దీనిని ఘంటసాల పాడారు) రాజా పాడిన మొట్టమొదటి సినిమా పాట. తెలుగు లో ఆయన పాడిన మొదటి పాటలు 'ఆకలి' 'ఆదర్శం', 'సంక్రాంతి' (1952) చిత్రాలలోనివి. కానీ గాయకుడిగా గుర్తింపు పొందింది పక్కింటి అమ్మాయి (1953) సినిమాలో పాడిన పాటలతో. రాజా సరదాగా నటించి, పాడిన హాస్యరస చిత్రం పక్కింటి అమ్మాయి. చిత్రంలోని గీతాలు హాయి గొలిపే లలిత గాన మాధు ర్యానికి సంకేతాలుగా నిలిచా యి. అమర సందేశం గీతాలు కూడా రాజా శక్తిని నిరూపించాయి. శోభ, పెళ్ళి కానుక చిత్రాలకు, మరికొన్ని తమిళ చిత్రాలకు ఏ.యం.రాజా సంగీత దర్శకత్వం వహించారు. అన్ని భాషలలో పాడుతున్నా, తెలుగు తమిళ సినిమాలలోనే రాజా ఎక్కువగా పాడేవారు. ఆ సమయంలోనే ఎం. జీ. రామ చంద్రన్ నటించిన 'జెనోవా' చిత్ర నిర్మాణ సమయంలో పీ. జీ. కృష్ణవేణిని (జిక్కీ గా మనకు చిరపరిచితం ఆమె గాత్రం) చూడడం తటస్థించింది. ఇద్దరూ కలిసి సినిమాలలో యుగళ గీతాలు పాడేవారు. అలా ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆ ప్రేమ అలా పెరిగి పాటలలోనే కాకుండా జీవితంలో కూడా భాగస్వాములయ్యారు. రాజా సంగీత జీవితపు ఆరంభ దశలో అతనికి ఎక్కువ ఖ్యాతిని తెచ్చినవి మూడు చిత్రాలు %-% ప్రేమలేఖలు (1953), అమర సందేశం, విప్ర నారాయణ (1954). విప్రనారాయణ లోని చూడుమదే చెలియా' లాంటి, పాటలు ఇప్పటికీ ఏమాత్రం వన్నె తగ్గనివే. సుశీలతో పాడిన మిస్సమ్మ (1955) చిత్రంలోని బృందావనమది అందరిది గోవిందుడు అందరి వాడేలే ఒక మరపు రాని పాట. సంగీత ప్రధానమైన 'అమర సందేశం'లో ముఖ్యంగా చెప్పుకోవలసినవి ఆయన పాడిన రెండు సోలోలు: మధురం మధురం మనోహరం, ఆనతి కావలెనా గానానికి సమయము రావలెనా ఏనాటికీ మరిచి పోలేనివే..బంగారు పాప(1954), భాగ్యరేఖ(1957) చిత్రాలలో రాజా పాడిన పాటలు కూడా తీపి గుర్తులే. నేనూ ఒక మనిషినా (మేలు కొలుపు, 1956), అందాల రాణీ వీరకంకణం, 1957), తానేమి తలంచేనో (దాంపత్యం, 1957), ప్రభూ తొలిసంజ (సిపాయి కూతురు, 1959). ఇలా 1953–57 మధ్య కాలంలో రాజా నక్షత్రంలా ఒక వెలుగు వెలిగారు. ముఖ్యంగా ఒక రెండు సంవత్సరాల పాటు (1953 – 55) ఘంటసాల కంటే రాజా గాత్రానికే నిర్మాతలు, సంగీత దర్శకులు ప్రాధాన్యతనిచ్చారు. మద్రాస్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాజాను 1959లో అత్యుత్తమ సంగీత దర్శకునిగా గౌరవించింది. రాజా గాయకుడు దర్శకుడు మాత్రమే కాదు, ఒక నటుడు కూడా. పక్కింటి అమ్మాయి (1953) చిత్రంలో రాజా నటనను అందరూ మెచ్చుకొన్నారు. ఇందులో ఒక విచిత్రమేమంటే, ఇదే పాత్రను హిందీ చిత్రంలో (పడోసన్, 1968) గాయక దర్శకుడు కిశోర్ కుమార్ వేయగా, మళ్లీ తీసిన (1976) తెలుగు చిత్రంలో ఈనాటి గాయక దర్శకుడు బాలసుబ్రహ్మణ్యం పోషించారు. ఆయన కన్యాకుమారి జిల్లాలోని ఒక గుడిలో సంగీతకచ్చేరి చేసి తిరిగి వస్తుండగా తిరునల్వేలి జిల్లాలోని వల్లియూరులో జరిగిన రైలు ప్రమాదంలో 1989, ఏప్రిల్ 9న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## అసమాన ప్రతిభాశాలి రాహుల్ సాంకృత్యాయన్ - ఏప్రిల్ 9... రాహుల్ సాంకృత్యాయన్ జన్మదినం



రాహుల్ సాంకృత్యాయన్ (1893 ఏప్రిల్ 9 – 1963 ఏప్రిల్ 14) అసమాన ప్రతిభాశాలి, ఆయన మేధస్సును కొలవడానికి ఏ కొలబద్ద సరి పోదంటే అతిశయోక్తి కాదేమో. కాలాలకు అతీతంగా యావత్ ప్రపంచ చరిత్రలోనే స్వయం కృషితో మహా పండితుడైన వ్యక్తి మరొకరు లేరని మేధావులు భావించడాన్ని బట్టి ఆయన ప్రతిభ తేట తెల్లం అవుతున్నది. ముప్పైకి పైగా భాషలు, వాటి యాసలు నేర్చుకుని అధికారికంగా చదువుకోక పోయినా విశ్వ విద్యాలయాల్లో బోధించే స్థాయికి ఎదగడాన్ని బట్టి ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. రాహుల్ సాంకృత్యాయన్ నిరంతర లోక సంచారిగా పేరొంది, 45 సంవత్సరాల పాటు యాత్రలలోనే గడిపారు. లోతైన తాత్విక చింతన కలిగిన సాంకృత్యాయన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి బౌద్ధ భిక్షువుగా మారి అనంతరం మార్క్సిస్ట్ సోషలిస్టుగా పరివర్తన చెందారు. సాంకృత్యాయన్ భారత జాతీయోద్యమంలో కూడా కృషి చేశారు. జాతీయోద్యమానికి అనుకూలంగా, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసినందుకు 3సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించారు. 1940వ దశకం ప్రారంభంలో ఆయన పూర్తిగా భౌతికవాద భావాలను స్వీకరించి, కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా చేరి, జీవితాంతం కమ్యూనిస్ట్‌గా ఉన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా ఆయన అనేక రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు. పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసి, వాటిని అనువాదం చేసి, ప్రపంచానికి తెలియపరచటంలో రాహుల్ అపారమైన కృషిని బౌద్ధులు ఎంతో విలువైనదిగా గుర్తించారు. యునై టెడ్ ప్రావిన్సెస్ (యూపీ) రాష్ట్రంలోని అజామ్‌గఢ్ జిల్లాలో 1893 ఏప్రిల్ 9లో సనాతన ధర్మాన్ని పాటించే బ్రాహ్మణ కుటుంబంలో కేదార్‌నాథ్ పాండే జన్మించారు. బౌద్ధాన్ని స్వీకరించాక, తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చు కున్నారు. ప్రాథమిక విద్య ఉర్దూ మాధ్యమంలో చదివారు. తొమ్మిదేళ్లప్పుడే ప్రపంచం ఏమిటో చూడాలని ఇంట్లోంచి పారిపోయాడు సాంకృత్యాయన్. 8వ తరగతి తోనే అతని చదువు ఆగిపోయింది. కాశీ విద్యాపీఠ్‌లో సంస్కృతం నేర్చుకున్నాడు. ఆర్యసమాజంలో చేరి హిందూమత వ్యాప్తికి కొన్నాళ్లు కృషి చేశాడు. ఆయన నిత్యసంచారిగా వేలాది కిలోమీటర్లు కాలినడకన చుట్టివచ్చారు. మూడు బౌద్ధ వేదాలనూ జీర్ణించుకుని త్రిపిటకాచార్య అయ్యారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, అప్పటి సోవియట్ రష్యా... ఎక్కడ తిరిగితే అక్కడి భాష నేర్చుకున్నారు. అరబిక్, భోజ్‌పురి, ఫ్రెంచ్, హిందీ, కన్నడం, మైథిలి, నేపాలీ, పాళీ, పర్షియన్, రష్యన్, రాజస్థానీ, సింహళీస్, తమిళం, ఉర్దూ లాంటి భాషలు అవలీలగా ఆయన నేర్చుకుని పట్టు సాధించారు. పదమూడో శతాబ్దంలో నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలను భక్తియార్ ఖిల్జీ ధ్వంసం చేసినప్పుడు బౌద్ధ భిక్షువులు పవిత్రమైన గ్రంథాలతో పారి పోయారనీ, ఆ విలువైన సంస్కృత పుస్తకాల్ని టిబెట్‌లోని ఆరామాల్లో భద్రపరిచి వుంచారనీ ప్రచారంలో ఉంది. అయితే, ఆరు వందల ఏళుగా వాటిల్లో ఏముందో చూసినవారు లేరు. సాంకృత్యాయన్ వాటికోసం అన్వేషిస్తూ, దారి కూడా సరిగాలేని కొండల్లో నడుస్తూ, కాశ్మీర్, లడఖ్, కార్గిల్ మీదుగా టిబెట్ వెళ్లారు. అక్కడ పుస్తకాలైతే లభించాయిగానీ అవి సంస్కృతంలో లేవు. అన్నీ భోటి భాషలో ఉన్నాయి. రాహుల్ కంచర గాడిదల మీద వాటిని తరలించు కొచ్చారు. ఆ గ్రంథాలన్నీ పాట్నా మ్యూజియంలో ఉన్నాయిప్పుడు. మరో మూడుసార్లు టిబెట్ వెళ్లి, టిబెటన్ నేర్చుకుని, దాని వ్యాకరణ పుస్తకాలు రాశారు. టిబెటన్–హిందీ నిఘంటువు కూర్చారు. నాటి సోవియట్ యూనియన్‌లోని అనేక రిపబ్లిక్కులలో ఆయన విస్తృతంగా పర్యటించి, సంస్కృతం, పాళీ భాషలో లిఖించబడిన అనేక శాసనాలను, రాతి ఫలకాలనూ కనుగొన్నారు. భారతదేశంలోనూ, నేపాల్, హిమాలయ సానువులలోనూ, టిబెట్ లోనే కాకుండా ఆయన మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్ ఆదిగా అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తన యాత్రలో భాగంగా అరుదైన "కాన్జూర్, టాన్జూర్, గ్రంథాలను కొన్నాడు 130 వర్ణ చిత్రాలు 1600 కు పైగా వ్రాత ప్రతులు సేకరించారు. యాత్రికుడు యుఁవాన్ త్స్యాంగ్ తర్వాత ఇంత భారీగా సేకరించిన వారెవరు లేరని చరిత్ర కారుల అంచనా. 70 సంవత్సరాల వయస్సులో మరణించే సమయానికి, ఆయన దాదాపు 140 పుస్తకాలు రాశారు. జీవితంలో మొత్తం జ్ఞాపకశక్తిని కోల్పోయారు. వందలాది పుస్తకాలు కూడా కంఠోపాఠంగా కలిగిన మహా జ్ఞాని, విజ్ఞాన ఖని చివరి రోజుల్లో తన పేరేమిటో తనే చెప్పుకోలేని మతిమరుపు లోకి జారి పోయారు. 1963 ఏప్రిల్ 14లో శ్రీలంకలో ఆచార్యుడుగా పనిచేస్తూ, ఆయన అంతిమ శ్వాస విడిచారు. ఆయన స్మృతి చిహ్నం డార్జిలింగ్ నగరంలో బౌద్ధమత పద్ధతిలో నిర్మించబడింది. 1958లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1963లో పద్మభూషణ్ బిరుదులు ఆయనకు లభించాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నిబంధనలు డొల్ల.. తాగితే ఒళ్లు గుల్ల..!

నల్గొండ: ఓ వైపు ఫ్లోరోసిస్ భయం.. మరోవైపు ప్రభుత్వం సరఫరా చేసే తాగునీరు అపరిశుభ్రంగా ఉండటం..వేళకు సరఫరా కాకపోవడంతో ఎక్కువశాతం ప్రజలు రూ.10, రూ.20లకు దొరికే నీటిక్యాన్లపై ఆధారపడుతున్నారు. వీటి నిర్వహణకు ప్రభుత్వ ఆమోదం పొందాల్సి ఉన్నప్పటికి అవేవీ పట్టించుకోకుండానే ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. చాలా మంది నిర్వాహకులు ఇంట్లోనే బోరు వేసి ఎలాంటి నీటి పరీక్షలు చేయకుండానే ప్యూరిఫైడ్ వాటర్‌గా విక్రయిస్తున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో దాదాపు 50 వాటర్ ప్లాంట్లు ఉండగా తీసుకున్నవి ఐదారు మాత్రమే ఉండటం గమనార్హం.

**మామూళ్లతోనే సర్దుబాటు**

నీళ్లు రుచిగా ఉండేందుకు నిర్వాహకులు ఎక్కువగా ఫ్యూరిఫై చేస్తున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు లేని చోట్ల ఈ నీటినే స్థానికులు తప్పక కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. దీంతో ప్రజలు అనారోగ్యపాలవుతున్నారు.

నీటి శుద్ధి యంత్రాల యజమానులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ధ్రువపత్రం ఉండాలి. ట్రేడ్ లైసెన్సులు, ఫుడ్ లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలి. నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) ఆధారంగా విద్యుత్తు శాఖ నుంచి కనెక్షన్ తీసుకోవాలి. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీల నుంచి



ఎన్‌వోసీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. బయాలజిస్టు, కెమిస్టుల అనుమతులుండాలి. నీటి నాణ్యతను పరీక్ష చేసే పరికరాలు ఉండాలి. ఇనుప డ్రమ్ములు కాకుండా స్టీల్ డ్రమ్ములు వినియోగించాలి.

ప్లాంట్ల వద్ద పాకురు పట్టిన డ్రమ్ములు, క్యాన్లు ఉంటున్నాయి. ప్లాంటు పరిసరాల వద్ద నీటి నిల్వలు ఉండి దోమలకు ఆవాసంగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు చేయకపోవడంతో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. ఆయా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లకు శుద్ధియంత్రాల నిర్వాహకులకు నెలవారీగా మామూళ్లు ఇవ్వడం వల్లే తనిఖీలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.


అధికారుల మధ్య సమన్వయ లోపాలు

నీటి శుద్ధి యంత్రాల విషయమై సంబంధిత అధికారుల వివరణ కోసం 'ఈనాడు' ప్రయత్నిస్తే ఒక్కొక్కరు ఇలా వివరణ ఇచ్చారు. నీటి శుద్ధి యంత్రాలకు ఎన్నింటికి అనుమతులున్నాయని జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారిణితో ప్రస్తావిస్తే.. వాల్టా నిబంధల ప్రకారం మాశాఖ వద్ద అనుమతులు తీసుకోవాలి. ఎవరూ ఇప్పటి వరకు తీసుకోలేదని తెలిపారు. అనుమతుల సమాచారం కావాలంటే రెవెన్యూ శాఖ వద్ద ఉంటుందన్నారు.

నల్గొండ ఆర్డీవోతో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తే.. నల్గొండ మున్సిపల్ కమిషనర్‌తో ట్రేడ్ లైసెన్సుల గురించి అడగాలని, బోరునీటి సరఫరా కాబట్టి భూగర్భ నీటిశాఖకు ఫోన్ చేయాలని తెలిపారు. చివరకు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌తో మాట్లాడితే ఇప్పటి వరకు ఒక్క ప్లాంట్‌కు ట్రేడ్ లైసెన్స్ జారీ చేయలేదని చెప్పడం గమనార్హం. ఎన్‌ఓసీలు తీసుకున్నారా? అంటే ఏ ఒక్కరూ తీసుకోలేదని చెప్పారు. తనిఖీలు ఎందుకు చేయడం లేదని అడిగితే సిబ్బంది లేరని చెబుతున్నారు. ఇక నీటి శుద్ధియంత్రాల నిర్వాహకులు ఫుడ్ లైసెన్సులు కూడా తీసుకోవాల్సి ఉండగా.. జిల్లా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లు జ్యోతిర్మయి, స్వాతిలకు సంబంధించిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేస్తే వారూ ఫోన్లు స్వీకరించడం లేదు.

# పెద్దవాగు ప్రాజెక్టు డిజైన్ మార్పు?

అశ్వారావుపేట : అశ్వారావుపేట మండలంలో గుమ్మడవల్లి సమీపంలోని పెద్దవాగు ప్రాజెక్టు డిజైన్ మార్చేందుకు ప్రభుత్వం యోచిస్తుందనే సంకేతాలున్నాయి. గతేడాది జులై 18న కురిసిన అతిభారీ వర్షాలతో ఈ ఆనకట్టకు 20 చోట్ల గండ్లుపడి ఆనవాళ్లు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఊహించని విధంగా ప్రాజెక్టు సామర్థ్యానికి మించి వరద రావటంతో ఈ దుస్థితి ఏర్పడిందని నీటిపారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీన్ని అధిగమించాలంటే ప్రాజెక్టును రీ డిజైన్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.92.5కోట్లు అవసరమని ప్రతిపాదించారు. సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.40కోట్లు కేటాయించింది.ప్రభుత్వ ఆదేశాలతో హైదరాబాద్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారుల ఆధ్వర్యంలో మట్టి నమూనాలను సేకరించే పనులను శనివారం ఆరంభించారు.



ప్రాజెక్టుకు ఎడమ వైపు ఆనట్టకు భారీగా గండి పడిన ప్రాంతంలో భూఉపరితలం నుంచి 40 మీటర్ల లోతులో 20కి పైగా మట్టి నమూనాను సేకరిస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.

**లక్ష క్యూసెక్కుల వరదను తట్టుకునేలా..**

16వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును 6.3 మీటర్ల ఎత్తులో 1,102 ఎకరాల విస్తీర్ణంలో 40వేల క్యూసెక్కుల నిల్వ సామర్థ్యంతో 1975లో నిర్మించారు. రాష్ట్ర విభజనతో తెలంగాణలోని అశ్వారావుపేట మండలంలో 2వేల ఎకరాలు, ఏపీలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 14వేల ఎకరాల సాగు భూమి ఉంది. భవిష్యత్తులో లక్ష క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాజెక్టు తట్టుకునేలా డిజైన్ చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ ఈఈ సురేశ్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగానే మట్టి నమూనాలు సేకరిస్తున్నారని చెప్పారు.స

**ఆయకట్టు రైతుల్లో ఆశలు..**ఆనకట్టకు గండిపడిన నాటి నుంచి ప్రాజెక్టును ఏపీ అధికారులు సందర్శించలేదు. రెండు రోజుల క్రితం ఆ రాష్ట్రానికి చెందిన జనవరులశాఖ ఎస్‌ఈ నాగార్జునరావు ఆధ్వర్యంలో జలాశయాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగే గోదావరి రివర్ బోర్డు సమావేశంలో ప్రాజెక్టు స్థితిగతులపై చర్చిస్తామని తెలిపారు. ఈనేపథ్యంలో మట్టి నమూనాలు సేకరిస్తుండటంతో ప్రాజెక్టుకు పూర్వవైభవం వస్తుందని రైతులు సంతోషిస్తున్నారు.

# మరో రెండు బెంచ్‌ల ఏర్పాటుతో మేలు



హైదరాబాద్: కోటిన్నర జనాభా ఉన్న రాజధాని పరిధిలో రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. లక్షలాది మంది వినియోగదారులు అనేక వస్తువులు కొనుగోలు చేస్తుండగా ఉత్పత్తి, సేవాలోపాలపై జిల్లా వినియోగదారుల కమిషన్లలో రోజూ 5 కేసులు నమోదవుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలో మూడు కమిషన్లు, ఉమ్మడి రంగారెడ్డిలో(మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్‌లోని కొన్ని ప్రాంతాలు) ఒక కమిషన్ వివాదాలు పరిష్కరిస్తోంది. ఉమ్మడి జిల్లాల నుంచి ఎక్కువ ఫిర్యాదుల నమోదుతో రంగారెడ్డిలో పెండింగ్ కేసులు పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే మరో రెండు బెంచ్‌ల ఏర్పాటుకు వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. నాంపల్లిలోని వినియోగదారుల కమిషన్లు హైదరాబాద్‌వాసులకు అందుబాటులో ఉండగా, కూకట్‌పల్లి, మేడ్చల్, వికారాబాద్ ప్రాంతాలవారు ఫిర్యాదుల నమోదు, విచారణ కోసం ఎల్బీనగర్‌కు రావాల్సి వస్తోంది. వ్యయ, ప్రయాసలు తప్పడం లేదని వాపోతున్నారు. కూకట్‌పల్లి, వికారాబాద్‌లో బెంచ్‌లు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

**పేరుకుపోతున్న కేసులు**

వినియోగదారుల కమిషన్లలో ఫిర్యాదు నమోదైన 90రోజుల్లో పరిష్కారం చూపాలనే నిబంధన ఉంది. సభ్యుల నియామకంలో జాప్యం, మౌలిక వసతుల లేమి తదితర కారణాలతో కేసుల విచారణ జాప్యమవుతోంది. రంగారెడ్డి జిల్లా కమిషన్‌లో ప్రతినెలా సగటున 60 కేసులు నమోదవుతున్నాయి. ఆరోగ్య, జీవిత బీమా క్లెయిమ్ తిరస్కరణ, నాసిరకం ఉత్పత్తుల విక్రయం, వైద్య చికిత్సల్లో నిర్లక్ష్యం, విద్యా సంస్థలు, బ్యాంకుల సేవాలోపాలపై కేసులుంటున్నాయి. రాష్ట్రంలో 12 జిల్లా వినియోగదారుల కమిషన్లు ఉండగా, రంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక పెండింగ్ కేసులున్నాయి. కన్జ్యూమర్ కేసులు 1,114, తీర్పు అమలు తర్వాత వేసే ఎగ్జిక్యూషన్ అప్లికేషన్‌లు 373, తీర్పు వెలువడిన తర్వాత అమలు చేయకుండా ధిక్కరించిన వారికి వారంట్ జారీపై 113 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి సంఖ్య పెరిగిపోతుండటంతో ఇటీవలే 500 కేసులను హైదరాబాద్‌లోని మూడు జిల్లా కమిషన్లకు బదిలీ చేశారు. రోజుకు రెండు చొప్పున కేసులు నమోదవుతుండటంతో భారం పెరుగుతోంది.

రంగారెడ్డి జిల్లా కమిషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు..

కన్జ్యూమర్ కేసులు - 1,114

ఎగ్జిక్యూషన్ అప్లికేషన్లు - 373

వారెంట్లు - 113

మూడు నెలల్లో

నమోదైన కేసులు - 179

# సమయం లేదాయె.. పూచీకత్తు రాదాయే!



భగత్‌నగర్: జిల్లాలో చాలా ప్రాంతాల్లో వరి కోతల దశకు చేరుకున్నాయి. ధాన్యం కొనుగోలుకు సమయం ముంచుకొస్తోంది. మరో పది రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంది. మరో వైపు జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వం కోరిన బ్యాంకు పూచీకత్తు పూర్తి స్థాయిలో రాలేదు. పరోక్షంగా కొనుగోలుపై ప్రభావం పడే అవకాశముంది. గతేడాది జాప్యం కారణంగా కొందరు ముందస్తుగా వ్యాపారులకు అమ్ముకొని ఆర్థికంగా నష్టపోయారు. ఈ ఏడాదైనా కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాల్సిన అవసరముంది.

**ప్రభుత్వ నిర్ణయం.. అమలులో విఫలం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాగానే ఎన్నో ఏళ్లుగా సాగుతున్న బియ్యం రీసైక్లింగ్‌తోపాటు, మిల్లులో స్థలాభావం, తదుపరి సీజన్‌లో వచ్చే బియ్యం నిల్వల కోసం మిల్లులో ఉన్న 2022-23 రబీ తాలుకు ధాన్యం బహిరంగ మార్కెట్‌లో వేలం వేసింది. మూడు సీజన్లు గడిచిపోతున్నా ఇప్పటికీ వేలంలో కొనుక్కున్న వారికి ధాన్యం ఇవ్వకపోగా వారికి ముచ్చటగా మరోసారి గడువును పెంచింది. జిల్లాలో 153 మిల్లుల్లో ఉన్న ధాన్యం విక్రయించగా ఇప్పటి వరకు 97 మిల్లుల్లోని 96,340 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు దారులకు అప్పగించలేదు.

బకాయిదారులపై వేటు వేసేందుకు గత వానాకాలంలో మంత్రి మండలి ఉప సంఘం ఆధ్వర్యంలో నూతన పాలసీని తీసుకొచ్చారు. దీని ప్రకారం బకాయిలు లేకుండా సీఎంఆర్ సక్రమంగా ఇచ్చే వారి వద్ద నుంచి 10 శాతం బ్యాంక్ గ్యారంటీ, డిఫాల్ట్ అయి బకాయిలు తీర్చేసిన వారికి బ్యాంక్ గ్యారంటీని పెంచి 20 శాతంగా నిర్ణయించారు. బకాయిలు తీర్చినా.. జరిమానా చెల్లించని మిల్లర్లకు 25 శాతం బ్యాంక్ గ్యారంటీని వసూలు చేయాలని నిర్ణయించారు. ఇలా జిల్లాలో పెండింగ్‌లేని మిల్లర్లు 113 మంది తేలారు. జరిమానాతో సీఎంఆర్ ఇచ్చింది 10 మిల్లులు, సీఎంఆర్ ఇచ్చినా జరిమానా చెల్లించని మిల్లులు 27 వరకు ఉన్నట్లు గుర్తించారు. ధాన్యం తీసుకొని ఎగవేసిన మిల్లులు 3 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సాఫీగా ధాన్యం తీసుకుని ఇబ్బందిలేకుండా ఇచ్చే 120 మిల్లులను అధికారులు ప్రత్యేకంగా గుర్తించారు. వారి నుంచి బ్యాంక్ గ్యారంటీలు కావాలని కోరితే ఇప్పటి వరకు 50 మంది మాత్రమే ఇచ్చారు. ఇంకా 70 మంది ఇవ్వాల్సి ఉంది.గతేడాది ప్రభుత్వం నూతన పాలసీ అమలు చేసే క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించారు. కొందరు ముందస్తుగా విక్రయించారు. మద్దతు ధర గ్రేడ్-1కు రూ.2320, సాధారణ రకం రూ.2300 ప్రకటిస్తే బహిరంగ మార్కెట్‌లో రూ.1700కే విక్రయించుకున్నారు. మద్దతు ధరలో రూ.600 కోల్పోయారు. ప్రభుత్వం సన్న రకానికి క్వింటాలుకు ఇచ్చిన రూ.500 బోనస్ కలిసిరాలేదు. ఈ పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# మారని తీరు.. అదే లోడు



గోదావరిఖని: ఇటుకబట్టీల నిర్వాహకులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. లారీల్లో అధికలోడ్‌తో మట్టిని తరలిస్తూ ప్రమాదాలకు దారులు తెరుస్తున్నారు. ఇటీవల మట్టి, బూడిద లారీలు ఢీకొని ఇద్దరు ఉద్యోగులు మృతి చెందినా.. వారు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా మళ్లీ మట్టి రవాణా ప్రారంభించగా.. నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. అంతర్గాం మండలం మూర్మూర్ గ్రామ చెరువు నుంచి మట్టి తరలింపునకు అనుమతి పొందిన ఇటుకబట్టీ నిర్వాహకులు అధిక లోడుతో లారీల్లో రవాణా చేస్తున్నారు. లారీ బాడీ ఎత్తు వరకు మాత్రమే మట్టిని నింపుకోవాల్సి ఉండగా.. అంతకు మించి ఎత్తులో లోడ్ చేసి తరలిస్తున్నారు. మూర్మూర్ చెరువులోంచి 19,577 మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు అనుమతి పొందిన ఇటుకబట్టీ నిర్వాహకులు 25 లారీల ద్వారా రవాణా చేసుకుంటామని ప్రొసీడింగ్స్ పొందారు. నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే మట్టిని తరలించాలి. కాని సమయపాలన పాటించకుండా యథేచ్ఛగా రవాణా చేసుకుంటున్నారు.

**30 నుంచి 40 మెట్రిక్ టన్నులు**

ఒక్కో లారీలో 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల మట్టిని తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏ లారీలో కూడా ఇంత మొత్తంలో మట్టిని నింపకూడదు. దీనివల్ల రహదారులపై వెళ్లే ఇతర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంటుంది. అంతర్గాం బుగ్గరోడ్డుతో పాటు రాజీవ్ రహదారి మీదుగా రాఘవాపూర్ ఇటుకబట్టీల వరకు మట్టిని తరలిస్తున్నారు. లారీలను రహదారి నిబంధనలకు విరుద్ధంగా, అజాగ్రత్తగా, అతివేగంగా తొలుతున్నారు. దీనివల్ల ఇటు రహదారులు చెడిపోయే అవకాశం కూడా ఉంది.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

అధికలోడుతో వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తాం. మట్టి లారీలు అధిక లోడుతో వెళ్తున్నట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తాం. నిబంధనల మేరకే లారీల్లో మట్టి రవాణా చేయాలి. ఎక్కువ మొత్తంలో లోడు చేసుకుని రవాణా చేయడం నిబంధనలకు విరుద్ధం. తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

సంతోష్‌రెడ్డి, రామగుండం ఎంవీఐ

# శిబిరాలకు మేం సిద్ధం

పాల్వంచ : పది పరీక్షలు ముగిశాయి. మిగతా తరగతుల 'సమ్మేటివ్ అసెస్‌మెంట్-2' పరీక్షల నిర్వహణతో ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో, ఎంపిక చేసిన ప్రదేశాల్లో వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు సంబంధిత అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏటా వేసవిలో మే 1 నుంచి 31వ తేదీ వరకు క్రీడా శిబిరాలను జిల్లా యువజన, క్రీడల శాఖలు నిర్వహిస్తున్నాయి. ఈసారి ఒక్కో జిల్లాలో కనీసం పది శిబిరాలైనా నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. వాటి నిర్వహణకు గాను సీనియర్ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈనెల 10న స్వీకరణ గడువుగా పేర్కొన్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంత పిల్లలకు ఆసక్తిగల క్రీడల్లో శిక్షణ ఇవ్వడమే వేసవి శిబిరాల లక్ష్యం. పద్నాలుగేళ్లలోపు బాల బాలికలు పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఒక్కో శిక్షకుడికి ప్రభుత్వమే నెలకు రూ.4 వేల గౌరవవేతనాన్ని అందజేస్తుంది. తాగునీటి వసతికి రూ.వెయ్యి, సామగ్రి కొనుగోలు, నిర్వహణకు రూ.5



వేలు, ప్రథమ చికిత్స కిట్లకు ప్రత్యేక నిధులివ్వనుంది. నిర్వహణ కమిటీ ఛైర్మన్లుగా కలెక్టర్లు, పర్యవేక్షకులుగా డీవైఎస్‌ఓలు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. శిక్షకుల ఎంపిక ప్రక్రియ త్వరలో జరగనుంది.

**ఎంపిక చేయనున్న క్రీడాంశాలివే..**

విలువిద్య, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, సైక్లింగ్, సాఫ్ట్‌బాల్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బోటింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ, యోగా, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో.

'రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో క్రీడా శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్వహణలో కోచ్‌లు, పీఈటీల పాత్ర కీలకం. వారి ఎంపికకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాం. జిల్లా కలెక్టర్ అనుమతి తర్వాత త్వరలో శిబిరాల సంఖ్యపై స్పష్టత వస్తుంది. పిల్లలు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి'.పరంధామరెడ్డి, డీవైఎస్ఓ, భద్రాద్రి కొత్తగూడెం

# యాదగిరి క్షేత్రంలో కన్వెన్షన్ హాల్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో శుభకార్యాలు, సమావేశాల నిర్వహణకు ప్రత్యేక కన్వెన్షన్ హాల్ ఏర్పాటైంది. క్షేత్రాభివృద్ధిలో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యాన అధునాతన హంగులతో ప్రత్యేక ఫైబర్ షీట్ల ద్వారా హాల్ నిర్మితమైంది. 150 మంది పాల్గొనేలా చైర్లు ఏర్పాటు చేశారు. ఒక రోజుకు రూ.85,800 అద్దె చెల్లిస్తే హాల్ పక్కనే ఉన్న ఐదు గెస్ట్‌హౌస్‌లతో కూడిన విల్లా కేటాయిస్తామని వైటీడీఏ నిర్వాహకులు తెలిపారు. కొండ కింద ఆధ్యాత్మికవాడ సమీపాన ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్ సముదాయంలోని



14 విల్లాలు సైతం యాత్రికులకు రోజు వారి అద్దెకిస్తారు. ఒక్కో విల్లాలో ఐదు గెస్ట్‌హౌస్‌లు ఉంటాయి. ఒక గెస్ట్‌హౌస్‌కు రూ.3వేలు అద్దె చెల్లించాలి. ఆన్‌లైన్‌లో లేదా నేరుగా గెస్ట్ హౌస్ బుక్ చేసుకోవచ్చు. స్వయంభూ యాదిగిరి క్షేత్రంలో వివాహాలు, కాన్ఫరెన్స్, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకుని పంచ నారసింహుల దివ్యాశీస్సులు పొందే అవకాశం కల్పించేందుకు ఏర్పాటు చేసినట్లు వైటీడీఏ చెబుతోంది.

# జాబ్‌కార్డులు అందక.. ఉపాధి దొరక్క!

ఖమ్మం : ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిపివేతతో కూలీలు ఆందోళన చెందుతున్నారు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుచేస్తున్న నేపథ్యంలో ఈ పనులకు డిమాండ్ పెరిగింది. వ్యవసాయ భూమి లేని ఉపాధి హామీ పథకం కూలీలు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. నవంబరు 2024లో ఉపాధి హామీ జాబ్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేశారు. ఈక్రమంలో గ్రామాల్లో వివాహాలైన యువతకు జాబ్‌కార్డులు లేకపోవడంతో పనులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా పల్లెల్లో జరుగుతున్న కాలువలు, ఫాంపాండ్, ఇంకుడుగుంతలు, ఫిష్‌పాండ్ వంటి పనులకు వెళ్లే అవకాశాలు లేకుండా పోయాయని దిగులు చెందుతున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ 2025-26 సంవత్సరానికి రోజువారీ వేతనాన్ని రూ.307గా నిర్ణయిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రూ.300 ఉండగా తాజా ఉత్తర్వులతో రూ.7 పెరిగింది.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో..

జాబ్ కార్డులు.. 2.23 లక్షలు

కూలీలు.. 4.59

జాబ్‌కార్డు లేకపోవటంతో ఉపాధి హామీ పనికి వెళ్లడం లేదు. కార్డు కోసం గత సంవత్సరం దరఖాస్తు చేశాం. ఇంతవరకూ రాలేదు. ఈ విషయం గురించి ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీఓ, ఎంపీడీఓ అధికారులను కలిశాం. అయినా ప్రయోజనం లేదు. తక్షణమే సమస్య పరిష్కరించి మాకు ఉపాధి హామీ జాబ్‌కార్డు ఇప్పించాలని వేడుకుంటున్నాం.

రాయరపు స్వరూప, ఊటుకూరు, కామేపల్లి మం.

కమిషనర్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కార్డుల జారీని నిలిపివేశాం.. ఉత్తర్వులు వచ్చాక కొత్త కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నిధులు జారీ చేశాం. ఈ పథకంలో ఏడాదికి రూ.12 వేలు చెల్లింపులు ఉండగా మొదటి విడతగా రూ.6 వేలు మంజూరయ్యాయి.

సీహెచ్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ఏపీడీ, ఖమ్మం

## హారన్.. మోత మోగుతోంది


హైదరాబాద్ : కూడళ్లలో గ్రీన్ సిగ్నల్ పడిన వెంటనే వాహనాల హారన్ల ధ్వనితో చెవులకు చిల్లులు పడుతున్నాయి. పలువురు వాహనదారులు అత్యంత ధ్వని తీవ్రత ఉన్న సైరన్లు, మాడిఫైడ్ సైలెన్సర్లతో బెంబేలెత్తిస్తున్నారు. పంజాగుట్ట, ఖైరతాబాద్, సంగీత్, కోఠి, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఇది నిత్య కృత్యమైంది.

**ధ్వనితో దుష్పరిణామాలు..**

సాధారణంగా 85 డెసిబుల్లకు మించిన ధ్వని ఎక్కువ సమయం ఉంటే వినికిడి శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గుండె కొట్టుకునే వేగం, రక్తపీడనం పెరుగుతాయి. దీర్ఘకాలంలో గుండె జబ్బులు, చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. పనిచేసే శక్తి కోల్పోవడం, నిద్రలేమి, అలసట, తలనొప్పి, మానసికంగా, శారీరకంగా మనిషిని కుంగదీస్తుంది.

**నిర్దేశిత పరిమితులు ఇవీ...**

కాలుష్య నియంత్రణ మండలి జూబ్లీహిల్స్, తార్నాక ప్రాంతాలను నివాస ప్రాంతాలుగా, వాణిజ్య ప్రాంతాలుగా అబిడ్స్, జేఎన్టీయూ, పారిశ్రామిక ప్రాంతాలుగా సనత్‌నగర్, జీడిమెట్ల, సున్నిత ప్రాంతాలుగా జూపార్కు, హెచ్‌సీయూను గుర్తించింది. పారిశ్రామిక ప్రాంతంలో ఉదయం 75, రాత్రి 70 డెసిబుళ్లు, వాణిజ్య ప్రాంతంలో ఉదయం 65, రాత్రి 55, నివాస ప్రాంతంలో ఉదయం 55, రాత్రి 45, సున్నిత లేదా నిశ్శబ్ద ప్రాంతంలో ఉదయం 50, రాత్రి 40 డెసిబుళ్ల శబ్ద తీవ్రత ఉండాలని సూచిస్తోంది. పారిశ్రామిక ప్రాంతంలో మినహా



ఇతర ప్రాంతాల్లో నిర్దేశిత పరిమితుల కంటే ఎక్కువ ధ్వని నమోదవుతోంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తూ..**

ఇటీవల ఓ గ్రామ మాజీ సర్పంచ్..శంషాబాద్ నుంచి నగరంలోకి వస్తూ కూడళ్ల వద్ద, రద్దీ ప్రదేశాల్లో సైరన్ మోగించడాన్ని పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. మరో వ్యక్తి ఏకంగా ప్రభుత్వ వాహనం అని స్టిక్కర్ అతికించి సైరన్ మోగిస్తూ వెళ్తుండగా పోలీసులు బంజారాహిల్స్ వద్ద అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం ఫైర్ సర్వీస్, పోలీసు వాహనాలే సైరన్లు వాడాలి. అంబులెన్స్ సైరన్‌ను సైతం అత్యవసర సమయాల్లోనే వినియోగించాలని లేదం టే చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1015 సైరన్‌లను, 525 మల్టీటోన్ హారన్‌లను సీజ్ చేశారు. కోఠిలో మాడిఫైడ్ హారన్‌లు, సైరన్‌లు అమర్చుతున్న కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వాటిపై చర్యలు తీసుకుంటే ధ్వని కాలుష్యం కట్టడి అవుతుందని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

## పచ్చడికి.. కష్టమేనోయి..!

మేళ్లచెరువు : జిల్లాలో ఈసారి పచ్చడికి మామిడి కాయ కరవైంది. కనీసం తీపి మామిడీ జాడ లేదు. జనవరిలోనే కన్పించే పిందెలు తోటల్లో ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. ఏప్రిల్‌లో ఈపాటికి రెండు కిలోల బరువుతో కాయలు, పండ్లు కోతకు సిద్ధంగా ఉండాలి. అక్కడక్కడ తోటల్లో మాత్రమే ఈ పరిస్థితి ఉంది. మిగతా చోట్ల ఎక్కడా ఆశించిన రీతిలో కాయ కన్పించడం లేదు.

దెబ్బతీసిన ప్రతికూల వాతావరణంగత సెప్టెంబరు నెలలో వచ్చిన వాన తొలుత మామిడి తోటల్ని దెబ్బకొట్టింది. పూత వచ్చే ముందు మామిడి తోటల్లో బెట్ట వాతావరణం ఉండాలి. దాదాపు నెల రోజులు పైనే తోటలకు నీటి అవసరం ఉండదు. వాస్తవంగా జూన్, జులై నెలల్లో వచ్చే వానలతోనే కొమ్మలు కొత్త చిగుర్లను తొడుక్కుంటాయి. రెండు నెలల తర్వాత చలి వాతావరణం ఏర్పడితే ఆ చిగుళ్లను కాస్త పూతగా మార్చుకుంటుంది. అప్పుడు కావాల్సిన నీరు పెట్టి ఎరువులు వేస్తారు.సాధారణంగా ఆగస్టు నుంచి నీరు పెట్టడం నిలిపివేస్తారు. నవంబరు, డిసెంబరు నెలల్లో పూత మొదలవుతుంది. ఈసారి భిన్నంగా సెప్టెంబరులో వానలొచ్చాయి. చలి కూడా అంతగా లేదు. వెరసి.. పూత రావడమే తగ్గింది. ఆలస్యం జరిగింది. నవంబరు, డిసెంబరు



నెలల్లో రావాల్సిన పూత జనవరి, ఫిబ్రవరి, మార్చిలోనూ వస్తోంది. పూత డిసెంబరులో వస్తే జనవరిలో పిందె వస్తుంది.

సాధారణంగా పదేళ్లు దాటిన చెట్టు 1.20 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. ఈ ప్రాంతంలో దిగుబడి ఎకరానికి 3.5 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. ఏప్రిల్ ఆఖరు, లేదా మేలో కాయ కోసే అవకాశం ఉంది. ఇప్పుడు పూత వచ్చే సమయానికి ఎండలు ముదిరాయి. వెరసి.. వచ్చిన కాస్త పూత రాలుతోంది. ఈ క్రమంలో గతేడాదితో పోలిస్తే.. యాజమాన్య పద్ధతులు పాటించిన అరకొర ప్రాంతాల్లో మినహా.. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం నేపథ్యంలో తోటల్లో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు.

**విస్తీర్ణంలో స్వల్ప తేడా..**

సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం 11,521 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. కొన్నేళ్ల నుంచి.. ఇరవై ఏళ్లు పైబడిన తోటలను తొలగిస్తున్నప్పటికీ.. వాటికి మూడింతల విస్తీర్ణంలో కొత్తగా మొక్కలు నాటుతున్నారు. గతేడాదితో పోలిస్తే కేవలం 200 ఎకరాల విస్తీర్ణం తగ్గింది. తోటల విస్తీర్ణంలో స్వల్ప తేడాలున్నప్పటికీ.. ఈసారి మామిడి తీపి తక్కువేనని చెప్పొచ్చు. పులుపు ఇంకా తక్కువే.

## అనూహ్యం.. ఎన్నిక అనివార్యం



హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎంఐఎం, భాజపాలు తలపడుతున్నాయి. భారాస సిటింగ్ ఎమ్మెల్సీ స్థానమైన ఇక్కడ అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన భారాస దూరంగా ఉన్నాయి. మొత్తం 110 మంది ఓటర్లుండగా భాజపా అనూహ్యంగా పోటీకి దిగడంతో ఎన్నిక అనివార్యం కానుంది. సిటింగ్ సభ్యుడు 2019లో భారాస నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ఎం.ఎస్.ప్రభాకర్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఆయన పదవీకాలం మే 1తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 23న ఎన్నిక నిర్వహించనున్నారు.

**కాంగ్రెస్, భారాస వైఖరేంటి..?**

ఎంఐఎం పార్టీ తమ అభ్యర్థిగా ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీని బరిలో దింపింది. 2019లో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన పదవీకాలం 2023లో ముగిసింది. మరోవైపు భాజపా నుంచి ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎన్.గౌతంరావు బరిలో దిగారు. అనూహ్యంగా భాజపా అభ్యర్థిని ప్రకటించడంతో ఎన్నిక అనివార్యమైంది. పోటీకి దూరంగా ఉన్న కాంగ్రెస్, భారాసలు ఈ ఎన్నికల్లో ఎలాంటి వైఖరి అనుసరిస్తాయనేది చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ కీలక నేతలంతా దిల్లీలో ఉన్న నేపథ్యంలో వారు హైదరాబాద్‌కి వచ్చిన అనంతరం పార్టీ వైఖరి ప్రకటించనున్నట్లు ముఖ్యనేత తెలిపారు.

**జీహెచ్‌ఎంసీ ఎన్నికలు లక్ష్యంగా..**

కేవలం 22 ఓట్ల బలం ఉన్న భాజపా వ్యూహాత్మకంగానే అభ్యర్థిని బరిలో దింపిందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిని బరిలో దింపినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఆ రెండు పార్టీలవి ఓటుబ్యాంకు రాజకీయాలు: గౌతంరావు కాంగ్రెస్, భారాసలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాకులాడుతున్నాయనే విషయం ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా మరోసారి రుజువైందని గౌతంరావు అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. ఎంఐఎంకి లబ్ధి చేకూర్చేందుకే కాంగ్రెస్, భారాసలు పోటీ చేయడం లేదన్నారు.

## స్వీయ మదింపు.. జేబులు నింపు



హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో కొందరు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు ప్రజల నుంచి ముడుపులు తీసుకోవడం, తర్వాత చేతులెత్తేయడం అలవాటుగా మారింది. శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోన్లలో ఈ తరహా వసూళ్లు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఆస్తిపన్ను స్వీయ మదింపు విధానాన్ని భారీగా దుర్వినియోగం చేస్తున్నారు. ఏళ్లుగా దరఖాస్తులను ఆమోదించట్లేదు. ముందుగానే ఆస్తిపన్ను తీసుకుని, ఇంటి నంబరు, పీటీఐఎన్(ఆస్తిపన్ను ఏకరూప సంఖ్య) ఇవ్వకుండా వేధిస్తున్నారు.

**దరఖాస్తులను ఆమోదించట్లేదు..**

ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఇంటి నంబరు పొందేలా జీహెచ్‌ఎంసీ 'స్వీయ మదింపు' విధానాన్ని అమలు చేస్తోంది. కొందరు అధికారులు, సిబ్బంది లంచాలు తీసుకుంటూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. దరఖాస్తు సమయంలో పన్ను చెల్లిస్తేనే ఇంటి నంబరు మంజూరవుతుంది. మంజూరైన ఇంటి, పీటీఐఎన్ నంబర్లు జారీ కావాలంటే సర్కిల్ అధికారి దస్త్రాన్ని ఆమోదించాలి. కానీ 70శాతం మంది సర్కిల్ అధికారులు దరఖాస్తులను ఆమోదించట్లేదు.

**పెండింగులో 5వేలు..**

30సర్కిళ్లలో 5వేల స్వీయ మదింపు దరఖాస్తులు ఏళ్లుగా పెండింగులో ఉన్నాయి. వారంతా ఆస్తిపన్ను చెల్లించారు. జీహెచ్‌ఎంసీకి పన్ను చెల్లించి, సిబ్బందికి లంచంగా ఇచ్చి కూడా పీటీఐఎన్ నంబరు పొందలేకపోతున్నామని జనాలు గగ్గోలు పెడుతున్నారు.

అడిగినంత ఇవ్వకపోతే.. రెండున్నరేళ్ల పన్నును జరిమానాగా చెల్లించాల్సి ఉంటుందని, ప్రామాణిక ధరను పెంచి ఎక్కువ చూపుతామని బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు భయపెడుతున్నారు. దాదాపు 90శాతం మంది బిల్ కలెక్టర్లు ప్రైవేటు సిబ్బందిని నియమించుకొని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇవన్నీ తెలిసినప్పటికీ.. కేంద్ర కార్యాలయం దరఖాస్తులపై, ఏళ్లుగా 'బ్లాక్' కేటగిరిలో ఉన్న ఇంటి నంబర్లపై నిర్ణయం తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

పరిశీలనకు నోచుకోని దరఖాస్తులు 4,950

రెండేళ్లకుపైగా.. 490

ఏడాదిగా.. 1,495

## గుట్ట కొల్లగొట్టి.. గుల్ల చేసి..



తాండూరు : తాండూరు శివారు ప్రభుత్వ పరిధిలోని గుట్టలను అక్రమార్కులు మొరం కోసం తవ్వేస్తున్నారు. ఈ దందా రాత్రి 9 గంటలకు ప్రారంభమై తెల్లవారుజాము 4 గంటల వరకు కొనసాగిస్తున్నారు. ఒక్కో టిప్పర్ రాత్రి నుంచి తెల్లారే సరికి ఐదేసి లోడ్ల చొప్పున 40 ట్రిప్పులు తరలిస్తున్నాయి. ఒక్కో లోడ్‌కు రూ. 4,000 వసూలు చేస్తున్నారు. ఇలా అనధికారిక లెక్కల ప్రకారం నిత్యం రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. గత నాలుగు నెలలుగా కొల్లగొట్టి విక్రయించిన మొరం విలువ రూ.కోట్లలో ఉందని సమాచారం. ముందస్తుగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఒప్పందం చేసుకుని తరలిస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ క్షేత్రాలు, వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**రహదారిగా మారి..:** ఎత్తైన గుట్టను మధ్యలో నుంచి తవ్వుకుంటూ వెళ్లడంతో రహదారిగా మారింది. చెట్లు తొలగిపోయాయి. యంత్రాన్ని, టిప్పర్లను ఎవరికి కనిపించకుండా నిలుపుతున్నారు. రాత్రి కాగానే రంగంలోకి దింపుతున్నారు. అయినా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. అనుమతి లేకున్నా, అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరపాలంటే, వివిధ రకాల అనుమతులకు రూ.లక్షల్లో వ్యయం చేయాల్సి ఉంటుంది. అయితే ఇవేమీ లేకుండానే అక్రమార్కులు తమకున్న అండదండలతో దందా సాగిస్తున్నారు.

**8 టిప్పర్లపై కేసు నమోదు**

అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్సై గిరి తెలిపిన ప్రకారం.. కోకట్ గ్రామ శివారులో అనుమతి లేకుండా తవ్వకాలు చేపడుతూ, 8 టిప్పర్లలో తరలించేందుకు సిద్ధం అవుతుండగా, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి యాలాల ఠాణాకు తరలించారు. అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై వివరించారు.

## నిషేధమున్నా.. పట్టించుకోరే!


ధర్మపురి: ప్రాణాంతక వ్యాధులకు కారణమైన ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వం నిషేధం విధించినా అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా అవసరాలు తీర్చుకోవాలని సూచించినా పాటించడం లేదు. ఉచితంగా వస్తోందని, తేలికపాటి కవర్లను వాడటానికి ప్రజలు, భక్తులు, వ్యాపారులు అలవాటు పడ్డారు. తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించినా విక్రయాలు, వినియోగం తగ్గడం లేదు.

**మొక్కుబడిగానే...**

జిల్లాలోని అయిదు పురపాలికల్లో మొక్కుబడిగానే పుర అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిషేధం అమలులో ఉన్నప్పటికీ స్థానిక అధికారులు దాడులు చేసినా రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్నారు. జరిమానాలు అతి తక్కువ మొత్తంలో విధిస్తున్నారు. జిల్లాలోని అయిదు పురపాలికల్లో ఎక్కడ చెత్తను సేకరించినా అంతా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ సంచుల నిషేధం అమలు కమిటీలో కలెక్టర్‌తో పాటు, 10 మంది అధికారులు ఉన్నారు. నెలకోమారు ప్లాస్టిక్ నిషేధం అమలుపై చర్చించాల్సి ఉంటుంది. ఈ సమావేశాలు మొక్కుబడిగానే జరుగుతున్నాయనే విమర్శలున్నాయి.

**నిత్యం 10 న్నులు..**

జిల్లాలోని ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ పట్టణాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 10 హోల్‌సేల్ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను ఎలాంటి అమమతులు లేకుండానే విక్రయిస్తున్నారు. రోజుకు కనీసం జిల్లాలో 10 టన్నుల వరకు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను విక్రయిస్తున్నారు. పురపాలికల్లో ప్లాస్టిక్ కవర్లు నిషేధించామని, సహకరించాలని వ్యాపారులను కోరడం, అడపాదడపా తనిఖీలు చేస్తూ జరిమానా



విధిస్తున్నా విక్రయాలు తగ్గడం లేదు. పట్టణాల్లో తిను బండారాలు, పండ్ల దుకాణాల ముందు పడేయడంతో ఆహార పదార్థాలు అనుకొని పశువులు కవర్లను తింటూ మృత్యువాతపడుతున్నాయి. ధర్మపురి లాంటి పుణ్యక్షేత్రాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం అధికంగా ఉంటోంది. కవర్లను కాల్చే సమయంలో వెలువడే పొగను పీల్చడం వల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశముంది.

నెలనెలా దాడులుకల్లెడ రాజశేఖర్, పుర కమిషనర్, ధర్మపురి

50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే సమయంలో విక్రయదారులు, ఉత్పత్తి దారులకు ఆర్పీలు అవగాహన కల్పిస్తారు. నెలకోమారుల తప్పకుండా దాడులు చేస్తూ జరిమానాలు విధిస్తున్నాం. దుకాణాల దారులను కూడా కలిసి అవగాహన కల్పిస్తాం.

## సన్న బియ్యం.. తూకంలో వ్యత్యాసం

పెద్దపల్లి : సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ రేషన్ డీలర్లకు తలనొప్పిగా మారింది. సంచుల్లో తరుగు వస్తుండటంతో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సంచికి రెండు కిలోల వరకు తగ్గుతోంది. ఇప్పటివరకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో చాలా మంది వినియోగదారులు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపక డీలర్ల వద్దనే ఉండిపోవడం, లేకుంటే డీలర్లకే విక్రయించడంతో సంచుల్లో తరుగు వచ్చినా భరించారు. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రతి కార్డుదారుడూ తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బస్తాల్లో తూకం వ్యత్యాసంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ధాన్యం మర పట్టిన తర్వాత బియ్యాన్ని సక్రమంగా తూకం వేయకపోవడంతో ఈ సమస్య నెలకొందని చెబుతున్నారు.

**ఒక్కో బస్తాకు రెండు కిలోల తేడా**

జిల్లాలో మొత్తం 413 రేషన్ దుకాణాల పరిధిలో 2,19,952 కార్డులుండగా 6,21,836 మంది సభ్యులుగా నమోదయ్యారు. జిల్లాకు ప్రతి నెలా 4,013.39 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు.



వాస్తవంగా ఒక్కో సంచి బరువు 50.500 కిలోలుండాలి. అయితే 48 కిలోలలోపే ఉంటోందని డీలర్లు పేర్కొంటున్నారు. ఒక్కో సంచికి రెండు కిలోల నష్టం వస్తోంది. అంటే ఒక డీలరుకు 100 సంచుల బియ్యం కేటాయిస్తే దాదాపు రెండు క్వింటాళ్లు తరుగు వస్తోంది. ఈ సమస్యపై డీలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

**సరఫరా ఆలస్యమవుతుందని..**


జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పౌరసరఫరాల శాఖ గోదాములున్నాయి. డీలర్లకు కేటాయించిన బియ్యం బస్తాలను గోదాముల్లో తూకం వేయాల్సి ఉంటుంది. సరఫరాలో ఆలస్యం అవుతుందనే కారణంతో తూకం వేయకుండానే లారీల్లో నింపుతున్నారు. బస్తాలను తూకం వేస్తే వ్యత్యాసం వచ్చే అవకాశం లేదు. తమ కోటా ఆధారంగా బియ్యం తరలిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. దొడ్డు బియ్యం సంచులు నెలల తరబడి నిల్వ ఉండటంతో చిరిగి తూకంలో వ్యత్యాసం ఉండేది, సన్న బియ్యం ఇటీవల మర పట్టినవే కావడంతో వ్యత్యాసం వచ్చే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు దుకాణాలపై ఆరా తీస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం బస్తాను తూకం వేశారు. సంచితో కలిసి 50.500 కిలోల బరువు ఉండటానికి బదులు 48.360 కిలోలు మాత్రమే ఉంది. అంటే 2.14 కిలోల బరువు తగ్గింది.

**ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతాం**

బియ్యం తూకంలో వ్యత్యాసం ఉండే అవకాశం చాలా తక్కువ. బస్తా కచ్చితంగా 50 కిలోల బరువు ఉంటుంది. అక్కడక్కడ తేడా ఉన్నట్లు చెబుతున్నారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిస్తాం.శ్రీకాంత్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

## ఇల్లు చల్లగా.. ఇలా

భానుపురి : రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. బయటకు వెళితే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక ఇళ్లలో రాత్రిపూట ఉడికిస్తోంది. చల్లదనం కోసం అందరికీ ఏసీలు ఏర్పాటు చేయించుకునే స్థోమత ఉండదు. అందుబాటులో ఉన్న ఫ్యాన్లు, కూలర్లు నడిచినా ఇళ్లలో గదులోంచి వేడి బయటకు వెళ్లదు. కూలర్లు నడిచినప్పటికీ శరీరం జిగటగా మారుతుంది. ఈ నేపథ్యంలో గదిని ఎలా చల్లగా ఉంచుకోవాలనే విషయంపై అవగాహన పొందాల్సిన ఆవశ్యకత ఉంది.




**నిపుణుల సూచనలు...**ఇంట్లో ఫ్యాన్లు నడిచినా పైకప్పు నుంచి వచ్చే వేడి గదిలోనే తిరుగుతుంది. సీలింగ్ ఫ్యాన్‌ఉన్న వారు గది తలుపులు, కిటికీలు తెరిచి ఫ్యాన్ వేసుకోవాలి. ఇలా వేస్తే వేడి గాలి గడి నుంచి ఎప్పటికప్పుడు బయటకు పోతుంది. టేబుల్ ఫ్యాన్ ఉన్నవారు కిటికీ దిశగా అమర్చుకోవలి. ఇలా చేయడంతో బయట ఉండే చల్లగాలి కిటికీ ద్వారా గదిలోకి వచ్చి వాతావరణం చల్లగా ఉంటుందిచాలా మంది కూలర్లను గదిలో పెట్టుకొని నిద్రిస్తుంటారు. కిటికీకి ఎదురుగా అమర్చుకొంటే బయట నుంచి వచ్చే చల్లని గాలితో గది త్వరగా చల్లబడుతుంది.ఇంటి ఆవరణలో వీలైనన్ని మొక్కలు పెంచుకోవాలి. ఇంటి చుట్టూ చెట్లు ఉంటే ఆవరణ చల్లగా ఉంటుంది. ఆవరణలోని మొక్కలకు సరిగా నీళ్లు పట్టాలి.కాంక్రీట్‌తో నిర్మించిన ఇళ్లు త్వరగా వేడెక్కుతాయి. మార్కెట్‌లో కూల్‌సిమెంటు దొరుకుతుంది. నాణ్యమైనది ఎంచుకుని ఇంటిపైన వేసుకొంటే ఎండ నుంచి గదిని చల్లగా ఉంచుతుంది.టెర్రస్ గార్డెన్ నిర్వహించుకొంటే ఇళ్లు చల్లగా ఉంటాయి.

చురకలు



## స్కాన్ చేద్దాం.. చూసొద్దాం

హైదరాబాద్: చార్మినార్ చూడాలంటే.. ముందుగా అఫ్జల్‌గంజ్ వద్ద మూసీ నదిని దాటుకుని మదీనా రోడ్డుకు చేరుకోవాలి. అక్కడి నుంచి పర్యాటకులు ఎవరి సాయమూ లేకుండా చార్మినార్‌తో పాటు చుట్టుపక్కలున్న పర్యాటక ప్రాంతాలన్నింటినీ చుట్టేయొచ్చు. అలాంటి సౌకర్యాన్ని డిజిటల్ సూచికల సాయంతో తీసుకొచ్చేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు చేపట్టింది. అన్ని బోర్డులపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే.. సమీప పర్యాటక ప్రాంతాల వివరాలు, వాటిని చేరుకునే గూగుల్ మ్యాప్ లింకు అందుబాటులోకి




వస్తుంది. మొదట పాతబస్తీలో ప్రయోగాత్మక ప్రాజెక్టును చేపట్టి, తర్వాత అన్ని పర్యాటక కేంద్రాల వద్ద, ప్రధాన రహదారులపై ఈ రకమైన సూచికలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో జీహెచ్‌ఎంసీ ఈ ప్రాజెక్టును చేపట్టబోతోంది. ఇప్పటికే మదీనా రోడ్డు, చార్ కమాన్ రహదారులను ప్రాథమికంగా గుర్తించారు. బోర్డులపై కొంత స్థలంలో ప్రకటనలు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థ ఆదాయం పొందుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

## చరవాణిలో ఇంటి అనుమతి

హైదరాబాద్ : కూర్చున్న చోటు నుంచే ఇంటి నిర్మాణ అనుమతి పొందవచ్చు. ఇలాంటి మరిన్ని ప్రయోజనాలు నూతన నిర్మాణ అనుమతుల విధానం 'బిల్డ్ నౌ'తో ప్రజలకు చేరువ కానుంది. చరవాణిలోనే బిల్డ్ నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించి దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు పరిశీలించి గరిష్ఠంగా 15 రోజుల్లోపు అనుమతి ఇస్తారని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. ఇది కృత్రిమ మేధతో పనిచేస్తుంది. ఇంటి స్థల విస్తీర్ణం 75గజాల్లోపు ఉంటే.. దరఖాస్తును సమర్పించగానే అనుమతి వచ్చేస్తుంది. ఈ కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొదట జీహెచ్‌ఎంసీ పరిధిలో మార్చి 10 నుంచి కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఇవీ ప్రత్యేకతలు..**భవన నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌లు రూపొందించే డ్రాయింగే




ప్రామాణికం. ప్రస్తుత వ్యవస్థలో డ్రాయింగ్ పరిశీలనకు కొన్ని వారాల సమయం పడుతోంది. అది కాస్తా నిమిషాల్లోకి తగ్గనుందని అధికారులు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, టీడీసీపీ, ఇతర స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటిపారుదలశాఖ, రెవెన్యూ, మూసీ నది అభివృద్ధి సంస్థ, తదితర శాఖలన్నీ బిల్డ్ నౌతో అనుసంధానమై ఉంటాయి.

దరఖాస్తు, వాటి స్థితిగతులు, ఏ అధికారి వద్ద పెండింగులో ఉంది, ఇతరత్రా వివరాలను దరఖాస్తుదారు తెలుసుకోవచ్చు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో సమాచారం ఉంటుంది. సామాన్యుడు సైతం.. తనకున్న ఇంటి స్థలంలో ఎన్ని అంతస్తులు కట్టుకోవచ్చు, సెట్ బ్యాక్ ఎంత వదలాలి, దరఖాస్తు విధానం గురించి వెబ్‌సైట్‌లోనే వివరాలు పొందవచ్చు. ప్రశ్నను పొందుపరిస్తే.. ప్రభుత్వ ఉత్తర్వులు, వాటి నిబంధనలతో సూచనలు వస్తాయి. డ్రాయింగ్ ప్రకారం 3డీ ఇంటి నమూనాలను కూడా చూడొచ్చు.

## తప్పొకరిది.. శిక్ష మరొకరికి

హైదరాబాద్ : గతంలో ఇంటి నంబర్ల కేటాయింపుల్లో తీసుకొచ్చిన విధానం కొత్త చిక్కులను తెచ్చిపెట్టింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆస్తిపన్ను స్వీయ మదింపు ఏప్రిల్, 2022లో మొదలైంది. ఆటో అప్రూవల్ విధానంలో ప్రతీ దరఖాస్తు ఆమోదం పొందింది. ఇంటి నంబరు, పీటీఐఎన్ నంబరు జారీ అయ్యాయి. కొన్ని రోజులకే ఆ విధానం పక్కదారి పట్టింది. తెల్ల కాగితాలు, నోటరీ పత్రాలు సమర్పించి వేలాది మంది నంబర్లు పొందారు. దీంతో ఏప్రిల్, 2022 నుంచి జనవరి 2023 మధ్య జారీ అయిన 25 వేల నంబర్లను అప్పటి కమిషనర్ లోకేష్ కుమార్ రద్దు చేశారు. ఇందులో సరైన పత్రాలు, అన్ని అర్హతలున్న సుమారు 5 వేల నంబర్లను రద్దు చేయడంతో వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



**ప్రజావాణిలోనూ వినట్లేదు..**

యూసఫ్‌గూడలోని మోతినగర్ జనప్రియ క్లాసిక్ మెట్రోపాలిటన్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశారు. రెండుసార్లు ఆస్తిపన్ను సైతం చెల్లించారు. తర్వాతి ఏడాది పన్ను చెల్లిద్దామంటే ఇంటి నంబరు రద్దయినట్టు తేలిసింది. ప్రజావాణిలో విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. ఇలాంటి సమస్యలపై దాదాపు 250 అర్జీలు అధికారుల వద్ద మూలుగుతున్నాయి. ఫిర్యాదు చేయకుండా.. దళారులు, కింది స్థాయిలోని బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు లంచాలు ఇచ్చి మోసపోయిన బాధితులు వెయ్యికిపైగా ఉంటారు.

# బ్రో..సాహసానికి సిద్ధమా



హైదరాబాద్ : పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేసేలా.. వివిధ సాహస క్రీడలతో ప్రత్యేక జోన్ త్వరలో అందుబాటులోకి రానుంది. కొత్వాల్‌గూడలోని ఎకో పార్కులో ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేయడానికి హెచ్‌ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌వోటీ) ప్రాతిపదికన తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డెవలపర్స్ ఎంపిక కోసం తాజాగా హెచ్‌ఎండీఏ ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) నోటిఫికేషన్ జారీ చేసింది. పలు సంస్థలు ఇందులో పాల్గొని డిజైన్లు రూపకల్పన చేసే అవకాశం ఉంది. టెండర్ల అనంతరం ఏడాదిలోగా అందుబాటులోకి వచ్చేలా అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. అవుటర్ రింగ్ పరిధిలోని హిమాయత్‌సాగర్ పక్కన 85 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ఎకో పార్క్ అభివృద్ధి చేస్తోంది. ఇందులో ఇప్పటికే పక్షిశాల సిద్ధమైంది. దేశవిదేశాల నుంచి దాదాపు 1500 రకాల పక్షులను సేకరించి ఇక్కడి వాతావరణానికి అలవాటు చేస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు రోజంతా అక్కడే గడిపేలా వివిధ రకాల సాహస క్రీడలను రూపొందిస్తున్నారు. ఈ అడ్వెంచర్ జోన్‌కు రూ.15 నుంచి రూ.20 కోట్లు అవుతుందని అంచనా.

**నాలుగు ప్రాంతాలను కలుపుతూ..**

అడ్వెంచర్‌జోన్‌తోపాటు నాలుగు కీలక పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక సర్క్యూట్(హారం) ఏర్పాటు చేసేందుకూ హెచ్‌ఎండీఏ తాజాగా ఈవోఐ ఆహ్వానించింది. బాపూఘాట్, తారామతి బారాదరి, మంచిరేవుల వద్ద ఫారెస్టు పార్కు, కొత్వాల్‌గూడ ఎకోపార్కులను ఇందులో చేర్చనున్నారు. పశ్చిమ హైదరాబాద్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలను కలుపుతూ ఒక సర్క్యూట్ కింద మార్చి ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించడం, రవాణా ఇతర అన్ని సానుకూలతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. ప్రధాన బాపూఘాట్ వద్ద అతిపెద్ద గాంధీ విగ్రహం నెలకొల్పడమే కాకుండా.. పర్యాటకులకు ఆకట్టుకునేలా పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రతిపాదనలు ఉన్నాయి.

అడ్వెంచర్ జోన్‌లో వచ్చే క్రీడలు..

స్కై వంతెన
రోలర్ కోస్టర్
జిప్‌లైన్, క్లైంబింగ్‌వాల్
జాయింట్ స్వింగ్, సస్పెన్షన్ బ్రిడ్జి
ఫ్లయింగ్ కప్, హ్యూమన్ స్లింగ్‌షాట్
జిప్ బైక్, 360 డిగ్రీల ఫ్లైయింగ్ సైకిల్
రోప్ కోర్సు, బంగీ ట్రంప్‌లైన్

# ఎండకు ఎండాల్సిందే




హైదరాబాద్: వేసవి సమీపిస్తున్న వేళ ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అవసరమైన బస్‌షెల్టర్లు లేక ఎండలో నిరీక్షిస్తున్న పరిస్థితి. పేరుకే ఉన్న కొన్ని ఏసీ బస్‌షెల్టర్లు మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల విద్యుత్తు సరఫరా లేక పాడైన ఫ్యాన్లు, ఏసీలు దర్శనమిస్తున్నాయి. గ్రేటర్‌లో 2800కి పైగా బస్సుల్లో నిత్యం 20లక్షల మంది ప్రయాణాలు సాగిస్తుండగా 2200 బస్‌షెల్టర్లకు 1370 మాత్రమే ఉన్నాయి. 200 ప్రాంతాల్లో నిర్మించడం తప్పనిసరి అంటూ గ్రేటర్ ఆర్టీసీ అధికారులు జీహెచ్‌ఎంసీకి విన్నవించినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

**ఆరు బయటే నిరీక్షణ..**

మెహిదీపట్నంలో రైతుబజార్ వైపు ఉన్న బస్‌షెల్టర్లలో విరిగిన కుర్చీలు, బల్లలే దర్శనమిస్తున్నాయి. ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రయాణికులు ఎక్కడ బస్సు ఎక్కుతారో సర్వే చేయకుండా బస్‌షెల్టర్లు నిర్మించడంతో చాలావరకు నిరుపయోగంగా మారిపోయాయి. హిమాయత్‌నగర్ రోడ్డు, నారాయణగూడ, కాచిగూడ, అమీర్‌పేట, కోఠి, ఉప్పల్, బీహెచ్‌ఈఎల్ మార్గంలో అవసరమైన చోట షెల్టర్లు లేవు. మరోవైపు హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, సోమాజిగూడ ప్రాంతాల్లో అవసరానికి మించి నిర్మించారు. లింగంపల్లి నుంచి చందానగర్ మార్గంలోనూ కొత్తగా నిర్మించాలనే డిమాండ్లు ఉన్నాయి. ఫలక్‌నుమా ఇంజిన్‌బౌలి మార్గంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఏసీ బస్‌షెల్టర్ల పరిస్థితి..

డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ (డీబీఎఫ్‌వోటి) పద్ధతిలో ఏసీ బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎస్పీరోడ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, మలక్‌పేట్‌లోని ఏసీ బస్‌షెల్టర్లలో నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి. డిజైన్‌లోపం ఉండటం, వచ్చే బస్సులు కనిపించకపోవడంతో షెల్టర్ బయటే వేచి చూస్తున్నారు. కొన్నిచోట్ల దుకాణాలకు అద్దెకిచ్చారే తప్ప నిర్వహణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కూకట్‌పల్లిలో రాత్రయితే మందుబాబులు ఇందులో తిష్ఠవేస్తున్నారు.

# కాచిగూడ.. ఏదీ ఆధునికీకరణ జాడ?



కాచిగూడ : నగరంలోని ప్రముఖమైన కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ ప్రతిపాదనను రైల్వే బోర్డు వెనక్కి పంపింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే, గతిశక్తి విభాగం అధికారులు మార్పులుచేర్పులపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం రూ. 750 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అన్నిహంగులతో తీర్చిదిద్దుతున్నారు. అదేతరహాలో కాచిగూడ స్టేషన్‌నూ అభివృద్ధి చేయాలని మూడేళ్లక్రితం ప్రతిపాదించారు. ఈ మేరకు రూ. 450 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రైల్వే బోర్డుకు పంపారు. సంబంధిత అంచనా వ్యయాన్ని తగ్గించాలని కోరుతూ.. ప్రతిపాదనను వెనక్కి పంపించారు.

అన్నీ ఇబ్బందులే..: రైళ్ల సంఖ్యకు అనుగుణంగా కాచిగూడ స్టేషన్ ప్రాంగణంలో.. స్టేబుల్, ఫిట్‌లైన్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్లాట్‌ఫారాల సంఖ్యను కూడా పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఐదు ప్లాట్‌ఫారాలే ఉన్నాయి. అదనంగా 6-7 ప్లాట్‌ఫారాలను నిర్మించాల్సి ఉంది. కొన్నింటిపై లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లనూ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల సందర్శన**

రైళ్లు సులువుగా రాకపోకలు సాగించేలా స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న బ్రిడ్జిలను సైతం విస్తరించాల్సి ఉంది. ఆధునికీకరణతోనే ఇవన్నీ సాధ్యమని అధికారులు చెబుతున్నారు. ప్రతిపాదనను బోర్డు వెనక్కి పంపిన నేపథ్యంలో.. గతిశక్తి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్(సీపీఎం) ఏకేసింగ్ నేతృత్వంలో అధికారుల బృందం కాచిగూడ స్టేషన్‌ను ఇటీవల సందర్శించి మార్పులపై కసరత్తు చేపట్టింది.

రోజువారీ రైళ్లు :100
ప్రయాణికులు :45 వేలు
వార్షికాదాయం : రూ. 90 కోట్లకు పైగా
ఆధునికీకరణ వ్యయం : రూ. 450 కోట్లు

## జన సాంద్రత.. నేర తీవ్రత

హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో నేరాల సంఖ్య పెరుగుతోంది. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గచ్చిబౌలి ఠాణాలో జనవరి, ఫిబ్రవరిలో 336 కేసులు నమోదయ్యాయి. సగటున రోజుకు 5 రికార్డయ్యాయి. నార్సింగి ఠాణా పరిధిలో 2 నెలల్లో 389 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం వల్లే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. నమ్మకద్రోహం (చీటింగ్), ఆర్థిక తగాదాలు, ఉద్యోగ మోసాలు, అదృశ్యం, రోడ్డు ప్రమాదాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. విభజిస్తేనే తగ్గుదల గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండేది. కొత్తగా ఫిల్మ్‌నగర్, మధురానగర్, బోరబండ ఠాణాలు రావడంతో కేసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఐటీ కారిడార్‌లో కొత్తగా కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఠాణాలను ప్రతిపాదించారు. అవి వస్తే నిఘా పెరిగి నేర నియంత్రణ సులువుగా మారుతుందని అధికారులు తెలిపారు.



జనసాంద్రత అంతర్జాతీయ, దేశీయ సంస్థలు.. భిన్న ప్రాంతాల ప్రజలు.. అత్యధిక జనసాంద్రత.. వీటితోపాటే ఆర్థిక వివాదాలు.. సైబర్ నేరాలు ఐటీ కారిడార్‌లో ఎక్కువ నేరాల నమోదుకు కారణమవుతోంది. ఇక్కడితో పోలిస్తే జగద్గిరిగుట్ట, రాజేంద్రనగర్ ఠాణాల పరిధిలో జనసాంద్రత ఎక్కువ. ఇతర రాష్ట్రాల కూలీలు ఉంటున్నారు. ఇలాంటి చోట్ల సైబర్ నేరాలు, ద్విచక్రవాహనాల చోరీలు, ఆర్థిక తగాదాలు తక్కువగా ఉంటాయి. ఐటీ కారిడార్ పరిధిలోని మూడు ఠాణాల పరిధిలో అత్యధికులు విద్యావంతులు. ఏ సమస్య వచ్చినా పోలీసులను ఆశ్రయిస్తుండటంతో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతంలో ఫిర్యాదు దశలో రాజీ ప్రయత్నాలు జరిగేవని హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 2 వేల ఐటీ సంస్థలు పనిచేస్తుంటే సుమారు 95 శాతానికి పైగా ఐటీ కారిడార్ కేంద్రంగానే నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 5 లక్షల మందికిపైగా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో నేరాలివీ..

గచ్చిబౌలి 336 మాదాపూర్ 314 రాయదుర్గం 173 నార్సింగి 389

## తీరు మారితే.. తీరుతుంది దాహార్తి

తాండూరు, పరిగి: ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం పంప్‌హౌస్‌లు, తాగునీటి ప్రాజెక్టులు చేపడుతోంది. వీటి నిర్వహణ సక్రమంగా ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి తనిఖీలు చేపట్టక పోవడం, అవసరమైన మరమ్మతులు నిర్వహించక పోవడం తదితర కారణాలతో పథకాలు వృథాగా మారుతున్నాయి. నిదర్శనంగా నిలుస్తున్నాయి ఈ పంప్‌హౌస్‌లు.

**కాగ్నా నది ఆధారంగా రెండు ఏర్పాటు**

తాండూరు పట్టణానికి కాగ్నానది ఆధారంగా తాగునీటిని సరఫరా చేసే రెండు పంప్‌హౌస్‌లు గడచిన మూడేళ్లకు పైగా మూత పడ్డాయి. వినియోగంలోకి తీసుకు వస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. పట్టణంలోని 36 వార్డుల్లో 14వేల గృహాల్లో నివాసం ఉండే 71,008 జనాభాకు నిత్యం 8.5 ఎం.ఎల్.డి (మిలియన్ లీటర్స్ పర్ డే) తాగు తాగునీరు అవసరం. కానీ 6.5 ఎం.ఎల్.డి.మాత్రమే సరఫరా అవుతోంది.



**రహదారి నిర్మాణం పేరుతో పైప్‌లైన్ తొలగింపు**

కాగ్నానది వంతెన సమీపం నుంచి కొడంగల్ నియోజకవర్గం గ్రామాలు, యాలాల మండలంలోని 39 గ్రామాలకు కలిపి తాగునీటిని సరఫరా చేయడానికి 1999లో రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పంప్‌హౌస్ తాత్కాలికంగా మూత పడింది. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌను గతేడాది వినియోగంలోకి తీసుకు వచ్చి నీటిని సరఫరా చేశారు. అయితే తాండూరు నుంచి కొడంగల్ వైపు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల నేపథ్యంలో నీటి సరఫరా పైపులైన్‌ను తొలగించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. పనులను పూర్తి చేసి కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే పంప్‌హౌస్ వినియోగంలోకి వస్తుంది. ప్రజలకు తాగునీటి సరఫరా జరిగి ఎద్దడి సమస్య ఉండదు. ఇందుకోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

**సుదీర్ఘ కాలంగా సేవలు**

1953లో పాత తాండూరు కాగ్నానది వారగా అప్పటి ప్రజల అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ నుంచి నాలుగేళ్ల కిందటి వరకు సరిపోను నీటి సరఫరా జరిగింది. నిర్వహణ సవ్యంగా లేక పోవడంతో మరమ్మతుకు వచ్చింది. పట్టణానికి 24 గంటల పాటు నీటిని సరఫరా చేసే పంప్ ఆధారిత ఇన్‌ఫిల్టరేషన్ బావులు ఉన్నాయి. యాలాల మండలం బెన్నూరు శివారు కాగ్నానది వారగా తాండూరు పట్టణానికి నీటిని సరఫరా చేసే మరో పంప్ హౌస్‌ను 2005లో రూ.5.80 కోట్లతో నిర్మించారు. నిర్వహణ సవ్యంగా లేక నిరుపయోగమైంది. ప్రస్తుత వేసవిలో ఈ రెండు పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకు వస్తే 2ఎం.ఎల్.డి. నీటి సరఫరా జరిగి ప్రజల దాహార్తి తీరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

చురకలు



# 'పాల'కుల్లేరని బరితెగింపు

ఒంగోలు: ఒంగోలు నగరపాలక సంస్థ నడిమధ్యలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో ఏర్పాటైన ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య స్థలంపై స్థిరాస్తి వ్యాపారుల కన్ను పడింది. కంచె తొలగించి.. చిల్లచెట్లు పెకిలించి చదును చేస్తున్నారు. రాత్రి వేళ పనులు చేస్తూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని 40 వేల మంది గ్రామీణ పాడిరైతుల తలరాతను మార్చి.. ఉద్యోగ, ఉపాధి కల్పించి ఓ వెలుగు వెలిగిన ఘనత ఒంగోలు డెయిరీది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏర్పాటు సమయంలో మొత్తం 78.10 ఎకరాలు సేకరించారు. అందులో పరిశ్రమ స్థాపించి.. ఉద్యోగులు, సిబ్బంది నివాస గృహాలు నిర్మించారు. వాహనాల రాకపోకలు, పశు గ్రాసం పరిశోధన, ఇతర అవసరాలకు కొంత స్థలం కేటాయించారు. కొంత ఖాళీ జాగాలో జామాయిల్ తోట పెంచుతున్నారు. ప్రజల మేలు మరచి.. ఓ కంపెనీకి ద్వారాలు తెరచిన గత వైకాపా పాలకులు.. ఉద్యోగులతో పదవీ విరమణ చేయించి.. డెయిరీని మూసివేశారు. స్థలాల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోలేదు. నగరం మధ్యలో, కర్నూలు రోడ్డులో డెయిరీ ఉండటంతో ఎకరా స్థలం రూ.9 కోట్ల నుంచి రూ.15 కోట్లు పలుకుతోంది. దీంతో 'కాసు'క్కూర్చున్న కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఈ భూమిపై కన్నేశారు.

**నాటి నుంచే రాజకీయ క్రీడ**

ఒంగోలు డెయిరీ స్థలాన్ని సర్వే చేసి హద్దురాళ్లు పాతించాలని 2011లోనే అప్పటి జేసీ ఆదేశించారు. దీంతో జిల్లా భూమి కొలతలు, రికార్డుల శాఖ ఆధ్వర్యంలో సర్వే చేశారు. హద్దురాళ్లు పాతి కంచె ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ స్థానిక ప్రజాప్రతినిధి విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు పేరిట కబ్జాకు యత్నించాడు. అందుకు



అప్పటి ఓ 'పెద్ద' ప్రజాప్రతినిధి సిఫార్సు కూడా చేశారు. వీటిని నాటి జేసీ అభిషిక్త్ కిశోర్‌కుమార్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ప్రస్తుతం డెయిరీకి చెందిన విద్యుత్తు ఉపకేంద్రం ఉన్న చోట సుమారు 5.27 ఎకరాలు, మరో చోట ఎనిమిది ఎకరాల్లో చిల్లచెట్లను తొలగించి చదును చేశారు. వీటి విలువ సుమారు రూ. 120 కోట్లు ఉంటుంది. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి విచారిస్తే.. 'మాకు తెలియదనే' సమాచారం ఎదురవ్వడంతో మిన్నకుండిపోవడం గమనార్హం.

**స్టాండింగ్ కౌన్సిల్ యత్నాలకు అడ్డంకులు**

కబ్జా యత్నాలు, కోర్టు కేసుల పరిష్కారానికి డెయిరీ నిర్వాహకులు స్టాండింగ్ కౌన్సిల్(న్యాయవాది) నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇంతలో ఓ ప్రజాప్రతినిధి సహాయకుడినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి స్టాండింగ్ కౌన్సిల్ వద్దని చెప్పినట్లు సమాచారం. రోజురోజుకూ రాజకీయ ఒత్తిడి పెరుగుతుండటం, స్థిరాస్తి వ్యాపారులు తమ వద్ద ఆధారాలు లేకున్నా ఫోన్లు చేసి 'మా భూమి' అంటూ వేధిస్తుండటంతో అధికారులు సతమతమవుతున్నారు. చదును పనులు చేసిన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, డెయిరీని పునఃప్రారంభిస్తే ఆక్రమణలు ఆగుతాయని నిర్వాహకులు, రైతులు చెబుతున్నారు. ఈ విషయమై జేసీ, డెయిరీ డైరెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఒంగోలు డెయిరీ స్థలాన్ని దొడ్డదారిలో చదును చేసిన విషయం మా దృష్టికి రాలేదని, తహసీల్దార్‌తో విచారణ చేయిస్తానని తెలిపారు.

భూ విస్తీర్ణం వివరాలు(ఎకరాల్లో)
డెయిరీకి సేకరించిన స్థలం: 78.10
పరిశ్రమ విస్తరించిన ప్రాంతం: ఏడెకరాలు
జామాయిల్ తోట: 20
డెయిరీ ఎదుటి భాగం: 20
వెనక భాగంలో ఖాళీ స్థలం: 19
క్వార్టర్లు, ఇతర అవసరాలకు కేటాయింపు: 12.10

# వైద్య సేవలు మరింత సూపర్

ఒంగోలు : జిల్లా ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జీజీహెచ్)లో సూపర్‌స్పెషాలిటీ సేవలు మరింతగా విస్తరిస్తున్నాయి. ప్రధానంగా గుండె జబ్బుల విభాగంలో మరికొన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ క్రమంలో రూ.6.3 కోట్ల వ్యయంతో సిద్ధం చేసిన క్యాథ్ ల్యాబ్‌ను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఈ నెల 10న ప్రారంభించనున్నారు. ఆ మేరకు మంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు జీజీహెచ్‌కి వచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఆసుపత్రిలో ఉన్న వసతులు, విభాగాల వారీగా అవసరాలపై చర్చించారు. ఇక గుంటూరు వెళ్లాల్సింది లేదు: ప్రస్తుతం కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు జీజీహెచ్‌లో సేవలందిస్తున్నారు. కేవలం యాంజియోగ్రాం తీయడానికి మాత్రమే సౌకర్యాలున్నాయి. జనవరిలోనే క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేసినా అధికారికంగా ప్రారంభం కాలేదు. ఇప్పటివరకు 56 మందికి యాంజియోగ్రాం పరీక్ష చేశారు. స్టంట్, యాంజియోప్లాస్టి,



బైపాస్ సర్జరీ అవసరమైతే గుంటూరు జనరల్ ఆసుపత్రికి పంపుతున్నారు. క్యాథ్‌ల్యాబ్‌కు అనుబంధంగా సిద్ధం చేసిన ఐసీసీయూ విభాగాన్ని కూడా మంత్రి ప్రారంభిస్తారు. అక్కడ పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇప్పించి మే నుంచి అవసరమైన వారికి స్టంట్‌లు కూడా ఇక్కడే అమర్చేలా నిర్ణయించారు. మరికొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలను బలోపేతం చేసేందుకు ఉన్నతస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ విషయాలపై వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు మాట్లాడుతూ.. క్యాథ్‌ల్యాబ్, ఐసీసీయూ అందుబాటులోకి వస్తే గుండె చికిత్స విభాగంలో మరికొన్ని సేవలందించవచ్చన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా సేవలు అందుబాటులోకి వస్తాయని, గుండె వైద్యనిపుణు డితో పాటు జనరల్ మెడిసిన్ విభాగం పోస్టు గ్రాడ్యుయేట్లు సేవలందిస్తారని తెలిపారు.

# పొలాల్లోనే మిరప రాశులు.. ధరతో దిగాలు



ఉరవకొండ: ఎండుమిరప ధర గణనీయంగా పడిపోయింది. కొనేవారు లేక మిరప రాశులు పొలాల్లోనే ఉంటున్నాయి. ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో హెచ్ఎల్‌సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువలతో పాటు బోర్లు, బావుల కింద సాగైన మిరప పంట చేతికి వస్తోంది. ఇప్పటికే సింహ భాగం కోతలు పూర్తయ్యాయి. బ్యాడిగ డబ్బీ రకం మిరప నెల క్రితం క్వింటాలు రూ.38వేలు పలుకగా.. ప్రస్తుతం రూ.16 వేలకు పడిపోయింది. ఇక విత్తన రకాల మిరప పంట ధర రూ.6వేల నుంచి రూ.9వేలు దాటడం లేదు. కనీసం బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకు పంట అమ్ముకుందామనుకున్నా కొనేవారు కరవయ్యారు. విత్తన రకాలను సంబంధిత కంపెనీలు ల్యాబ్‌కు పంపిన తరువాత అనుకూలంగా ఫలితం వస్తే అటుఇటుగా కొంటున్నాయి.

**నిల్వకు నానా తంటాలు** బ్యాడిగ డబ్బీ రకాలను క్వింటాలు రూ.20 వేలకైనా అమ్ముకుందామనుకుంటే అడిగేవారు లేరని రైతులు వాపోతున్నారు. దీంతో ఎక్కడికక్కడ మిరప రాశులు పొలాల్లో పేరుకుపోతున్నాయి. అవకాశం ఉన్న చోట చెట్ల కింద, దేరాల కింద నిల్వ ఉంచుకుంటున్నారు. మరోవైపు అకాల వర్షం పడుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మరికొందరు గిట్టుబాటు ధర లేక కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శీతల గోదాముల్లో నిల్వ ఉంచడానికి యత్నిస్తున్నారు. కొన్ని చోట్ల బస్తాకు రూ.250కు అద్దె చెల్లించాల్సి వస్తోంది. వాటిని తరలించడానికి బస్తాకు రూ.150 వరకు రవాణాకు వెచ్చిస్తున్నారు.

**దిక్కుతోచని స్థితిలో ఉన్నాం..**వెంకటరెడ్డి, పొలికి, విడపనకల్లు మండలం పది ఎకరాల్లో మిరప పెట్టాను. రూ.23 లక్షల వరకు పెట్టుబడి అయింది. పంట చేతికి వచ్చినా గిట్టుబాటు ధర లేదు. పంటను అమ్మితే పెట్టుబడి కూడా రాదు. ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప రైతులు గట్టెక్కే పరిస్థితి లేదు.

అనంత జిల్లాలో ఇలా..
సాగైన విస్తీర్ణం: 45వేల ఎకరాలు
మిరప రకాలు: బ్యాడిగ డబ్బీ, 273, 5531, తేజ, 2043
ఎకరాకు పెట్టుబడి: రూ.2.20 లక్షలు
మొత్తం దిగుబడి: 7.92 లక్షల క్వింటాళ్లు

# పాత బిల్లులు.. కొత్త దోపిడీ



చిత్తూరు : చంద్రగిరి మండలంలో గ్రావెల్ అక్రమ రవాణాకు కొందరు సరికొత్త పంథా ఎంచుకున్నారు. గతంలో పర్మిట్లు జారీ చేసిన సంస్థ పేరిట కొత్తవి ముద్రించుకుని యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఆపితే వాటిని చూపించి అనుమతులు ఉన్నాయని సమాధానమిస్తున్నారు. యాదమరి మండలంలో ఓ గ్రానైట్ క్వారీని వైకాపా హయాంలో ఆ పార్టీ కీలక నేత హస్తగతం చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పాత పర్మిట్లను కలర్ జిరాక్సులు తీయించి పట్టపగలే తమిళనాడుకు తరలించారు. ఆ కీలక ప్రజాప్రతినిధి ఏడు నెలల వ్యవధిలో దాదాపు రూ.4 కోట్లు చెల్లించకుండా దోపిడీకి పాల్పడ్డారు. వైకాపా హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీనరేజ్, పర్మిట్ల జారీని అస్మదీయుడైన తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారు. అప్పట్లో ఆన్‌లైన్ పర్మిట్లు కాకుండా సొంతంగా పర్మిట్లు ముద్రించి ఇచ్చి ఎడాపెడా అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వానికి సకాలంలో టెండర్ మొత్తం కూడా కట్టకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇళ్లు కట్టుకునేందుకు గ్రావెల్, జల్లి తీసుకుని వెళ్లే సామాన్యులనూ ఇబ్బంది పెట్టారు. ఫలితంగా గృహ నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతకాలం పర్మిట్ల జారీ నిలిపేసింది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు పాత తేదీలు, కలర్ జిరాక్సులతో పర్మిట్లు ముద్రించుకుని గ్రానైట్, గ్రావెల్‌అక్రమంగా రవాణా చేశారు. ఇప్పటికీ దందా కొనసాగిస్తున్నారు.

చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి, కుప్పంలో దందా..

ఎన్డీయే సర్కార్ చేతికి పాలనా పగ్గాలు అందాక సీనరేజ్, పర్మిట్లు జారీ చేసే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు వ్యతిరేకత మొదలైంది. ఈ నేపథ్యంలో కొంతకాలం పర్మిట్ల జారీని నిలిపేశారు. దీంతో అత్యధిక లీజుల కార్యకలాపాలు ఆగిపోయాయి. చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి, కుప్పం నియోజకవర్గాల్లో మాత్రం కొందరు అక్రమార్కులు ఎప్పటిలాగానే చెలరేగిపోయారు. వైకాపా హయాంలో నిలిచిన గ్రానైట్ క్వారీలపై పడ్డారు. రాళ్లను ఎటువంటి అనుమతులు లేకుండానే రవాణా చేశారు. చంద్రగిరిలో మాత్రం గ్రావెల్ తరలించారు. అధికారులు దాడులు చేసినప్పుడు పాత తేదీలతో సిద్ధం చేసుకున్న పర్మిట్లు చూపిస్తున్నారు. ఇలా కోట్లాది రూపాయల విలువైన ప్రకృతి సంపదను దోచుకోవడంతోపాటు ప్రభుత్వానికి పర్మిట్ ఫీజునూ ఎగ్గొడుతున్నారు. జగన్ పాలనలో గనుల శాఖ పూర్తిగా నిర్వీర్యమైంది. తెలుగుదేశం, జనసేన, భాజపా నాయకుల క్వారీలపై నాటి పాలకులు వికృత స్వారీ చేశారు. వైకాపాలోని 'పెద్దాయన', ఆయన కుమారుడి కనుసన్నల్లోనే అక్రమాలు జరిగాయి. మాట వినని ప్రత్యర్థి లీజుదారులపై దాడులు చేయించి రూ.50 కోట్లు– రూ.150 కోట్ల వరకు డిమాండ్ నోటీసులు పంపి వేధించారు. ఆ శాఖ ఉన్నతాధికారులతోపాటు జిల్లాలోని అధికార యంత్రాంగం మొత్తం అప్పట్లో చేతులెత్తేసింది. ఇదే సమయంలో సీనరేజ్, పర్మిట్ల జారీని గనుల శాఖ కాకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పరిధిలోకి వెళ్లింది. వైకాపా పెద్దలు విచ్చలవిడిగా అక్రమ రవాణా చేసినా ఆ క్వారీల దరిదాపుల్లోకీ వెళ్లలేదు. చిన్న చిన్న లీజుదారులు, మట్టి, గ్రావెల్ రవాణా చేసే సామాన్యులపై తమ ప్రతాపం చూపారు. ఈ సంస్థ సకాలంలో ప్రభుత్వానికి టెండర్ మొత్తం సైతం చెల్లించకుండా నిబంధనలకు తూట్లు పొడిచింది.

# అతివలకు ఆసరా.. వ్యాపారానికి భరోసా




విశాఖపట్నం : ఆటో నడపడం నుంచి అంతరిక్ష ప్రయాణం వరకు.. అనేక రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారు. పెళ్లి, పిల్లల పెంపకం, కుటుంబ పరిస్థితులు తదితర కారణాలతో వ్యాపార రంగంలోకి వెళ్తున్న మహిళల సంఖ్య తక్కువేనని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కేంద్రంగా పనిచేస్తున్న వాణిరావు మెమోరియల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో విభిన్న ఆలోచనలున్న యువత, మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు.

**మార్గనిర్దేశం.. పెట్టుబడి సహాయం**

1. కేంద్ర ప్రభుత్వానికి చెందిన టైడ్, నిధి ఏక్సలరేటర్, ఎంఎస్ఎంఈ, స్టార్టప్ ఇండియాతోపాటు వివిధ సంస్థల సహకారంతో మహిళల కోసం ప్రత్యేక ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నారు.
2. 2018 నుంచి ఇప్పటివరకు ఏడేళ్లలో ఈ కేంద్రం ద్వారా 180 అంకుర సంస్థలు ఏర్పాటయ్యాయి. అందులో 135కు పైగా మహిళలకు చెందినవే.
3. సహకారం అవసరమైన అభ్యర్థులకు 9 నెలల నుంచి రెండేళ్ల వరకు మార్గనిర్దేశం చేస్తారు.
4. పారిశ్రామికవేత్తలు, ఐఐఎం ప్రొఫెసర్లతో అవగాహన కార్యక్రమాలతోపాటు ప్రతి అభ్యర్థికి ప్రత్యేకంగా సలహాలు అందిస్తారు.
5. 'నారీప్రెన్యూర్ ఫర్ హెర్' కార్యక్రమంలో భాగంగా ఐఐఎంవీ ఫీల్డ్ సీఈవో గుహేశ్ రామనాథన్, సీనియర్ మేనేజర్ హర్ష వికాస్ ఆధ్వర్యంలో ఇటీవల 27 మంది అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు.
6. శిక్షణ పూర్తిచేసుకున్న అంకురాలకు కేంద్రం ప్రభుత్వంలోని వివిధ విభాగాల నుంచి నిధులు వస్తున్నాయి. కనీసం రూ.2 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెట్టుబడి సహాయం అందిస్తారు.

బలాలపై దృష్టి సారించా– శ్రుతి సాహిని, డిజీవోక్ మీడియా

నేను మాస్టర్స్, డిజిటల్ మార్కెటింగ్‌లో పీజీ చేశా. ఇంక్యుబేషన్ ప్రోగ్రాంలో చేరడానికి రెండేళ్ల క్రితం వ్యాపారం ప్రారంభించా. వ్యాపారాన్ని సరైన పద్ధతిలో ఎలా నిర్వహించాలో ఐఐఎంలో నిపుణులు, ప్రొఫెసర్లు వివరించారు. వ్యాపారం వృద్ధి చేసుకోవడానికి గల మార్గాలు, అన్ని రకాల సలహాలు అందించారు. నా బలాలను గుర్తించి.. వాటిపై మరింత దృష్టి సారించాను. తద్వారా ఏడాదిలో రెట్టింపు ఆదాయం పొందాను. మా సంస్థను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం. చిన్న సమస్య వచ్చినా సత్వరమే స్పందించి, పరిష్కారానికి మార్గాలు సూచించేవారు.

వ్యవస్థాపకురాలు–ఎండ కీర్తి, శ్రీతులసీరత్నం అగ్రోటెక్, శ్రీకాకుళం

పంట వ్యర్థాలతో ఉత్పత్తులు..: నేను ఎమ్మెస్సీ చదివా. మాది వ్యవసాయ కుటుంబం. పంట వ్యర్థాలను కాల్చకుండా పర్యావరణానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాం. 2023 నుంచి ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పంట వ్యర్థాలతో రాఖీలు, ప్లేట్లు, కప్పులు తయారుచేస్తున్నాం. గతేడాది అక్టోబరులో ఇంక్యుబేషన్ ప్రోగ్రాంకు ఎంపికయ్యా. వారి సలహాతో రాఖీలు తయారుచేసి విక్రయించాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉత్పత్తుల మార్కెటింగ్, విక్రయంపై కొత్త విషయాలు తెలుసుకున్నాం. వ్యాపారంలో రాణించడానికి సహకారం అందింది.

# అయిదేళ్లూ అధోగతి.. కూటమితో పురోగతి

బొబ్బిలి : జిల్లాలోని మార్కెట్ కమిటీల పరిధిలో అయిదేళ్లూ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పాలకవర్గాలు లేకపోవడం, నిధుల ఖర్చులపై ఆంక్షలు విధించడం, కొన్నిచోట్ల సొమ్ము ఇతర పనులకు మళ్లించడం తదితర కారణాలతో అభివృద్ధి కుంటుపడింది. కూటమి ప్రభుత్వ వచ్చాక ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి గల్లాపెట్టెలు నిండాయి. ఎనిమిది కమిటీల నుంచి వ్యవసాయ ఉత్పత్తులపై రూ.12.89 కోట్లు పన్నుల రూపంలో వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.10.47 కోట్లు సమకూరాయి. ఇప్పటికైనా ప్రగతి పరుగులు పెడుతుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్తవలస, పూసపాటిరేగ, మెరకముడిదాం కమిటీలు శతశాతం చేరుకున్నాయి. గజపతినగరం, రాజాం, విజయనగరం కాస్త వెనుకబడినా గతం కంటే మెరుగుపడ్డాయి. ఈ ఏడాది భారత ఆహార సంస్థ ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా.. ఆయా రుసుములు ఒక్కో కమిటీకి సుమారు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు చేరాల్సి ఉంది. ఈ లెక్కన మరో రూ.2.50 కోట్లు ఖాతాలకు చేరే అవకాశముంది. గతేడాది కంటే రూ.50 లక్షల పైచిలుకు ఆదాయాన్ని అర్జించాయి.



**చేపట్టాల్సిన పనులివీ..**

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ఇళ్లకు చేర్చుకునేందుకు లింకు రహదారులు అవసరం. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో కమిటీ పరిధిలో రూ.50 లక్షల చొప్పున నిధులతో ప్రతిపాదనలు పంపినా పైసా కూడా మంజూరు కాలేదు.

బొబ్బిలి, చీపురుపల్లి, రామభద్రపురం వంటి ప్రాంతాల్లో రైతు బజార్లు నిర్మించాలనుకున్నా ఆయా పనులు ముందుకు సాగలేదు.

8 మార్కెట్ కమిటీల పరిధిలో గోదాముల నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదించినా ప్రగతి లేదు. ఒక్కో కమిటీ పరిధిలో ఏడాదికి పాడి పశువులకు సంబంధించిన ఆరోగ్య శిబిరాలు నాలుగు నిర్వహించేవారు. అయిదేళ్లూ జరగలేదు. పాలకవర్గాల ఆమోదంతోనే.. ఈ ఏడాది గతంలో కంటే అదనంగా పన్నులు వసూలయ్యాయి. దీంతో మార్కెట్ కమిటీలు ఆర్థికంగా మరింత పరిపుష్టి చెందుతాయి. పాలకవర్గ సభ్యుల ఆమోదంతో ఈ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించుకోవచ్చు. రైతులకు మేలు కలిగే పనులు జరుగుతాయి. రైతు సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించే అవకాశముంది. రవికిరణ్, ఏడీ మార్కెటింగ్‌శాఖ, విజయనగరం

# 'చల్లని' విషం

కర్నూలు : ఎండ దెబ్బకు తాళలేక.. చెరకు.. పండ్ల రసాలు.. ఇతర పానీయాల్ని గటగటా తాగేస్తుంటాం.. చల్లదనం కోసం కాసిన్ని ఐస్ ముక్కలు అడిగి మరీ వేయించుకుంటాం.. అలా చేస్తే త్వరలోనే ఆసుపత్రికి వెళ్లడం ఖాయమంటున్నారు వైద్య నిపుణులు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడ చూసినా చల్లని పానీయాలు అమ్మే దుకాణాలు వెలిశాయి. ఇంటి నుంచి బయటకొచ్చిన వారిలో 25 శాతం మంది వీటిని తాగుతున్నారు. వీరిలో ఎక్కువ మంది చల్లదనం కోసం ఐస్ ముక్కలు వేసుకోనిదే ఆ పానీయాలను ముట్టడం లేదు. అయితే అపరిశుభ్ర వాతావరణంలో కలుషిత నీటితో చేసిన ఐస్‌ను శీతల పానీయాల్లో వినియోగించడంతో రోగాలపాలవడం తప్పదంటున్నారు వైద్యులు. **నిత్యం రూ.20 లక్షల వ్యాపారం**

ఐస్‌గడ్డల (క్యూబ్స్) తయారీ సీజనల్ వ్యాపారమే అయినా.. తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలున్నాయి. రెండు టన్నుల్లోపు ఐస్ తయారీకీ రూ.2–4 లక్షలు పెట్టుబడి, 2–3 టన్నులు రూ.5–6 లక్షలు, 4–5 టన్నులకైతే రూ.6–8 లక్షలు పెట్టి రెట్టింపు లాభాలు పొందుతున్నారు. నంద్యాలలో 15, ఆదోనిలో 6, ఎమ్మిగనూరు 2, కర్నూలులో 20–22, ఆళ్లగడ్డలో 3 వరకు ఐస్ తయారీ కర్మాగారాలు ఉన్నాయి. 10–18 కిలోల ఐస్ గడ్డలను రూ.120–160, 40–50 కిలోలవి రూ.300–450 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రూ.18–20 లక్షల వ్యాపారం జరుగుతోందని అంచనా.

పరిశ్రమల శాఖ, స్థానికంగా ట్రేడ్ లైసెన్సు, కాలుష్య నియంత్ర బోర్డు, విద్యుత్తు శాఖ ద్వారా వాణిజ్య విద్యుత్తు కనెక్షన్, భవనానికి సంబంధించి పురపాలక పట్టణ ప్రణాళిక, అగ్ని మాపక శాఖల నుంచి అనుమతులుండాలి.. ఏ ఒక్కరూ ఆయా అనుమతులు తీసుకోవడం లేదు. చాలా వరకు ఇళ్ల మధ్య, రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో ఐస్ తయారీ

సాధారణంగా మార్కెట్లో రెండు రకాల ఐస్ దొరుకుతుంది. మొదటిది పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించేది (కమర్షియల్). రెండోది ఎడిబుల్ (తినదగినది). మొదటి రకం.. చేపలు, మాంసాన్ని ఎక్కువ రోజులపాటు నిల్వ ఉంచేందుకు పండ్లు ఇతర వస్తువులు ఎగుమతి చేసేందుకు, ఆసుపత్రుల్లోని మార్చురీల్లో వినియోగిస్తారు. దీన్ని ఏ నీటితోనైనా ఎలాంటి ప్రదేశాల్లోనైనా తయారు చేయొచ్చు.

రెండో రకం.. దీన్ని కచ్చితంగా శుద్ధి చేసిన నీటితో, పరిశుభ్రమైన వాతావరణంలోనే తయారు చేయాలి. దీన్ని పానీయాల్లో వాడితే ఎలాంటి ప్రమాదమూ ఉండదు. రెండో రకం ఐస్‌కు ధర ఎక్కువగా ఉండటంతో చల్లని పానీయాలు విక్రయించే వ్యాపారులు తక్కువ ధరకు దొరికే మొదటి రకం ఐస్‌ను వాడుతున్నారు. " ఐస్ తయారీకి వినియోగించే నీటిలో టీడీఎస్ 50–150 వరకు ఉండాలి.. 250 వరకు ఉన్నా వినియోగించొచ్చు. పీపీఎం 300పైన ఉండాలి.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటా మని" ఆహార భద్రతా అధికారి కూర్మనాయకులు పేర్కొన్నారు. ఐస్ క్యూబ్స్ (అచ్చులు) తయారీకి ఇనుప రేకు డబ్బాలు వినియోగిస్తున్నారు. ఇవి తుప్పు పట్టి.. చిన్నచిన్న ముక్కలు ఊడిపోతు న్నాయి. అవి అందులోనే కలిసిపోతున్నాయి. రవాణాలో కచ్చితంగా నైలాన్ సంచులు వాడాలి. కానీ గోనె పట్టాలు, వరి పొట్టు కప్పి తరలిస్తున్నారు.

**రోగాలు కొని తెచ్చుకోవద్దు**–డాక్టర్ శంకర్‌శర్మ, విశ్రాంత ప్రొఫెసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, నాణ్యత లేని ఐస్‌ను వాడటం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా గొంతు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, దగ్గు బారినపడే ప్రమాదముంది. చిన్నపిల్లలకు గవద బిళ్లల వ్యాధి వచ్చే ప్రమాదముంది.

రోటా, అడినో, హెపటైటిస్–ఏ వంటి వైరస్‌ల వల్ల ఊపిరితిత్తులు, పచ్చకామెర్లు సంభవిస్తాయి. ఈ–కోలీ, సిగెల్లా వంటి బ్యాక్టీరియాల వల్ల వాంతులు, విరేచనాలు అవుతాయి.

# విలువైన స్థలం.. ఆక్రమణల పర్వం

గుంతకల్లు : గుంతకల్లులో రైతుల భూములకు మున్సిపాలిటీ డబ్బు చెల్లించి ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం కోసం సేకరించిన స్థలం కబ్జా కోరల్లో చిక్కుకుంది. స్థలం విలువ మార్కెట్లో రూ.కోట్లు పలుకుతోంది. మున్సిపాలిటీ పట్టణ శివారులో, గుంతకల్లు కొట్టాలకు సమీపంలో రైతుల నుంచి 435 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇందులో 305 ఎకరాల విస్తీర్ణంలో రెండు ట్యాంకులు నిర్మించారు. మిగిలిన 130 ఎకరాల్లో ముస్లింల శ్మశానవాటిక కోసం రెండు ఎకరాలు, మురుగు నీటిని శుభ్రం చేసే ప్లాంట్ ఏర్పాటుకు స్థలం ఇచ్చిన రైతుకు మరో రెండు ఎకరాలు కేటాయించారు. ఇక మిగిలిన 126 ఎకరాల స్థలం మిగిలి ఉంది. ఈ స్థలంలో కొందరు చొరబడి ప్లాట్లుగా విభజించి ఇతరులకు అమ్ముకునేందుకు తెరవెనక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు అమ్ముకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై తెదేపా నాయకుడు చంద్రశేఖర్ మున్సిపల్



అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయడాని కి జిల్లా నుంచి సర్వేయర్లను పంపాలంటూ మున్సిపల్ అధ్యక్షురాలు వారం రోజుల కిందట జిల్లా కలెక్టరుకు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ స్థలానికి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయడానికి రెండేళ్ల కిందట రూ.10 లక్షలు కేటాయించారు. పనులు ఇప్పటికీ జరగలేదు.

**పరిశీలించి తగిన చర్యలు చేపడతాం**

నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్

ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించి మిగిలిపోయిన స్థలాన్ని ఎవరైనా ఆక్రమించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. సమగ్ర సర్వే చేయాలని జిల్లా అధికారులను కోరాం. సర్వే సందర్భంగా ఎవరైనా స్థలాలను అమ్మినట్లు, భవనాలను నిర్మించినట్లు గుర్తిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

# ట'మాటా' పడిపోయేలా!

పలమనేరు: టమాటా ధరలు ఎప్పుడెలా ఉంటాయో చెప్పలేకపోతున్నారు. తోట నుంచి మార్కెట్కు వచ్చే సరికి మారుతుండటంతో రైతులు ధరల వైకుంఠపాళిలో చిక్కి అల్లాడుతున్నారు. మూడు రోజులుగా 15 కిలోల టమాటా పెట్టె రూ.300 పలికితే శుక్రవారం రూ.130కు పడిపోయింది. రోజు వ్యవధిలో ధరలు సగానికి తగ్గడంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం ప్రాంతంలో పంట లేదు. అక్కడికి ప్రభుత్వం టమాటాను కొని మార్కెట్ కమిటీల ద్వారా పంపాలని నిర్ణయించింది. అయితే మార్కెట్ కమిటీ అధికారులు రైతుల నుంచి కాకుండా వ్యాపారుల నుంచి కొంటున్నారు. వ్యాపారులు రైతుల నుంచి కొని



కమిటీలకు ఇస్తున్నారు. ఫలితంగా వ్యాపారులు నిర్ణయించిన ధరే రైతులకు దక్కుతోంది. ఇక్కడి నుంచి నాలుగైదు రోజులుగా 4 నుంచి 5 లోడ్ల టమాటాను పంపారు.అక్కడి ధరలే ఇక్కడా.. ఇక్కడి వ్యాపారులు కర్ణాటక మార్కెట్ను అనుసరించి ధరలను నిర్ణయిస్తుంటారు. కర్ణాటకలోని నంగలిలో ఉదయం 8 గంటలకు మార్కెట్ మొదలవుతుంది. తర్వాత పుంగనూరు, పలమనేరు మార్కెట్లలో వేలం ప్రారంభిస్తారు. దీంతో అక్కడి ధరలే ఇక్కడా పలుకుతున్నాయి. నిలకడగా ధరలు లేకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నామని రైతులు వాపోతున్నారు.

# ఉపాధి ముంగిట.. శ్రమజీవికి ఊరట

పుత్తూరు : ఎండల తీవ్రత పెరుగుతున్న వేళ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో రక్షణ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఉపాధి పథకంలో వాటర్ బెల్ విధానం అమలు చేయడంతో పాటు కూలీలు గంటకోసారి నీళ్లు తాగేలా పని ప్రదేశంలో ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నీడ నిచ్చే షెడ్లు, అవి లేకపోతే పందిర్లు వేయాలని సూచించారు.

**వైకాపా పాలనలో కనీస వసతులు కరవే..**

తెదేపా 2014-19 హయాంలో కూలీలకు మంచినీటికి అలవెన్స్ ఇచ్చారు. మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కూలీల నీడ కోసం టెంట్లు సరఫరా చేశారు. వారికి గడ్డపారలు అందించారు. కూలీలకు మెరుగైన వేతనం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. గ్రామం నుంచి దూరంగా వెళ్లి పనులు చేసేవారికి రవాణా భత్యం ఇచ్చారు. 2019-2024 వరకు వైకాపా పాలనలో ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించలేదు. మంచినీరు సైతం ఇవ్వలేదు. ఎండల రక్షణకు నీడ కూడా లేకుండా చేశారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స పెట్టెలు ఇవ్వలేదు. దీంతో కూలీలు, మేట్లు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుతం మళ్లీ ఉపాధి హామీ కూలీలకు రక్షణ చర్యలకు చర్యలు చేపడుతోంది. మరో 20 రోజుల్లో వ్యవసాయ పనులు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ రెండో వారం నుంచి కూలీ సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

చిత్తూరు జిల్లాలో జాబ్కార్డులు : 2.67 లక్షలు

ఉపాధి పొందుతున్న కూలీలు : 4.7 లక్షల మంది

తిరుపతి జిల్లాలో జాబ్కార్డులు : 2.47 లక్షలు

ఉపాధి పొందుతున్న కూలీలు : 1.72 లక్షల మంది

# నదులకు పునరుజ్జీవం వచ్చేనా?



రాయదుర్గం : శతాబ్దాలుగా వర్షాభావ పరిస్థితులు, యథేచ్ఛగా ఇసుక తరలింపుతో చుక్కనీరు లేక ఉనికి కోల్పోయిన వేదవతి, హగరి నదుల పునరుజ్జీవానికి గత తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నదుల్లో సబ్సర్ఫేస్ డ్యాంల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసింది. మొత్తం నాలుగుచోట్ల వీటిని నిర్మించాల్సి ఉండగా.. ఒకచోట మాత్రమే పూర్తి చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సబ్సర్ఫేస్ డ్యాంల నిర్మాణాలను గాలికొదిలేసింది. ఫలితంగా వేదవతి, హగరి నదులు బోసిపోయి ఏడారిని తలపిస్తున్నాయి. అడ్డుకట్టలతో భూగర్భజలాల వృద్ధి: నదుల్లో పారే నీటికి అడ్డుకట్టలు కట్టడం ద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెంది వ్యవసాయ బోర్లు, తాగునీటి పథకాలకు సమృద్ధిగా నీరు లభిస్తుంది. జుంజురాంపల్లి వద్ద నిర్మించిన సబ్సర్ఫేస్ డ్యాంతో ఈ విషయం రుజువయ్యింది. మలకాపురం గ్రామానికి చెందిన రైతుల బోర్లలో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో పుష్కలంగా నీరుండటంతో ఏడాదికి మూడు పంటలు పండిస్తుండటం విశేషం.

**రూ.16.09 కోట్లు మంజూరు**

వేదవతి, హగరి నదుల పునరుజ్జీవానికి 2014లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, వాటర్ మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ను బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూర్ తదితర ప్రాంతాల్లోని ఇసుక దిబ్బలు, భూపసముద్రం వద్ద ఉన్న వేదవతి నదిని చూపించారు. ఆయన సూచనల మేరకు రెండు నదుల్లో పరీక్షలు జరిపి సబ్సర్ఫేస్ డ్యామ్ల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.16.09 కోట్లు మంజూరు చేసింది. జుంజురాంపల్లి సబ్ సర్ఫేస్డ్యామ్ నిర్మాణానికి రూ.5.50 లక్షలు, భూపసముద్రం రూ.89 లక్షలు, కెంచానల్లి రూ.7 కోట్లు, హగరిలో కూడ్లూరు వద్ద నిర్మాణానికి రూ.2.9 కోట్లు మంజూరు చేసింది. వాటిలో జంజురాంపల్లి ద్ద మాత్రమే నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారటంతో మిగిలిన చోట్ల నిర్మాణాలు ఆగిపోయాయి.

**ఎలా చేస్తారంటే..**

నదీ గర్భంలో 12 మీటర్ల లోతుకు ఇసుక లేదా మట్టిని తొలగిస్తారు. నదుల మధ్యలో ఇంకా ఎక్కువ లోతుకు తీయాల్సి ఉంటుంది. ఆ తర్వాత చెరువుల్లోని బంక మట్టిని వేస్తూ పైదాకా రోలింగ్ చేస్తారు. దాంతో వరదనీరు, ఇసుక కిందికి కొట్టుకుపోకుండా అరికట్టవచ్చు. తద్వారా భూగర్భజలాలు పెరుగుతాయి. నీటి ఆవిరి ఉండదు. వీటి నిర్మాణానికి భూసేకరణ సమస్యలు తలెత్తవు.

రెండుచోట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

బలరాముడు, డీఈ, చిన్న నీటిపారుదల శాఖ, రాయదుర్గం

వేదవతి నదిలో కెంచానపల్లి, భూపసముద్రం వద్ద రెండు సబ్సర్ఫేస్ డ్యాంల నిర్మాణాలకు భూగర్భ జలవనరుల శాఖ(గ్రౌండ్ వాటర్) అధికారులకు నివేదిక కోరాము. వారు ఇవ్వగానే అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడతాం. ఆ తర్వాత హగరి నదిలో నిర్మాణాలను పరిశీలిస్తాం.

# అధికారుల నిర్లక్ష్యం.. అసంపూర్తి వారధే సాక్ష్యం



రాయదుర్గం : అనంత నగర శివారులోని రాప్తాడు వద్ద నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను టెండర్ల పేరుతో కాలయాపన జరుగుతోంది. 42, 44 నంబర్ల జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ 2017-18 సంవత్సరంలో రైల్వేవంతెన పనులు ఆరంభమయ్యాయి. ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. వంతెన పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయి. అప్పట్లో తమిళనాడుకు చెందిన ఓ గుత్తేదారు సంస్థ టెండరు దక్కించుకొని పనులు చేపట్టింది. 2019-20లో వంతెన పనులు ఆగిపోయాయి. గుత్తేదారుడు పనులు చేపట్టకుండా వెళ్లిపోయాడు. వైకాపా ప్రభుత్వం వంతెన గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైల్వే వంతెనపై దృష్టి సారించింది. కేంద్రం రూ.18 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో సుమారు 6 నెలల కిందట టెండర్లు నిర్వహించారు. ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి.

**చిన్న పనులపై అలసత్వం**

వంతెనకు ఇరువైపులా రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయి. వంతెనపై కంకర వేసి వదిలేశారు. తారురోడ్డు నిర్మించాల్సి ఉంది. కందుకూరు రోడ్డు వద్ద కొంత మేర రహదారి, వంతెన పక్కన సర్వీసురోడ్డు, ఇతరత్రా చిన్నచిన్న పనులు చేపట్టాలి. ఈ పనులు పూర్తి చేయడానికి టెండర్లు నిర్వహించారు. కాని అనుమతులు ఇవ్వలేదు.

**వాహనదారుల ఇక్కట్లు**

ఈ మార్గంలో నిత్యం రైళ్లు వెళ్తుంటాయి. ఆ సమయంలో గేటు మూసినప్పుడు వాహనాలు పెద్ద సంఖ్యలో ఆగిపోతాయి. కందుకూరు రోడ్డు సమీపంలో ఈ బైపాస్ రోడ్డు గుంతలమయంగా మారింది. వంతెన కింద రహదారిపై కూడా గుంతలు పడ్డాయి. వాహనదారులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**అనుమతి రాగానే పునఃప్రారంభిస్తాం**

సుధాకర్రెడ్డి, ఈఈ, జాతీయరహదారులశాఖ

పాత టెండరు రద్దు చేశాం. ఆ గుత్తేదారునికి ఆర్థిక లావాదేవీల సమస్య పరిష్కరించాల్సి ఉంది. కొత్త టెండర్లు పూర్తయ్యాయి. అనుమతి కోసం కేంద్రానికి పంపించాం. అనుమతి రాగానే మళ్లీ పనులు ప్రారంభిస్తాం.

# హంద్రీనీవా.. చెరువులు నిండవా?



పెనుకొండ : కరవు జిల్లాకు వర ప్రదాయిని హంద్రీనీవా కాలువ. అయితే గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా కాలువ అధ్వానంగా మారింది. గొల్లపల్లి జలాశయం నుంచి పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి మండలాల ద్వారా హిందూపురం, లేపాక్షి మండలాల మీదుగా మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అగలి, రొళ్ల, గుడిబండ, అమరాపురం తదితర మండలాల వరకు కాలువ పొడవు 171 కిలో మీటర్లు వ్యాపించి ఉంది. ఈ కాలువ వెంబడి ఇరువైపులా ముళ్లకంప చెట్లు, జమ్ము, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. కాలువ నిండా నీటి సరఫరా కొనసాగుతుండటంతో గట్లు బలహీనంగా మారి నీటి లీకేజీలతో ప్రవాహం సక్రమంగా ముందుకు సాగడం లేదు.

**తవ్విన మట్టితోనే గట్లు..**కాలువ తవ్వకాలతో వచ్చిన మట్టితోనే ఇరువైపులా గట్లుగా వేయడంతో ఆ మట్టి నాణ్యత లేక, పూర్తిస్థాయి నీటిమట్టం ప్రవాహంతో కాలువ కోతలకు గురవుతోంది. గతంలో పెనుకొండ మండలం కోనాపురం, హరిపురం వద్ద మూడు సార్లు, సోమందేపల్లి మండలం పందిపర్తి, మంచేపల్లి వద్ద పలుమార్లు, గత మంగళవారం సోమందేపల్లి సమీపంలో గండి పడి 20 ఎకరాల వరకు వరి పొలాల్లోకి నీరు చేరాయి.

**లక్ష్యం 265..:** పెనుకొండ మండలంలోని గొల్లపల్లి జలాశయం నుంచి పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని 265 చెరువులను కృష్ణా జలాలతో నింపాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటివరకు మూడు నియోజకవర్గాల్లో కేవలం 40 చెరువులను నింపడమే గగనమైపోతోంది. మొత్తం 42 వేల ఎకరాలను ఈ కృష్ణా జలాలతో రైతుల పొలాలు సస్యశ్యామలం చేయాలనే లక్ష్యం ఎంతో ఘనంగా ఉన్నా.. ఆచరణ మాత్రం అంతంత మాత్రంగానే మారుతోంది. ప్రస్తుతం సోమందేపల్లి మండలంలో 13 చెరువులు, పెనుకొండ-3, రొద్దం మండలం-3 చెరువులు జలాలతో నిండగా.. హిందూపురం మండలంలో 5 చెరువులు సగం మేర నింపడం గమనార్హం. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి హంద్రీనీవా కాలువలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాంరామసుబ్బయ్య, డీఈ, హెచ్ఎన్ఎస్ఎస్, పెనుకొండ

హంద్రీనీవా కాలువ పటిష్ఠత కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ముళ్లకంప పెరిగిపోవడంతో గట్లు బలహీనంగా మారుతున్నాయి. 15 రోజుల్లో జలాల సరఫరా ఆగిపోనుంది. నిధులు విడుదలైన వెంటనే కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నాం.

# విశాఖ తీరాన.. అగ్రరాజ్య సేన

విశాఖపట్నం: ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రతకు దిక్సూచిగా భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న 'టైగర్ ట్రయాంఫ్-2025' విన్యాసాల్లో అమెరికా యుద్ధ నౌకలు విశాఖ తీరానికి వచ్చాయి. ఈ నెల ఏడో తేదీ వరకూ హార్బర్ ఫేజ్ విన్యాసాలు ఉంటాయి. శుక్రవారం అమెరికా యుద్ధ నౌకల సందర్శనకు వివిధ రంగాల ప్రతినిధులను అనుమతించారు. విశాఖ పోర్టు వద్ద అగ్రరాజ్యానికి చెందిన యూఎస్ఎస్-కంస్టాక్తో పాటు యూఎస్ఎస్ రాల్ఫ్ జాన్సన్ -144 నౌకల ప్రత్యేకతలను కమాండర్లు బైరాన్స్టాక్స్, జాక్ సీజర్ వివరించారు. అవి ఏవిధంగా పనిచేస్తాయి, గతంలో అందించిన సేవల గురించి విశదీకరించారు. ఆయా నౌకల్లో నేవిగేషన్, రాడార్ వ్యవస్థ, కెప్టెన్ ఛాంబర్, క్యాంటీన్, వసతిగదులు, యుద్ధ విభాగాలపై సమగ్రంగా వివరించారు. మరో వైపు ఈఎన్సీలో ఇరు దేశాల ప్రతినిధులు పలు



అంశాలపై చర్చించారు.కంస్టాక్ నౌక యుద్ధ సమయంలోనే కాకుండా విపత్తుల సమయంలో ఎలా సహాయ కార్యక్రమాలు చేపడుతుందో వివరించారు. ఈ నౌకలో భారీ హొవర్క్రాఫ్ట్లు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ హెలికాప్టర్ల నిర్వహణ ఎలా ఉంటుందో పేర్కొన్నారు. అత్యాధునిక ఆయుధాలను వినియోగించి శత్రువులను ఎలా ఎదుర్కొంటారో ఓ నమూనా ప్రదర్శనలో చూపించారు. సుదూర లక్ష్యాల మీద దాడి చేసే లాంచర్లు గురించి వివరించారు. అమెరికా నౌకాదళంలో రాల్ఫ్ జాన్సన్-144కు విధ్వంసకర యుద్ధ నౌకగా పేరుంది. సముద్రం, వాయుమార్గం, భూభాగంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులను కలిగుండడం దీని ప్రత్యేకతగా పేర్కొన్నారు.

# తీర్మానమా..? ప్రతిపాదనా?

భీమిలి : జీవీఎంసీ మేయర్ హరి వెంకట కుమారిపై కూటమి నాయకులు అవిశ్వాసం నోటీసు అందజేసిన తర్వాత... ఈనెల 19న ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి కలెక్టర్ హరేంధిరప్రసాద్ పేరిట జీవీఎంసీ కార్పొరేటర్లకు నోటీసులు అందాయి. ఆ నోటీసుల్లో... "మహా విశాఖ నగర పాలక సంస్థ, కౌన్సిల్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తుంది" అని రాయడంతో పాటు, తీర్మానంగా పేర్కొన్నారు. మేయర్పై అవిశ్వాసం ప్రకటించిన నేపథ్యంలో...ఆ అంశంపై చర్చించడానికి వీలుగా నోటీసులో చర్చనీయాంశంగా మాత్రమే పేర్కొనాల్సి ఉండగా, నేరుగా తీర్మానం అంటూ ముద్రించడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రత్యేక అవిశ్వాస సమావేశానికి 74 మంది కార్పొరేటర్లు హాజరై, వారి అభిప్రాయాన్ని మేయర్కు వ్యతిరేకంగా చెబితే, అప్పుడు కలెక్టర్ ప్రత్యేకాధికారి



హొదాలో తీర్మానం చేయాల్సి ఉంటుంది. అప్పటి వరకు మేయర్పై అవిశ్వాస ప్రతిపాదన లేక చర్చనీయాంశంగా మాత్రమే నోటీసులో పేర్కొనాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ తీర్మానం అనే పదం ఉపయోగించకూడదని నిపుణులు చెబుతున్నారు.

భీమిలిలో తెదేపా కార్పొరేటర్లు...?: మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధి తెదేపా కార్పొరేటర్లకు భీమిలిలో క్యాంపు ఏర్పాటు చేసినట్టి సమాచారం. అవిశ్వాసం నేపథ్యంలో వారిని విదేశాలకు తీసుకెళ్లేందుకు పాస్పోర్టులు సేకరించిన నాయకులు, తదనంతర పరిణామాలతో భీమిలిలోనే క్యాంపు నిర్వహిస్తున్నారు. తెదేపాతో పాటు, వైకాపా నుంచి తెదేపాలో చేరిన వారు భీమిలి వెళ్లారు. నగరానికి దగ్గరగా ఉండటంతో... రోజూ సాయంత్రం ఇళ్లకు చేరుకుని, సొంత పనులు చూసుకుని తిరిగి భీమిలి వెళ్లేలా నిర్ణయించారు.

# అంత యూరియా.. అవసరం లేదయా!

అనకాపల్లి : దేశవ్యాప్తంగా 2023-24లో ఎకరా పొలానికి సగటున 56 కేజీల యూరియా వాడారు. ఇదే అనకాపల్లి జిల్లా వరకు చూస్తే దాదాపు మూడురెట్లు ఎక్కువగా 145 కేజీలు వాడారని తేలింది. అన్నదాతలు అవగాహన లోపంతో పరిమితికి మించి మోతాదులో నత్రజన ఎరువు వాడుతుండటం వారికి పెట్టుబడుల భారం పెంచుతోంది. ఇది భూమి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.

జిల్లాలో రబీలో 15,662 హెక్టార్లు, ఖరీఫ్లో 85,857 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో ప్రకృతి వ్యవసాయం 22 వేల హెక్టార్లలో చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నా వాస్తవానికి చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు అవుతుంది. చాలామంది రైతులు కషాయాలతోపాటు అప్పుడప్పుడు యూరియా వినియోగిస్తున్నారు. నత్రజని అధికంగా ఉపయోగిస్తే పంట విపరీతంగా పెరిగి.. చిన్న గాలి వీచినా పడిపోతుందని శాస్త్రవేత్త డాక్టరు ఉమామహేశ్వరరావు తెలిపారు. పూతకు ఆలస్యంగా వస్తుందని దీనివల్ల పంట కాలం పెరుతుందన్నారు. తాలు గింజలు పెరుగుతాయని తెలిపారు. చీడపీడలు సులభంగా సోకుతాయన్నారు. ఫలితంగా దిగుబడులు తగ్గిపోతాయని వివరించారు. జీవన ఎరువులైన అజోల్లా, అజటోబాక్టర్, రైజోబియం వంటి వాటిని వేయడం ద్వారా యూరియా వాడకం తగ్గించవచ్చని తెలిపారు.

జిల్లాలో అన్ని పంటల కంటే ఎక్కువగా సాగు చేసేది వరి. దీని తర్వాత చెరకు. వరి పంటకు ఎకరాకు 69 కేజీలు యూరియా వేయాల్సి ఉండగా 145 కేజీలు వేస్తున్నారు. చెరకు పంటకు 97 కేజీలకు 219 కేజీలు వేస్తున్నారు. భూసారానికి అనువుగా ఎరువులు... రైతులు భూసార పరీక్షలను పరిగణనలోకి తీసుకోకుండా ఎరువులు వినియోగిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా పంటలకు పురుగులు, తెగుళు త్వరగా సోకి దిగుబడులు తగ్గిపోతాయి. సేంద్రియ ఎరువులు ఎకరాకు టన్నుకు మించి వేయడం లేదు. భూసార పరీక్షల ఫలితాల్లో భూమిలో సహజంగా లభించే పోషకాల స్థాయి తెలుస్తుంది. దాన్ని బట్టి ఎంత మోతాదులో నత్రజని, భాస్వరం, పొటాషియం వేసుకోవాలో తెలుస్తుంది.

జి.ప్రసాద్, జిల్లా భూసార పరీక్ష కేంద్రం అధికారి

## కేరళ తరహాలో విహరిద్దామా!

బాపట్ల : కాలువలు..వాగుల్లో మడ అడవుల మధ్య పర్యాటకులు ప్రకృతి రమణీయ దృశ్యాలు తిలకిస్తూ పడవల్లో విహరించే ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చనుంది. జిల్లాలో పర్యాటక రంగాభివృద్ధికి కీలకమైన దీని సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను జలవనరుల శాఖ రూపొందించింది. బాపట్లలో పర్యటించిన పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌కు పీపీటీ ద్వారా ప్రాజెక్టు వివరాలను జిల్లా కలెక్టర్ వెంకటమురళి వివరించారు. పర్యాటకాభివృద్ధి సంస ద్వారా కేరళలోని అలెప్పి తరహాలో పర్యాటకుల కోసం పడవలు నడపాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కేరళ తరహాలో బాపట్ల, కర్లపాలెం, నిజాంపట్నం, రేపల్లె మండలాల తీర ప్రాంతంలో సముద్రం నుంచి వెనక్కి వచ్చే జలాల్లో పడవల విహారానికి అనుకూలంగా ఉన్నాయి. తీరంలో వాగులు, కాలువల్లో పడవల విహారం ప్రాజెక్టు చేపట్టటం ద్వారా ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించటానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ వెంకటమురళి భావిస్తున్నారు.

**మడ అడవులు సందర్శించే అవకాశం :** బాపట్ల మండలం ఆదర్శనగర్ వద్ద పడవ ప్రారంభమై నల్లమడ వాగు సముద్రంలో కలిసే పొగురు వద్ద ఇసుక తిన్నెల్లో ఆగేలా ల్యాండింగ్ పాయింట్ ప్రతిపాదించారు. పర్యాటకులు నల్లమడ వాగు సంగమం, చుట్టూ మూడు వైపుల నీరు, ఓ వైపు భూమి ఉండే ద్వీపకల్ప ప్రాంతం, పక్షులను సందర్శించేలా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఉప్పుటేరులో మరలా పడవ ప్రారంభమై కర్లపాలెం మండలం తుమ్మలపల్లి రామాలయం సమీపంలో రెండో ల్యాడింగ్ పాయింట్‌కు చేరుకుంటుంది. ఇసుక తిన్నెలు, మడ అడవుల అందాలు తిలకిస్తారు. కొద్దిసేపు తర్వాత పడవలో ముందుకు



సాగుతూ తూర్పు తుంగభద్ర కాలువలోకి ప్రవేశించి నిజాంపట్నం హార్బర్‌కు 1.5 కి.మీ. దూరంలో చివరి ల్యాండ్ పాయింట్‌కు చేరుకుంటుంది. హార్బర్, మడ అడవుల సందర్శన తర్వాత పడవ వచ్చిన మార్గంలో వెనుదిరిగి తిరిగి ఆదర్శనగర్ చేరుకోవడంతో విహారం ముగుస్తుంది.

**అతి త్వరలో ప్రారంభం**

పడవల్లో విహారానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించి పీపీటీ ద్వారా పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌కు వివరించి అన్ని వివరాలు అందజేశాం. తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తాం. పడవల్లో విహారం అతి త్వరలో ప్రారంభమై పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది.వెంకటమురళి, కలెక్టర్

పడవల విహార మార్గం

పేరలి కాలువ(4కి.మీ.)- నల్లమడ వాగు(1.5 కి.మీ.)- ఉప్పుటేరు(12.2 కి.మీ.)- తూర్పు తుంగభద్ర కాలువ (0.65 కి.మీ.)

విహారం ప్రాజెక్టు దూరం: 18.37 కి.మీ.

కాలువల్లో కనీస లోతు: 1.65 మీ. నుంచి 3.14 మీ.

మొత్తం ల్యాడింగ్ పాయింట్లు: నాలుగు

ఏడాదిలో నీరు ఉండే రోజులు: 330


## రుయాలో మార్పు.. సేవల కూర్పు

తిరుపతి : 'అత్యవసర విభాగంలో పాడైన పడకలు.. ఉతకని బెడ్‌షీట్లు, కర్టెన్లు.. వినియోగానికి పనికిరాని మరుగుదొడ్లు.. విభాగాల్లో తగినంత వెలుతురు లేక గుహలాంటి వాతావరణం.. పనిచేయని పంకాలు, ఏసీలు.. కూర్చోవడానికి వీలుకాని బెంచీలు.. దారికి అడ్డంగా పాత పరికరాలు, వస్తువులు.. సినిమా పోస్టర్లను మించిన సూచిక బోర్డులు.. ఉరుస్తున్న పైకప్పులు.. ఇలాంటి సౌకర్యాలా రోగులకు కల్పించేదంటూ గతనెల 14న రుయాలో పర్యటించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో యంత్రాంగంలో కదలిక మొదలైంది. రుయాలో అత్యవసర సేవల్లో లోటుపాట్లు, ప్రభుత్వ సర్వేలో రుయా పనితీరుపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ ఆసుపత్రిలో పర్యటించి కీలక మార్పులకు ఆదేశాలిచ్చారు.

**అవినీతి.. అపరిశుభ్రతపై ఏదీ నిఘా?**

నర్సులు సైతం వచ్చామా.. వెళ్లామా.. అన్న ధోరణి మార్చుకోవాల్సి ఉంది. 120 మంది పారిశుద్ధ్య కార్మికులకుగాను 89 మంది మాత్రమే విధులకు హాజరు కావడంపై గత పర్యటనలో కలెక్టర్ నిలదీశారు. అప్పుడప్పుడు మరుగుదొడ్ల శుభ్రం చేయడం కాకుండా నిరంతరం కొనసాగేలా వ్యవస్థను మెరుగుపరచాల్సి ఉంది.

**నిధులు.. సిబ్బంది అవసరం**



ఆసుపత్రికి మరింతమంది సిబ్బంది.. నిధులు అవసరం. 760 పడకల సామర్థ్యం ఉన్నప్పుడు 50 మంది నర్సింగ్ ఆర్డర్లీలను నియమించగా ప్రస్తుతం 1260 పడకలకు చేరిన నేపథ్యంలో వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లు తగినన్ని లేక సిబ్బంది అందుబాటులో లేక రోగులు వారి సహాయకులు అవస్థలు పడాల్సి వస్తోంది.

**మరోచోటుకు జనరల్ మెడిసిన్ ఓపీ**

రెండు చిన్న గదుల్లో 12 మంది వైద్యులు.. సరాసరి 300 మంది రోగులకు జనరల్ మెడిసిన్ ఓపీ నిర్వహిస్తుండగా దాన్ని జిరియాట్రిక్ వార్డులోకి మార్చారు. సమాచార బోర్డులు అందరికీ కనిపించేలా లోపల, బయట ఏర్పాటు చేశారు. ఓపీ, వార్డుల్లో ఆరోగ్య సంబంధిత వీడియోలు ప్రసారం చేస్తున్నారు. ఆస్తమా రోగులు వరండాలో కూర్చుని నెబ్యులైజర్ తీసుకునే సదుపాయం కల్పించారు. ఓపీ కారిడార్‌లో మరిన్ని ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేసి వెలుతురు పెంచారు.

**అత్యవసరం.. ఆధునికీకరణ**

ఆరోగ్యశ్రీ, హెచ్‌డీఎస్ నిధులతో అత్యవసర విభాగంలో పాడైన పడకల స్థానంలో 20 ఐసీయూ పడకలు ఏర్పాటు చేశారు. మూడు ప్రాంతాల్లో వైద్యులు పెద్ద టేబుళ్ల మధ్య కూర్చునే విధానాన్ని మార్చి రోగులకు ఎక్కువ స్థలం కేటాయించారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. మందులు నిరంతరం ఉండేలా నూతన డెస్క్ ఏర్పాటుచేశారు. సూదిమందులు వేసేందుకు కొత్త వ్యవస్థను నెలకొల్పారు. ఓపీ లోని నెం.13 ల్యాబ్‌ను సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లోకి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# వాన నీటిని ఒడిసిపట్టేద్దాం..!



ఎస్.రాయవరం : వర్షపునీటి ఒడిసి పట్టేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీన్లోభాగంగా ప్రతి నీటి బొట్టును వృథాగా పోకుండా భూమిలో ఇంకించేందుకు చర్యలు చేపట్టింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, రైతుల పొలాల్లో పంట కుంటలు తవ్వడానికి శ్రీకారం చుట్టింది.

**ప్రతి గ్రామంలో 20...**

జిల్లాలోని 24 మండలాల్లో 6,535 ఇంకుడు గుంతలు తవ్వాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ 20 చొప్పున గుంతల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది గుంత తవ్వేందుకు ఇంటి వద్ద అనువైన స్థలాన్ని పరిశీలించి, జియో ట్యాగింగ్ చేసి మంజూరు చేస్తారు. ప్రతి గుంతకు మెటీరియల్, రైతు కూలీ కలిపి రూ.5800 చెల్లించనున్నారు. వీటిల్లో పిక్క, కంకర, ఇసుక, ఇతర సామగ్రితో నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలి.. ఇళ్ల వద్ద, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో ఇళ్ల నుంచి నీరు రోడ్డుపైకి రాకుండా కొంతమేర పారిశుద్ధ్య సమస్య పరిష్కారం అవుతుంది.

జిల్లాలో ఎక్కువగా వర్షాధారం పైనే పంటలు సాగుచేస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లో పంటలకు బాగానే నీరందుతోంది. అయితే మెట్టప్రాంతాల్లో సాగు చేసే మామిడి, జీడిమామిడి, ఇతర పండ్ల తోటలకు వేసవిలో నీరందడం లేదు. దీంతో రైతుల పొలాల్లోనే వర్షపునీటిని నిల్వ చేసే విధంగా పంట కుంటల తవ్వకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలో 7200 పంట కుంటలు తవ్వాలని లక్ష్యం నిర్దేశించింది. తొలి విడతలో 964 పంట కుంటల తవ్వకాలు చేపట్టారు. 9 అడుగుల పొడవు, 9 అడుగుల వెడల్పుతో ఉపాధి కూలీలు పంట కుంట నిర్మిస్తారు. దీనికి ప్రభుత్వం సుమారు రూ.45 వేలు చెల్లిస్తుంది. పంట కుంట తవ్వించుకున్న రైతుకు 20 రకాల పండ్ల జాతి మొక్కలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలను ఉచితంగా అందిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి-డీవీ ఎరకయ్య, ఏపీడీ (ఇంఛార్జి), ఎలమంచిలి**

రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం పంట కుంటల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. వర్షపునీరు వృథాకాకుండా పొలాల్లో నిల్వ ఉండటానికి పంటకుంటలు తవ్విస్తున్నాం. దీంతోపాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, కూరగాయల విత్తనాలు ఉచితంగా అందిస్తాం. దీంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. భూగర్భ జలాలను పెంపొందించడానికి, పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి ప్రతి ఇంటి వద్దా ఇంకుడు గుంత తవ్వుకునేందుకు ప్రోత్సాహం అందిస్తున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

# రేషన్ దందా..అడ్డు ఉందా?



కాకినాడ : గత అయిదేళ్లూ పేదల బియ్యంతో రూ.కోట్లు కొల్లగొట్టిన రేషన్ మాఫియా అక్రమాల బాట వీడనంటోంది. వైకాపా ప్రభుత్వంలో కొందరు పెద్దలు పోర్టులను గుప్పెట్లో పెట్టుకుని పెద్ద ఎత్తున రేషన్ బియ్యం విదేశాలకు తరలించేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేసుకున్నారు. నేటికీ కొన్ని వ్యవస్థలు సహకరిస్తుండడం సమస్యగా మారింది.

**కూటమి వచ్చాక అడ్డుకట్ట వేస్తున్నా**

రేషన్ మాఫియా గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసుకుని పేదల బియ్యం హద్దులు దాటించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉక్కుపాదం మోపే దిశగా అడుగులు పడ్డాయి. గతేడాది జూన్ 28, 29 తేదీల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలోని 13 గోదాముల్లో తనిఖీలు చేసి 51,427 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 26,488.32 టన్నుల్లో రేషన్ ఆనవాళ్లు గుర్తించారు. ఆయా సంస్థలపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు.. ఛత్తీస్‌గఢ్, బిహార్, ఝార?ండ్, పశ్చిమ బెంగాల్‌లోని 137 మిల్లుల నుంచి రేషన్ బియ్యం కాకినాడ చేరినట్లు తేలింది. ఆ తర్వాత ఆఫ్రికా వెళ్లే స్టెల్లా నౌకలో 1,320 టన్నులు.. బార్జిలో వెయ్యి టన్నుల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

**అసెంబ్లీలో చర్చతో కదిలిన డొంక..**

కాకినాడ నగర తెదేపా ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు రేషన్ అక్రమాలపై అసెంబ్లీలో గురువారం చర్చించారు. వైకాపా ప్రభుత్వం, ద్వారంపూడి కుటుంబంపై ఆరోపణలు చేశారు. గత అయిదేళ్లూ బియ్యం వ్యాపారం చేసి.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆపేసిన మానస సంస్థపైనా విచారణ జరపాలన్నారు. సంబంధిత సంస్థ గత అయిదేళ్లలో 6 లక్షల టన్నుల బియ్యం విదేశాలకు ఎగుమతి చేసిందనే ప్రచారం సాగుతోంది. దీనిలో అక్రమం ఎంత..? సక్రమమెంత తేలాల్సి ఉంది.

**'సిట్' వేస్తే మాకేంటి..**

అక్రమాలపై గతేడాది చివరన రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను వేసింది. బృందం ఇంతవరకు క్షేత్రస్థాయికి రాలేదు. దీంతో అక్రమ రవాణా మళ్లీ ఊపందుకుంది.

కాకినాడ పోర్టులో 4 చెక్‌పోస్టులు ఉన్నాయి. అయినా 2,320 టన్నుల రేషన్ బియ్యం పోర్టులోకి వెళ్లిందంటే అక్రమార్కుల హవా తెలుస్తోంది. నాడు పౌర సరఫరాల వ్యవస్థ మొత్తం ద్వారంపూడి కుటుంబం చేతిలోనే.. కాకినాడ సిటీ వైకాపా ఎమ్మెల్యేగా చంద్రశేఖర్‌రెడ్డి కొనసాగితే.. పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్, రైస్ మిల్లర్ల సంఘం, ఎగుమతిదారుల సంఘం అధ్యక్ష పదవుల్లో ఆయన తండ్రి, సోదరుడు ఉన్నారు.

**ఇవిగో అక్రమాల జాడలు..**

గొల్లప్రోలులోని వైకాపా కౌన్సిలర్ షెడ్డులో 17.49 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఫిబ్రవరి 10న, చినజగ్గంపేట శివారు కోళ్లఫారంలో 1,100 కేజీల బియ్యాన్ని ఈనెల 5న అధికారులు పట్టుకున్నారు.

మహారాష్ట్ర నుంచి 20 టన్నుల రేషన్ బియ్యం లోడుతో వస్తున్న లారీని తొండంగి పోలీసులు ఫిబ్రవరి 1న పట్టుకున్నారు.

కాకినాడ పోర్టు సమీప చెక్‌పోస్టు వద్ద ఫిబ్రవరి 21న నాలుగు లారీల్లోని 92 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

# కిట్ల కొరత.. రోగుల వెత



ఆదోని : పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం 'నాడి'తప్పింది. కేంద్రాలకు వైద్యులు సమయానికి రావడం లేదు.. వచ్చినా రెండు గంటలకు మించి ఉండటం లేదు.. కింద స్థాయి సిబ్బందే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ల్యాబ్ పరీక్షల్లో కీలకమైన సీబీపీ కిట్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఆటంకం నెలకొంది. అత్యాధునిక వైద్య పరికరాలు మూలన పడేశారు. మంచాలు ఇంతవరకు సీలు తీయని పరిస్థితి. బృందం పరిశీలన చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**నిర్వీర్యం చేసిన వైకాపా**

పట్టణాల్లోని బస్తీవాసులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో అపోలో సంస్థ భాగస్వామ్యంతో పరీక్షలు చేసేవారు. దీర్ఘకాలిక జబ్బులకు వీడియో కాన్ఫరెన్స్‌లో రోగితో మాట్లాడి సేవలందించేవారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో సీవో (కమ్యూనిటీ ఆర్గనైజర్) విధానంతో క్షేత్ర స్థాయిలో రోగుల పరిశీలన ఉండేది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత అపోలో సంస్థను ఆపేసింది.

**అటకెక్కిన 67 పరీక్షలు**

పట్టణ, నగర ప్రాంతాల్లోని శివారు, మురికి వాడల్లో నివాసముండే ప్రజలకు వైద్య సేవలందించి, వారి ఆరోగ్య రక్షణకు దోహదపడాలనే సంకల్పంతో పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు.

ఒక్కో కేంద్రం పరిధిలో సుమారు 20-30 వేల జనాభాకు సేవలందించాల్సి ఉంది. రోజు వారీ ఓపీ 50-80 ఉంటుంది. ఆయా కేంద్రాల్లో 67 రకాల పరీక్షలు, 172 రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలి. ఎక్కడా సరైన వైద్యం అందడం లేదు.

ఆదోనిలో శంకర్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో మూడు, అరుణ్‌జ్యోతినగర్ కేంద్రంలో ఐదు నెలలుగా వైద్యుడి స్థానం ఖాళీగా ఉంది. రెండు నెలల కిందట వైద్యుడిని నియమించినా.. పైచదువుల పేరుతో తిరిగి వెళ్లిపోయారు. పాత ఆకాశవంతెన కింది భాగంలో హవన్నపేట కేంద్రానికి వెళ్తే అక్కడ వైద్యురాలు కనిపించలేదు.

# జగనన్న లేఅవుట్ల అక్రమాలపై విజిలెన్స్

చిత్తూరు : వైకాపా హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో భారీగా అక్రమాలు జరిగాయి. అర్హులను పక్కనపెట్టి వాలంటీర్లు, వారి స్నేహితులు, బంధువులు, సచివాలయ ఉద్యోగుల కుటుంబాలకు కాలనీల్లో పట్టాలు జారీ చేశారు. భూ సేకరణ మొదలు.. మౌలిక వసతులు, భూముల చదును పేరుతో వైకాపా నేతలు రూ.కోట్లు దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై దృష్టి సారించింది. విజిలెన్స్ విభాగ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణకు చర్యలు చేపట్టాయి. జగనన్న లేఅవుట్ల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో వందల ఎకరాలు సేకరించారు. ప్రభుత్వ భూములను సైతం అధికారుల సహకారంతో అసైన్డ్ భూములుగా మార్చి రూ.కోట్లు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి. ప్రైవేటు భూముల విషయంలో భూ విలువను అధికంగా పెంచేసి నిధులు స్వాహా చేశారు. భూ నిర్వాసితులకు తక్కువ మొత్తంలో పరిహారం అందజేసి అధిక భాగం వైకాపా పెద్దలు,



అధికారులు దోచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి భూసేకరణ దోపిడీలు జిల్లా వ్యాప్తంగా జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

**దర్యాప్తు ఇలా..**

విజిలెన్స్ అధికారులు ప్రతి జగనన్న లేఅవుట్‌పై క్షుణ్ణంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. లేఅవుట్‌కు సేకరించిన భూ విస్తీర్ణం ఎంత..? ఈ భూమి ప్రైవేటు వ్యక్తులదా.. ప్రభుత్వానిదా..? భూసేకరణకు నిధుల విడుదల ఎంత..? భూ నిర్వాసితులకు ఎంత ఇచ్చారు..? భూసేకరణలో ఏవైనా అక్రమాలు జరిగాయా..? లేఅవుట్ల అభివృద్ధికి మంజూరైన నిధులు, ఖర్చు చేశారా.. స్వాహా చేశారా..? లేఅవుట్లు లబ్ధిదారులకు సౌకర్యమా..? అసౌకర్యమా..? ప్రస్తుతానికి నిర్మాణాలు పూర్తయిన ఇళ్లు, నిర్మాణానికి నోచుకోని ప్లాట్లు ఎన్ని..? తదితర అంశాలను రికార్డుల ద్వారా పరిశీలించనున్నారు. ఈ నెలా 20 లోగా సమగ్ర నివేదిక అందజేయాలని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

**కొండలు, గుట్టల్లో జాగాలిచ్చి..**పట్టణ, మండల ప్రాంతాలకు సుదూరంగా అడవుల సమీప, గుట్టలు కొండల నడుమ, అసౌకర్యంగా లేఅవుట్లు ఏర్పాటు చేశారు. భూమి చదును, సరిహద్దు రాళ్ల ఏర్పాటు తదితర మౌలిక వసతులకు రూ.కోట్లు ఖర్చు చేశారు. భూముల చదును, రాళ్లు తొలగించకుండానే వైకాపా సానుభూతిపరులైన గుత్తేదారులకు రూ.కోట్లు బిల్లులిచ్చి అందరూ పంచుకున్నారు.

## చెరువుల్లో తోడేళ్లు

కుప్పం : కుప్పం నియోజకవర్గంలోని చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వైకాపా పాలనలో ఇక్కడి వనరులను కొల్లగొట్టి కర్ణాటక, తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. నియోజకవర్గంలోని చెరువులన్నీ అడుగంటిపోయాయి. ఇదే అదనుగా తవ్వకాలు చేపడుతూ.. మట్టిని ఫిల్టర్ కేంద్రాలకు తరలించి, ఇసుకగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రధానంగా కుప్పం పురపాలిక పరిధిలోని కుప్పం చెరువు, లక్ష్మీపురం చెరువు, పరమసముద్రం, అబ్బకుంట చెరువు, శీగలపల్లె చెరువు, డీకే పల్లి చెరువుల్లో యంత్రాలతో తవ్వుతున్నారు. కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలోని కొండల మధ్య సైతం తవ్వేస్తున్నారు.


**పుట్టగొడుగుల్లా వెలిసినా** చీలేపల్లె, శీగలపల్లె, పరమసముద్రం, పలార్లపల్లె, లక్ష్మీపురం, వడ్డిపల్లె లింకు రోడ్డు, కృష్ణదాసనపల్లె, గుడ్లనాయనపల్లె, మల్లానూరు, రామకుప్పం, గుడుపల్లె శాంతిపురం మండలాల్లో కృత్రిమ ఇసుక తయారు చేసి.. యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం- శ్రీనివాసరాజు, ఆర్డీవో, కుప్పం**

అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి, ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ తవ్వకాలు చేస్తుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

## వైకాపా నిర్మిత కాలనీల్లివి..!

కాకినాడ : గత వైకాపా పాలకుల అక్రమాలకు నిలువెత్తు నిదర్శనం కొమరగిరి లేఅవుట్. కాకినాడ నగరంలోని 16 వేల మంది పేదలకు ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించారు. సాక్షాత్తూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ లే-ఔట్‌లో ఇళ్లపట్టాల పంపిణీ రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సముద్ర మట్టానికి దిగువన ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరం రూ.27 లక్షలు ఉండగా, అప్పటి వైకాపా ప్రజాప్రతినిధి దళారుల సాయంతో ఎకరం రూ.47 లక్షలకు కొనిపించి సొమ్ము చేసుకున్నారు. ఏకంగా 350 ఎకరాలు ఇక్కడ సేకరించారు.



లేఅవుట్ చదును పేరుతో నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతం నుంచి గ్రావెల్ తెచ్చి నింపి, రూ.కోట్లు కొట్టేశారు. తొలి విడతలో ఇక్కడ 13 వేల మందికి ఇళ్లు మంజూరు చేశారు. 9 వేల వరకు పునాదులు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రదేశమైన ఈ లేఅవుట్ మునిగిపోతోంది. సముద్రంలో పోటు వచ్చినా ముంపు తప్పడం లేదు. ప్రస్తుతం సముద్రపు పోటుతో తీరానికి నీరు చేరి ఇసుక మేట వేసింది. దీంతో ఈ లేఅవుట్ పక్కనున్న కాలువులో నీరు సముద్రంలోకి వెళ్లకుండా నిలిచిపోయింది. వెరసి లేఅవుట్‌ను ముంచెత్తుతోంది. ఈ లేఅవుట్‌లో ముంపునకు ఈ చిత్రాలే సాక్ష్యాలు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు ఎంత శ్రేయస్కరమో వైకాపా పెద్దలే చెప్పాలి.

# వివాదాస్పద టీడీఆర్ దస్త్రాలు చకాచకా..!

నిడదవోలు:నగర పరిధిలో టీడీఆర్ (ట్రాన్సఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్)ల జారీపై ఎన్ని ఆరోపణలు వస్తున్నా మహా విశాఖ నగరపాలక సంస్థ అధికారుల తీరు మారడం లేదు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ దస్త్రాలను ఆమోదింపచేయడానికి ప్రత్యేకంగా డీటీసీపీ (డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్) నుంచి ఉప సంచాలకుడు శ్రీనివాసరావు గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. మరో పక్క జీవీఎంసీకి చెందిన టీడీఆర్‌లపై అసెంబ్లీలో వివరణ ఇవ్వడానికి ప్రధాన పట్టణ ప్రణాళికా ధికారి ప్రభాకర్ హుటాహుటిన మధ్యాహ్నం విజయవాడ బయల్దేరి వెళ్లారు.

**90 వరకు దస్త్రాల పరిశీలన..:** వైకాపా హయాంలో నగరంలో జారీ చేసిన టీడీఆర్‌లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. వాటిల్లో కొన్నింటిని పక్కనపెట్టగా మిగతా వాటిపై విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు. మరో మరోవైపు సీఐడీ అధికారులు సైతం టీడీఆర్ దస్త్రాలను తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అక్రమార్కులు అధికారులను ప్రసన్నం చేసుకుని, నాయకులకు తప్పుడు సమాచారం ఇస్తూ టీడీఆర్‌లు కొట్టేయడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జీవీఎంసీలో పెండింగ్‌లో ఉన్న 90 దస్త్రాలను ఆమోదింపజేయడానికి ప్రత్యేకంగా డీటీసీపీ కార్యాలయం నుంచి ఉప సంచాలకుడు స్థాయి అధికారి జీవీఎంసీకి చేరుకోవడం విశేషం.



**ఇవిగో అభ్యంతరాలు..:** కొమ్మాది ప్రాంతంలో మృతురాలి పేరిట ఉన్న డి-పట్టా భూమికి టీడీఆర్ ఇవ్వాలని దరఖాస్తు చేయగా, ప్రణాళికాధికారులు హడావుడిగా అభ్యంతరాల కోసం పత్రికల్లో నోటిఫికేషన్ ఇచ్చారు. అనకాపల్లిలో 30 వరకు టీడీఆర్‌లపై ఇంకా సర్వే కొనసాగుతుండగా, వాటిని ఆమోదించడానికి ప్రణాళికాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకుని మురళీనగర్ సమీపంలోని గెడ్డ పోరంబోకు స్థలానికి టీడీఆర్ ఇవ్వాలని ఓ నాయకుడు దరఖాస్తు చేయగా దానిపైనా దస్త్రం కదులుతోంది. రుషికొండ సమీపంలోని గీతం వర్సిటీ వద్ద 70 సెంట్ల భూమికి మూడు దశాబ్దాల క్రితం చేసిన అభివృద్ధి పనికి టీడీఆర్ రాగా, ఆ దరఖాస్తును పరిశీలిస్తున్నారు. ఎన్ఎస్‌టీఎల్ సమీపంలో రహదారి విస్తరణలో భాగంగా స్థలం కోల్పోయినట్లు వచ్చిన దరఖాస్తుపై ఎలాంటి విచారణ లేకుండానే టీడీఆర్ జారీ చేయడానికి సిద్ధపడినట్లు తెలిసింది. వీటిపై కౌన్సిల్‌లో కార్పొరేటర్లు అభ్యంతరాలు చెప్పినా అధికారులు ముందుకెళ్లిపోతుండటం గమనార్హం.

# ఇసుకను తోడేసి.. మట్టిని తవ్వేసి

ముమ్మిడివరం : గలగలపారే గోదావరి చెంతన ఇసుక, కొబ్బరితోటల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. లంకల్లో తట్ట ఇసుక తీయాలన్నా ఎన్నో నిబంధనలు, ఉన్నతస్థాయిలో అనుమతులు ఇవ్వాల్సి ఉన్నా అవేమి లేకుండా నాయకుల అండదండలతో తవ్వకాలు జరిగిపోతున్నాయి. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంక గోదావరి తీరంలో పొక్లెయిన్లతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఉచిత ఇసుక మాటున పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవరపాలెం ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు ప్రారంభించారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ తంతు జరుగుతున్నా



అధికారగణం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వైకాపా పాలనలో నిబంధనలు తుంగలో తొక్కి లంక గ్రామాల్లో ఇసుక, మట్టి తవ్వకాలు చేపట్టి తీరానికి తూట్లు పొడిచారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తీసుకురాగా కొందరు ర్యాంపుల వద్ద బాట పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఇసుక ర్యాంపు ఏర్పాటుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా ర్యాంపును ప్రారంభించారు.

# ధర పతనం.. రైతు నిర్వేదం

చీరాల : రొయ్యల ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి... గడిచిన వారం రోజులకు ఇప్పటికి మార్పు రావడంతో ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు... ఒకపక్క సాగురేట్లు విపరీతంగా పెరిగిపోతున్నాయి... ఇదే పరిస్థితి కొనసాగితే డాలర్ల పంటగా ప్రసిద్ధికెక్కిన రొయ్యల పరిశ్రమ విస్తీర్ణం క్రమేపి తగ్గే అవకాశం ఉందని సాగుదారులు వాపోతున్నారు.

జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో 22 వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగవుతున్నాయి. ఏటా వీటి ద్వారా విదేశీ మారకద్రవ్యం రూ.కోట్లలో వస్తోంది. ఇంత వరకు బాగానే ఉంది. వచ్చిన చిక్కల్లా సాగుకు ఉపక్రమించే సమయంలో ధరలు ఆతరువాత ఉండటంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంద కౌంట్ రొయ్యలు పండించడానికి రూ.240 నుంచి 250 వరకు వ్యయం అవుతోంది. దీంతో ప్రస్తుతం మార్కెట్ ధరతో నష్టాలు తప్పడంలేదని వారి వాదన. అంతర్జాతీయంగా పరిస్థితులు బాగాలేవని చెప్పే వ్యాపారులు ఇప్పుడు ఎటువంటి ఇబ్బందుల్లేకపోయినా ధర తగ్గించడంలో ఆంతర్యం అర్థం కాకుండని ఆవేదన చెందుతున్నారు. గడిచిన వారం రోజుల్లోనే వంద కౌంట్ రొయ్యల ధరల్లో కిలోకి రూ.40 తగ్గడం వీరిలో మరింత ఆందోళన నెలకొంది.

# రేషన్ బండి.. అక్రమాలు దండి!



అనంతపురం : ఆహార భద్రతా చట్టం ప్రకారం రేషన్ డీలర్లు కార్డుదారులకు సరకులు పంపిణీ చేయాలి. గత వైకాపా ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లకు పూర్తి అధికారులు అప్పగించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. ఇంటింటికీ వాహనాలు వెళ్లడం లేదు. దీంతో కొన్ని చోట్ల కార్డుదారులు అవస్థ పడుతున్నారు. కాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 754 ఎండీయూ వాహనాలకు గాను 691 ఇంటింటికి తిరుగుతున్నట్లు ఆపరేటర్లు బిల్లు రాసేసుకుంటున్నారు. చౌక దుకాణాల వద్ద కూర్చొని పని కానిచ్చేస్తున్నారు. మరోవైపు లబ్ధిదారులకు సరకులు అందించినా.. అందించకపోయినా ప్రతి నెలా వారి ఖాతాలకు రూ.21 వేలు చొప్పున రూ.1.86 కోట్లు జమ అవుతుండటం గమనార్హం.

**చిల్లర పేరుతో..**

వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాలయాలకు ఎండీయూ వాహనాలను మ్యాపింగ్ చేశారు. చౌక దుకాణాల్లో సరకులు పంపిణీ చేసినా.. ఎండీయూ ఆపరేటర్ ఇప్పటికీ ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేయాల్సిందే. ఆపరేటరు, డీలరు కుమ్మక్కై ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేయించుకుని కందిపప్పు, పంచదార పంపిణీ చేసినట్లుగా పక్కదారి పట్టిస్తున్నారు. బియ్యం తూకాల్లో కార్డుకు 3-4 కిలోలు పట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కిలో కందిపప్పు రూ.67 ఉండగా రూ.70, అర కిలో పంచదార రూ.17 ఉండగా రూ.20 చొప్పున తీసుకుంటూ చిల్లర నొక్కేస్తున్నారు.

**అధికారులు ఏమంటున్నారంటే..**

ఇన్‌ఛార్జి డీఎస్‌వో జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు కచ్చితమైన తూకాలు, నిర్ణయించిన ధరల ప్రకారమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. లేదంటే చర్యలు తప్పవన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు బిల్లులు పంపుతారు. వాటి ప్రకారం ఆపరేటర్లకు రూ.21 వేల చొప్పున చెల్లిస్తున్నామన్నారు.

**8 నెలలకు రూ.14.92 కోట్లు**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 754 వాహనాలున్నాయి. వాటిలో 63 వివిధ కారణాలతో ఆగిపోగా మిగతావి తిరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 405 వాహనాలకు గాను, 347...శ్రీసత్యసాయి జిల్లాలో 349 వాహనాలకు 344 తిరుగుతున్నాయి. ఒక్కో ఆపరేటర్‌కు ప్రభుత్వం నెలకు రూ. 21 వేలు చొప్పున చెల్లిస్తోంది. ఎనిమిది నెలలకు మొత్తం రూ.14.92 కోట్లు జమైంది.

# ప్రతిభా పరీక్షలు.. ఉన్నత స్థాయికి సోపానాలు



అనంతపురం : కేవలం చదువుల్లో మంచి మార్కులు సాధించిన వారికంటే ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, ఉన్నత స్థాయిలో ఉంటారని నగరపాలక కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి అనంత జిల్లాలో అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం పట్టణాల్లో 4 నెలలపాటు ఈ పోటీలు నిర్వహించారు. పాఠశాల, ప్రాంతీయ స్థాయిలో గెలుపొందిన విజేతలకు స్థానిక పీవీకేకే డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు జరిగాయి. కార్యక్రమానికి అనంత నగర కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."జాతీయ పరిశోధన సంస్థలు సర్వే ప్రకారం పదో తరగతి, ఇంటర్, డిగ్రీల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు 4 నుంచి 5 శాతం మంది మాత్రమే ప్రభుత్వ కొలువులు దక్కించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ఇలాంటి ప్రతిభాపాటవ పోటీల్లో పాల్గొనే వారు 50 శాతం మంది మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు స్వయం అధ్యయనం, ప్రజలకు సేవ చేయాలనే తత్వం ఉంటుంది. చదువులతోపాటు అన్య అంశాల్లో మిళితమైన వారే జీవితంలో రాణిస్తారు. నేర్చుకోవడం అనేది జీవితంలో నిరంతర ప్రక్రియ. ఈనాడు పత్రిక సమాజంలో వివిధ వర్గాల వారి కోసం వసుంధర, చదువు, అంతర్యామి వంటి శీర్షికలతో ప్రత్యేక సమాచారం అందిస్తోంది. మద్యపానం వంటి సామాజిక రుగ్మతలు రూపమాపడానికి గతంలో చేసిన కృషి అమోఘం. విద్యార్థులను ఉత్సాహ పరచడానికి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించడం అభినందనీయం. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు సద్వినియోగం చేసుకొని జీవితంలో రాణించాలి" అని పిలుపునిచ్చారు. ఈనాడు యూనిట్ మేనేజరు చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరు నుంచి ఉమ్మడి అనంత జిల్లాలో 6 ప్రధాన కేంద్రాల్లో 82 పాఠశాలల్లో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించామన్నారు. మొత్తం 25 వేలమంది పైగా పాల్గొన్నారని, పిల్లలు చదువుల్లోనే కాదు వారు ఏయే రంగాల్లో రాణిస్తున్నారో గుర్తించి ఆయా అంశాల్లో మరింత రాణించేలా ప్రోత్సహించడానికి వేదికగా మారిందన్నారు. 2024లో స్వర్ణోత్సవాలు నిర్వహించిన రంగంలో సమాచారం అందించడమే కాకుండా ప్రజలతో మమేకం కావడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తు తరానికి ఎంతో కొంత సహాయపడాలనే ఉద్దేశంతో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పీవీకేకే బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను అభినందించారు. ఈ పోటీలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, ముత్యాలప్ప, కత్తి విజయ్ కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

**అంశం:** ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విజేతలు, పాఠశాల, ప్రాంతం వివరాలు

వ్యాసరచన : రంగశివ చరణ్ (రోటరీ, గుంతకల్లు), మధురిమ (ఆదర్శ, తాడిపత్రి), వర్ష (జీవానంద, ధర్మవరం) చిత్రలేఖనం: ఉదయ్ సాయిరాం (సాధన, ధర్మవరం), మోక్షజ్ఞ (వాల్మీకి, కదిరి), నవ్యశ్రీ (పాంచజన్య, హిందూపురం)

**ఉపన్యాసం:** స్నేహిత (నారాయణ, తాడిపత్రి), గగనప్రియ (ఎల్ఆర్‌జీ, హిందూపురం), మేఘన (ఆదర్శ, తాడిపత్రి)

క్విజ్: రాజేష్ (గుడ్ చిల్డ్రన్, అనంతపురం), సాయిలిఖిత్ (ప్రసాద్, అనంతపురం), అనన్య (శ్రీవాణి, తాడిపత్రి)

**దినపత్రిక చదవడంతోనే ..**

అనంతపురం గుడ్ చిల్డ్రన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. క్విజ్ పోటీల్లో పాల్గొనాలంటే వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జిలో పట్టు సాధించాలి. ఈనాడు దినపత్రికను చదవడంతోపాటు ప్రత్యేక పుస్తకాలు చదివాను. క్విజ్‌లో ప్రథమ బహుమతి దక్కింది. ఆనందంగా ఉంది. రాజేష్, అనంతపురం

**సాధన చేశా..**

ఉపన్యాస పోటీల్లో పాల్గొనడానికి కష్టపడ్డాను. అంశాలను నేర్చుకోడానికి అంతర్జాలం ఉపయోగించాను. పుస్తకాలు చదివాను, నేర్చుకొన్న అంశాలపై ఉపన్యసించడానికి సాధన చేశాను. ఈ పోటీల్లో పాల్గొనడంతో ఉపన్యాస భయం తొలగిపోయింది. ఎక్కడైనా వేదికలపై మాట్లాడగలననే నమ్మకం ఏర్పడింది. స్నేహిత, తాడిపత్రి

**ఎంతో ఉపయుక్తం..**

చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. బొమ్మలు గీయడం, చిత్రాలు వేయడం స్వయంగా నేర్చుకొన్నా. కళను, సృజనాత్మకతను ఇతరులకు తెలిపేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయుక్తం అవుతాయి. ఉదయ్ సాయిరాం, ధర్మవరం

**కొత్త అంశాలు తెలుసుకున్నా..**

జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందడం ఎంతో ఆనందంగా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాన్ని నేర్చుకోవడానికి గ్రంథాలయానికి వెళ్లి కొత్త అంశాలు తెలుసుకున్నాను. రచనా శైలి మెరుగుపడింది. విజయం సాధించడంతో మనోధైర్యం వచ్చింది. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుకొని ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపన కలిగింది. రంగ శివచరణ్, గుంతకల్లు

# రొయ్య.. ధర పడిపోతోందయ్యో

నిడదవోలు: సిరుల పంటగా పేరొందిన రొయ్యల సాగులో ఒడుదొడుకులు తప్పడం లేదు. గత కొన్ని రోజులుగా రోజుకు పది రూపాయల చొప్పున ధర పడిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అంతర్జాతీయంగా పరిస్థితులు బాగా లేనప్పుడు వివిధ కారణాలు చెప్పే ఎగుమతిదారులు ప్రస్తుతం ఏ కారణం లేకుండానే ధరలు తగ్గించేయడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని వారు అంటున్నారు. గత ఏడాది మే నెలలో 100 కౌంట్ ధర కిలో రూ.220 ఉండేది. వీటి సాగుకు రూ.240 నుంచి రూ.250 వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి క్రమంగా కిలో రూ.260 వరకు పెరిగింది. ఒక దశలో రూ.270 వరకు కొనుగోలు చేశారు. అలా ధర కొన్ని నెలలపాటు నిలకడగా ఉంది. ఈ నెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు రోజుకు రూ.10 చొప్పున ప్రతి కౌంట్‌కు కేజీకి సగటున రూ.30 వరకు తగ్గిందన్నారు. దీనివల్ల ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు. రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో 85 వేల ఎకరాల్లో సాగు..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేపలు, రొయ్యలు 2.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో 80 వేల ఎకరాల్లో రొయ్య పంట ఉంది. అధికంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 45 వేల ఎకరాల వరకు సాగులో ఉండగా, మిగిలిన సగం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉంది. గతంలో 30 కౌంట్ రొయ్య ధర కిలో రూ.585 వరకు అమ్మిన సందర్భాలు ఉన్నాయి. అటువంటిది ప్రస్తుతం రూ.450 పలుకుతోంది. అంటే కిలోకు రూ.135 వ్యత్యాసం ఉంది. డిసెంబరు 12న 90 కౌంట్ రూ.270 ఉండగా, ప్రస్తుతం రూ.240 ఉంది.

# కాలం చెల్లాయ్.. ప్రాణం తీస్తాయ్

చిలకలూరిపేట : జిల్లాలో కాలం చెల్లిన వంతెనలపై వాహనదారులు భయంభయంగా ప్రయానం సాగిస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించినవి శిథిలావస్థకు చేరి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నూతన వంతెనల నిర్మాణం కాగితాలకే పరిమితం కాగా.. ప్రాణ, ఆస్తినష్టంతో పాటు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. నీటి వనరులు, జాతీయ, రాష్ట్ర రహదారులపై పురాతన వంతెనల స్థానంలో కొత్తవి చేపడితే సాఫీ ప్రయాణానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కొండమోడు- పేరేచర్ల జాతీయ రహదారి మార్గంలో సత్తెనపల్లి పట్టణంలోని అమరావతి మేజర్ కాల్వపై ఉన్న పురాతన వంతెనపై ప్రమాదాలు పరిపాటిగా మారాయి. ఆర్టీసీ బస్సులు దీని నుంచి కాల్వలో పడబోయి ఏడాదిన్నరలో రెండుసార్లు పెను ప్రమాదాలు తప్పాయి. పిడుగురాళ్ల, మాచర్ల నుంచి విజయవాడ, గుంటూరు వెళ్తున్న బస్సులు శిథిలావస్థ వంతెనపై నుంచి కాల్వలో పడబోయి రెయిలింగ్‌ను ఢీకొని ఆగాయి. ఈ బ్రిడ్జిపై రెండు వాహనాలు ఎదురుపడితే గంటల తరబడి ట్రాఫిక్ ఆగిపోతుంది. కీలక బ్రిడ్జి నిర్మాణం రెండు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది.

పెదకూరపాడు నియోజకవర్గంలో అమరావతి మండలంలో నుంచి ప్రజా రాజధాని మీదుగా విజయవాడ వెళ్లే మార్గంలో పెద్దమద్దూరు వద్ద వంతెన శిథిలావస్థకు చేరింది. రెండేళ్ల క్రితం కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టి మధ్యలో ఆపారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలో చిలకలూరిపేట నుంచి నరసరావుపేట వెళ్లే మార్గంలో లింగంగుంట్ల వద్ద ఉన్న వంతెన కూలిపోయే



దశలో ఉంది. కుప్పగంజి వాగుపై ఉన్న దీనిపై ప్రయాణం భయం భయంగా ఉంటుంది. యడ్లపాడు నుంచి లింగారావుపాలేనికి వెళ్లే మార్గంలో పెదనందిపాడు బ్రాంచి కాల్వపై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది.

మాచర్ల నియోజకవర్గంలో కారంపూడి నుంచి వినుకొండ వెళ్లే మార్గంలో కారంపూడి వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. దీని నిర్మాణాన్ని ఏడు దశాబ్దాల క్రితం చేపట్టారు. తరచూ పైపై మరమ్మతులే తప్పించి కొత్త దాని నిర్మాణాన్ని చేపట్టక పోవడంతో సమస్యలుంటున్నాయి. నరసరావుపేట పట్టణ పరిధిలో కోడెల శివప్రసాదరావు స్టేడియం వద్ద ఉన్న కత్తెర చెరువు కాల్వపై నూతన బ్రిడ్జి నిర్మాణం అత్యంత కీలకంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా దీనిపై వాహనాల రాకపోకలు ఆగిపోతున్నాయి. ముంపు సమస్య కూడా నెలకొంటుంది. సత్తెనపల్లి- నరసరావుపేట మార్గంలో నార్నెపాడు, ముప్పాళ్ల వద్ద జీబీసీ, పీబీసీలపై వంతెనలు శిథిలావస్థకు చేరాయి. జీబీసీపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరై ఇటీవలే పనులకు భూమిపూజ చేశారు. పీబీసీపై కూడా కొత్తది నిర్మించాల్సి ఉంది.

వినుకొండ నియోజకవర్గంలో వినుకొండ నుంచి కారంపూడి వెళ్లే మార్గంలో ఈపూరు చెరువు వద్ద ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ఈపూరు మండలంలోని ముప్పాళ్ల వంతెన ఎన్నెస్పీ కాల్వపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది.

దశాబ్దాల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరిన పాత వంతెనల స్థానంలో కొత్తవాటి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు బృందంతో చెప్పారు.

# భవనాశి ప్రక్షాళనకు చర్యలు

అద్దంకి : భవనాశి తటాకం ప్రక్షాళనకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోనుంది. దాతల సహకారంతో సుమారు రెండు వేల ఎకరాల భూమిని తటాకంగా మార్చినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం ఆరు వందల ఎకరాలు మాత్రమే చెరువు గర్భంగా కనిపిస్తోంది. ఇందులోనూ తూర్పు, పడమర దిక్కుల్లో చేపల చెరువులతో మరింత కుంచించుకుపోతుంది. భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పనులు పదేళ్ల నుంచి నిలిచాయి. ఫలితంగా చెరువు చుట్టూ ఆక్రమణదారులు తమ ప్రతాపం చూపుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు చుట్టూ ఆక్రమణలు పెంచేశారు. దీనికితోడు తటాకంలోని నీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచనతో భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు అభివృద్ధి చర్యలకు ఉపక్రమించారు. ఫలితంగా దీని విస్తీర్ణం కొలతలు వేయించి, ఆక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధమవుతుంది.నిలిచిన భవనాశి రిజర్వాయరు పనులు: భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పనులు కొన్నేళ్లుగా నిలిచాయి. రూ.27 కోట్ల అంచనాతో 2008లో శంకుస్థాపన చేయగా, మరో రూ.20 కోట్ల నిధుల్ని గత తెదేపా ప్రభుత్వంలో మంజూరు చేశారు. గుండ్లకమ్మ నదికి పల్నాడు జిల్లా గోకనకొండ వద్ద ఆనకట్ట నిర్మించడం, 13కి.మీ. కాలువ ద్వారా భవనాశి చెరువును నింపడం, సుమారు 10 వేల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నదే లక్ష్యం. ఆనకట్ట నిర్మాణం, కాలువ తవ్వకం, భవనాశి కట్ట బలోపేతం వంటి పనులు పూర్తయ్యాయి. కాలువ నిర్మాణంలో చిన్న సమస్యల కారణంగా పుష్కరకాలం నుంచి పనులు ముందుకు సాగలేదు. రైతులకు పరిహారం చెల్లింపు, బ్లాస్టింగ్ పనులు జరగాల్సి ఉంది. దీనికితోడు భవనాశి చెరువు చుట్టూ గల రైతుల పొలాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఆయా నిధులతో సుమారు 70శాతం పనులు పూర్తయ్యాయి.

**పరిహారం పెంపుదలకు పన్నాగం**

సాధారణ పొలానికైతే ఎకరాకు గరిష్ఠంగా రూ.5.5 లక్షల పరిహారం చెల్లించారు. అదే చేపల చెరువులకైతే రూ.12-15 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఈనేపథ్యంలోనే జలాశయం చుట్టూ గల రైతులు చేపల చెరువుల్ని ఏర్పాటు చేస్తున్నారు. అందువల్లనే సుమారు 150 ఎకరాల్లో చక్రాయపాలెం, శింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెం, చిన్నకొత్తపల్లి తదితర గ్రామాల రైతులు ఇలాంటి ఎత్తుగడ వేస్తున్నట్లు సమాచారం. తాజా పరిణామాల్లో నీటిపారుదల శాఖ అధికారులు జలాశయం విస్తీర్ణం, నీరు నిలిచే ప్రదేశాలను లెక్కించే పనుల్లో ఉన్నారు. తన హయాంలో మంజూరైన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ విశేష కృషి చేస్తున్నారు.

సర్వే చేసి, ఆక్రమణలు తొలగిస్తాం భవనాశి చెరువు పరిధిలో సరిహద్దులు కొలుస్తున్నాం. ఆక్రమణలు గుర్తిస్తే తొలగింపునకు రెవెన్యూ, పోలీసు శాఖ నుంచి సహకారం తీసుకుంటాం. ఆమేరకు నివేదికను ఉన్నతాధికారులకు నివేదించాం.

చురకలు



# బ్యాంకాక్ కొండలు కోనల్లో యువనటి గట్స్

పచ్చని ప్రకృతిని ఆస్వాధించే మనసుండాలే కానీ ఈ ప్రపంచంలో ఎగ్జోటిక్ లొకేషన్లకు కొదవేమీ లేదు. అందునా బ్యాంకాక్ అడవుల్లో సుదూర తీరాన పచ్చందాలను తనివి తీరా ఆస్వాధించి తీరాల్సిందే. అక్కడ కొండలు కోనలు గుట్టలు నదీ సముద్ర జలాల్లో విహరిస్తే కలిగే మజానే వేరు! ప్రస్తుతం అలాంటి అద్భుతమైన విహారయాత్రను ఆస్వాధిస్తోంది మెహ్రీన్ ఫీర్జదా. తాజాగా కొండల మధ్య పచ్చని జలాల్లో బోట్ షికార్ చేస్తూ కనిపించింది. ఎత్తైన పర్వతాల నడుమ పచ్చని నీడ ఆ నది నీటిలో ప్రతిబింబిస్తోంది. అలాంటి చోట



మెహ్రీన్ తనను తాను మర్చిపోయి ఇదిగో ఇలా ఫోజులిచ్చింది. హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో థై అందాలను కూడా ప్రదర్శిస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం మెహ్రీన్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. చేతిలో సినిమాల్లేవ్. కావాల్సినంత తీరిక సమయం ఉంది. దానిని ఇలా సద్వినియోగం చేస్తోందంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఏదైనా ట్రావెల్ మ్యాగజైన్ షూట్ కోసం అక్కడికి వెళ్లిందా? అని కూడా సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు ఇలియానా ఫిజీ దీవికి ఇదే తరహాలో ప్రచారం కల్పించింది. ఇప్పుడు మెహ్రీన్ బ్యాంకాక్ అందాలను ప్రమోట్ చేయబోతోందా? అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ అన్నిటికీ మెహ్రీన్ స్వయంగా స్పందించాల్సి ఉంటుంది. ఎఫ్ 2 ఫ్రాంఛైజీ సినిమాల తర్వాత మెహ్రీన్ కి సరైన ఆఫర్ లేదు. మునుముందు ప్రయత్న లోపం లేకుండా ఏదైనా మాయాజాలం సృష్టిస్తుందేమో చూడాలి.

# స్టార్ హీరో సినిమాలో శ్రియ స్పెషల్ సాంగ్

స్టార్ హీరోల సినిమాల్లో భారీ సినిమాల్లో ఈ మధ్య స్పెషల్ సాంగ్స్ ఎక్కువైపోయాయి. స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ ఉందంటే ఆ సాంగ్ ఎవరు చేస్తున్నారా? ఆ పాట ఎలా ఉండబోతుందనే ఆసక్తి ముందునుంచే అందరిలో ఉంటుంది. స్టార్ హీరోల సినిమాలన్నీ పాన్ ఇండియా లెవెల్లో రిలీజవుతున్న నేపథ్యంలో అగ్ర హీరోయిన్లు సైతం ఈ స్పెషల్ సాంగ్స్ చేయడానికి వెనుకడుగేయట్లేదు. అలాంటి స్పెషల్ ఆఫర్లు వచ్చినప్పుడు చేయడం వల్ల భారీ రెమ్యూనరేషన్ తో పాటూ, నేషనల్ లెవెల్లో తమకు క్రేజ్ పెరగడం ఖాయం. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో చేస్తున్న రెట్రో సినిమాలో ఓ ఐటెం సాంగ్ ఉన్నట్టు తెలుస్తోంది. పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ కు సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నాడు.



ఈ సినిమాలో ఆ స్పెషల్ సాంగ్ ను శ్రియా శరణ్ చేస్తున్నట్టు సమాచారం. రెట్రో స్పెషల్ సాంగ్‌లో సూర్యతో కలిసి శ్రియ కాలు కదిపినట్టు తెలుస్తోంది. ఈ స్పెషల్ సాంగ్‌ను వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేయనున్నట్టు సమాచారం. టాలీవుడ్ లో తన సినీ కెరీర్ ను మొదలుపెట్టిన శ్రియ ఆ తర్వాత తమిళ సినిమాల్లో కూడా నటించి కోలీవుడ్ లో కూడా స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది. స్టార్ హీరోల సరసన నటించి అందరి మనసులు గెలుచుకున్న శ్రియ విదేశీ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకుని కొంత కాలం పాటూ సినిమాలకు దూరమైంది. తర్వాత మళ్లీ ఆర్ఆర్ఆర్ లో కనిపించిన శ్రియ తమిళ సినిమాలో కనిపించి చాలా కాలమే అవుతోంది. ఏడేళ్ల తర్వాత మళ్లీ తమిళ సినిమాలో చేయడం ఎంతో సంతోషంగా ఉందని శ్రియ ఈ సందర్భంగా తెలిపింది. రెట్రో సినిమా సమ్మర్ స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. కంగువ సినిమా డిజాస్టర్ అవడంతో సూర్య తన ఆశలన్నీ రెట్రో సినిమాపైనే పెట్టుకున్నాడు. ఇదిలా ఉంటే ప్రస్తుతం సూర్య, ఆర్జె బాలాజీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే.






# మెడికల్ కాలేజ్‌లో గాయని మెరుపులు



వేదిక మీద అదిరిపోయే డ్యాన్సులు చేస్తూ.. అద్భుత గానాలాపానతో మతులు చెడగొట్టే విద్య అతి కొద్ది మందికే తెలుసు. చాలా మంది గొప్ప గాయనీ గాయకులు వేదికపై డ్యాన్సులు చేయలేరు. చాలా మంది డ్యాన్సులు చేసేవాళ్లు పాడలేరు! కానీ ఆ రెండు అద్భుత లక్షణాలు కలిగి ఉన్న అరుదైన పెర్ఫామర్ ఆండ్రియా జెరోమియా. ఈ బ్యూటీ నటిగాను సత్తా చాటింది. యుగానికి ఒక్కడు లాంటి థ్రిల్లర్ మూవీలో కార్తీ సరసన ఆండ్రియా నట ప్రదర్శనకు అభిమానులు ఏర్పడ్డారు. ఆండ్రియా చాలా కాలంగా ఆల్ రౌండర్ నైపుణ్యంతో ఆకట్టుకుంటోంది. గాయనిగా, నటిగా, డ్యాన్సర్ గా రాణిస్తోంది. మధ్యలో ప్రముఖ యువ సంగీత దర్శకుడితో ప్రేమాయణం, బ్రేకప్ అంటూ కొన్నాళ్ల పాటు టైమ్ వేస్ట్ అయినా కానీ ఆండ్రియా డిప్రెషన్ నుంచి బయటపడి, కెరీర్ పరంగా కంబ్యాక్ అవుతున్న తీరు ఆశ్చర్యపరుస్తోంది. ఇకపోతే ఆండ్రియా ఇటీవల ఓ నైట్ ఈవెంట్లో కాలేజ్ విద్యార్థులను ఉర్రూతలూగించింది. తనదైన గానం డ్యాన్సులతో వేదికను ఒక ఊపు ఊపింది. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఆండ్రియా ఓ మెడికల్ కాలేజీలో తన ప్రదర్శనను ఇచ్చింది. గానంతో పాటు డ్యాన్సులతో మెరుపులు మెరిపించింది. వేదికపై బ్లూ డెనిమ్స్ థై స్లిట్ ఎలివేషన్ మతులు చెడగొట్టింది. ఆండ్రియా ప్రదర్శనకు కాలేజ్ యూత్ వీలలతో గోల చేస్తూ ఫుల్ గా ఎంజాయ్ చేసింది. చకాలేజీ సీజన్ అట్టహాసంగా ముగిసింది ..చసవీతమెడికల్ కాలేజీలో అందరు అందమైన యువ వైద్యుల కోసం ప్రదర్శన ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది అని ఆండ్రియా వ్యాఖ్యను జోడించింది. ఈ మెడికల్ కాలేజీలో ప్రదర్శన కోసం లక్షల్లో ఆండ్రియా అందుకుందని గుసగుస వినిపిస్తోంది. దళపతి విజయ్ నటించిన మాస్టర్ చిత్రంలో ఆండ్రియా కీలక పాత్రలో కనిపించింది. ఆ తర్వాత ఒకేసారి నాలుగైదు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఇవన్నీ సెట్స్ లో ఉన్నాయి. కమలా కన్నన్ దర్శకత్వంలో వట్టామ్.. మిస్కిన్ దర్శకత్వంలో పిసాసు-2 లో నటించింది. కా - మాలిగై- నో ఎంట్రీ సహా మరో రెండు చిత్రాలతోను ఆండ్రియా బిజీగా ఉంది. బాబి ఆంటోని, దినేష్ సెల్వరాజ్ తెరకెక్కిస్తున్న సినిమాల్లో ను నటిస్తోంది.

# సంక్రాంతికి రావాల్సిన సినిమా.. ఇంకెప్పుడు?



మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం మాస్ జాతర ఎప్పటినుంచో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతోంది. మొదటి పోస్టర్ నుంచి మాస్ ఫీవర్ రేపిన ఈ సినిమా.. చివరికి ఎప్పుడొస్తుందా అనే ప్రశ్నకు మాత్రం ఇంకా క్లారిటీ ఇవ్వలేకపోతోంది. సంక్రాంతికి రిలీజ్ చేస్తామని మొదట పేర్కొన్నా.. తర్వాతి తేదీలు ఎప్పటికప్పుడు మారుతూ వస్తుండటం ఫ్యాన్స్ లో నిరాశను కలిగిస్తోంది. అసలైతే 2025 సంక్రాంతి బరిలో మాస్ జాతర ఉండబోతోంది అన్న అంచనాలు ఉండేవి. కానీ షూటింగ్ ఆలస్యం కావడం, రవితేజ చేతికి గాయం కారణంగా సినిమాకు బ్రేక్ వచ్చిన సంగతి తెలిసిందే. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హీరో కొద్దికాలం విశ్రాంతి తీసుకోవడంతో షూటింగ్ షెడ్యూల్ వెనక్కి వెళ్లింది. దీంతో చిత్రబృందం రిలీజ్ డేట్ ను మార్చక తప్పలేదు. ఇటీవల మేకర్స్ మే 9న సినిమాను విడుదల చేస్తామంటూ అఫిషియల్ గా ప్రకటించారు. బర్త్‌డే స్పెషల్ గ్లింప్స్, పోస్టర్లు, సాంగ్స్ అన్నీ మే విడుదలను బలంగా నిర్ధారించినట్టే అనిపించాయి. కానీ తాజా సమాచారం ప్రకారం ఆ డేట్ పై కూడా అనుమానం నెలకొంది. పోస్టుప్రొడక్షన్ వర్క్ ఇంకా పూర్తికాకపోవడం, కొన్ని కీలక విజువల్స్ కంప్లీట్ అవ్వకపోవడంతో మళ్లీ రవితేజ ఫ్యాన్స్ ఎదురుచూడాల్సి రావచ్చు. లేటెస్ట్ టాక్ ప్రకారం, మేకర్స్ ఇప్పుడు జూలై నెలను టార్గెట్ చేస్తూ కొత్త రిలీజ్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు సమాచారం. సీతార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. అందుకే నాణ్యత విషయంలో రాజీపడకుండా పూర్తిస్థాయిలో ఫినిషింగ్ చేయాలని దర్శకుడు భాను భోగవరపు చూస్తున్నారట. రవితేజ పాత్రకు సంబంధించి కొన్ని ప్రత్యేక యాక్షన్ సీక్వెన్స్‌లు పోస్ట్ ప్రొడక్షన్ లో ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన పాటలు మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. మరింతగా హైప్ పెంచేలా మాస్ రాంపేజ్ గ్లింప్స్, మాస్ పోస్టర్స్ అన్నీ సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. కానీ రిలీజ్ డేట్ పెడితేనే ఈ క్రేజ్ బాక్సాఫీస్ దగ్గర నిలబడుతుంది. మొత్తానికి, మాస్ జాతర బాక్సాఫీస్ లో సందడి చేయడానికి ఇంకొంత టైం పడేలా ఉంది. జూలై రిలీజ్ ఖరారైతే, మిడ్ సమ్మర్ సీజన్ లో రవితేజ మాస్ స్టామినా చూసేందుకు అభిమానులు సిద్ధమవుతారు. అధికారికంగా డేట్ ఎప్పుడొస్తుందో చూడాలి కానీ, ఈ సారి అయినా మాస్ జాతర థియేటర్ లో పండగ చేసేదెప్పుడో క్లారిటీ రావాల్సిన అవసరం ఉంది.

# ఈ వెయిటింగ్ దేనికోసం అమ్మడు..?

సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మెప్పించిన బ్యూటీ మృణాల్ ఠాకూర్ అంతకుముందు బాలీవుడ్ సీరియల్స్ తో పాటు సినిమాలు కూడా చేసినా రాని క్రేజ్ అమ్మడికి సీతారామం తో వచ్చింది. సినిమాలో సీతామహాలక్ష్మి, నూర్జహాన్ పాత్రల్లో మృణాల్ అదరగొట్టేసింది. టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందని అందరు ఫిక్స్ అయ్యారు. సీతారామం తర్వాత నానితో హాయ్ నాన్న సినిమా చేసింది అమ్మడు. ఆ సినిమాలో కూడా తన నటనతో ఇంప్రెస్ చేసింది. రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. కానీ విజయ్ దేవరకొండతో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా డిజప్పాయింట్ చేసింది. ఆ సినిమా హిట్ అయితే పరిస్థితి ఎలా ఉండేదో కానీ ఆ సినిమా



ఫ్లాప్ అవ్వడం వల్ల మృణాల్ కెరీర్ రిస్క్ లో పడింది. రెండు హిట్లు పడినప్పుడు కాదు ఒక్క ఫ్లాప్ పడగానే బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అందుకే తెలుగులో అమ్మడికి చేతిదాకా వచ్చిన సినిమాలు చేజారిపోయాయి. పోనీ బాలీవుడ్ లో ఏమైనా వరుస ఆఫర్లు ఉన్నాయా అంటే అక్కడ అరకొర అవకాశాలే తప్ప పెద్దగా ఛాన్స్ లు రావట్లేదు. ఐతే తెలుగులో కొన్ని ఆఫర్లు వస్తున్నా కూడా మృణాల్ వాటిని వెయిటింగ్ లో పెట్టినట్టు తెలుస్తుంది. మరి కెరీర్ అటు ఇటుగా ఉన్నప్పుడు కూడా ఈ వెయిటింగ్ లు గట్రా దేనికన్నది అర్థం కావట్లేదు. ఐతే ఒక ఆఫర్ కి ఓకే చెప్పాక దానికంటే బెటర్ ఆఫర్ వస్తే కష్టం కదా అని మృణాల్ భావిస్తుంది. ఐతే అలా వెయిట్ చేస్తూ ఆఫర్లను హోల్డ్ లో పెడుతూ వస్తే ఇక ఉన్న ఆ ఒక్క ఛాన్స్ కూడా చేజారే అవకాశం ఉంటుంది. కథల విషయంలో నచ్చక వెయిట్ చేయడం మంచి విధానమే కానీ మరీ మృణాల్ ఠాకూర్ ఇలా రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగానే డీలా పడిపోవడం ఆమె ఫ్యాన్స్ ని కన్ ఫ్యూజ్ చేస్తుంది. మృణాల్ మళ్లీ తిరిగి తెలుగులో వరుస సినిమాలు చేయాలని ఆమె ఫాలోవర్స్ కోరుతున్నారు. ఐతే సినిమాల పరంగా దూరంగా ఉంటున్నా అమ్మడు ఫోటో షూట్స్ తో ఆడియన్స్ కు రెగ్యులర్ గా టచ్ లోనే ఉంటుంది. తప్పకుండా మృణాల్ కి మళ్లీ మంచి అవకాశాలు రావాలని ఆమె ని ఇష్టపడే ఆడియన్స్ కోరుతున్నారు.

# ఇతరుల కారణంగా పెళ్లితో బుక్కయ్యే యువతి కథ

పెళ్లి, పెళ్లి తర్వాత జీవితంలో మార్పులు అనూహ్యమైనవి. కెరీర్ లో సెటిలయ్యే క్రమంలోనే పెళ్లి టైమ్ వచ్చేస్తుంది. ఆఫీస్‌లో సహోద్యోగులు, ఇంట్లో వాళ్లు పెళ్లాడాలని నిరంతరం ఒత్తిడి చేస్తూనే ఉంటారు. అలాంటి ఒత్తిళ్ల కారణంగా పెళ్లి చేసుకున్న యువతి జీవితంలో ఏం జరిగింది? అనేదానిని పెద్ద తెరకెక్కిస్తున్నారు. అద్భుతమైన కామిక్ టైమింగ్, బోల్డ్ పెర్ఫామెన్స్ తో ఆకట్టుకునే రిచా చద్దా ఇలాంటి పాత్రలో నటిస్తే ఎలా ఉంటుందో అభిమానులకు చెప్పాల్సిన పని లేదు. ఆఖ్రి సోమవార్ పేరుతో ఈ సినిమాని రిచా స్వయంగా నిర్మిస్తున్నారు. రచయితగా, నిర్మాతగా ఈ సినిమాకి తాను పని చేస్తున్నానని రిచా చద్దా తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి దర్శకుడిని ఖరారు చేయాల్సి ఉంది. ఇది ఒక రొమాంటిక్ డ్రామా. తన సహోద్యోగులు, తల్లిదండ్రుల నుండి వివాహం చేసుకోవాలనే ఒత్తిడిని ఎదుర్కొనే ప్రఖ్యాత టీవీ నిర్మాత చుట్టూ కథ తిరుగుతుందని రిచా చెప్పారు. పెద్దల అంచనాలు, సంబంధాలు వ్యక్తిగత ఆకాంక్షలను



ఎలా నాశనం చేస్తాయో కూడా ఈ సినిమాలో చూపించనున్నారు. తన బంధువులు, పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు చేసుకోవడం చూశానని, అవన్నీ చూశాక ఈ ఆలోచన వచ్చిందని, ఈ సినిమా కథ హార్ట్ టచింగ్ గా ఉంటుందని రిచా వెల్లడించారు. కాలేజ్ లైఫ్ ముగిశాక జీవితం ఎలా మారుతుందో కూడా తెరపై చూపిస్తామని తెలిపారు. ఓవైపు కెరీర్ కావాలి.. మరోవైపు భర్త, కుటుంబం కావాలి. ముప్పై వయసుకే కలలు నెరవేరక తీవ్రంగా నిరాశపడి విసిగిపోతారు!! అంటూ రిచా నేటి యువతరం అనుభవాల గురించి ప్రస్థావించారు. ప్రేమ, పెళ్లిపై కొత్త ధృక్పథాన్ని తేవాలనే లక్ష్యంతో ఈ సినిమా చేస్తున్నానని రిచా అన్నారు. వివాహం, సంబంధాలను ఈ సమాజం ఎలా చూస్తుందో ఈ సినిమాలో చూడొచ్చు. అదే సమయంలో వినోదాత్మకంగా ఉంటూనే ఆలోచింపజేసే కథనంతో రక్తి కట్టిస్తుందని రిచా చెబుతున్నారు. నిజ జీవితంలోని పోరాటాల నేపథ్యంలో ఈ సినిమా ఆకట్టుకుంటుందని భరోసానిస్తున్నారు. గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్, హీరామండి, ఫుక్రీ, సెక్షన్ 375 లాంటి ప్రయోగాత్మక చిత్రాలలో ముఖ్య పాత్రలతో రిచా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536